
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
22-01-2025
సంపుటి : 01 | సంచిక : 260 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



## జన్మతః పౌరసత్వం రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన డొనాల్డ్ ట్రంప్
- వందేళ్ల విధానానికి స్వస్తి
- అక్రమ వలసదారులకు షాక్

2

## గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

- భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయి
- మీ అందర్నీ చూస్తుంటే నాలో నమ్మకం పెరిగింది
- భవిష్యత్‌లో నా కలలు నిజమవుతాయనే విశ్వాసం కలిగింది
- దావోస్‌లో సీఎం చంద్రబాబు



10

దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో తెలంగాణ ప్రభుత్వం అనేక కంపెనీలతో చర్చలు జరుపుతోంది. తెలంగాణ ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. యూనిలీవర్ కంపెనీతో తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం జరిపిన చర్చలు ఫలించాయి. తెలంగాణలో తయారీ యూనిట్ల ఏర్పాటుకు అంగీకరించింది. త్వరలో కామారెడ్డిలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది.



# తెలంగాణలో యూనిలీవర్ భారీ పెట్టుబడులు

### కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటు

- బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత
- తెలంగాణలో పెట్టుబడుల సానుకూలతలపై వివరించిన బృందం
- కంపెనీకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయో స్వయంగా వివరించిన రేవంత్
- ఈ ఒప్పందం వల్ల రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి
- యూనిలివర్ కంపెనీ రాష్ట్రంలో అభివృద్ధి చెందేందుకు పూర్తి సహకారం అందిస్తా
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ వెల్లడి
- సెమీ కండక్టర్ల పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులపై చర్చించిన శ్రీధర్ బాబు
- దావోస్ పర్యటనలో పలు ఒప్పందాలు చేసుకున్న తెలంగాణ రైజింగ్ బృందం



**దావోస్:** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో 'ఇండస్ట్రీస్ ఇన్ ఇంటెలిజెంట్ ఏజ్' థీమ్‌తో జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ రైజింగ్ నినాదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం వరుస భేటీలు, చర్చలు జరుపుతోంది. ఈ క్రమంలో తొలి ఒప్పందం కుదుర్చుకుంది. ప్రముఖ బహుళజాతి సంస్థ యూనిలివర్ కంపెనీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఆ కంపెనీ సీఈవో హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చెయిన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

మిగతా2లో...

### గ్రామ సభలు దగా..

# ఆరు గ్యారెంటీలు అమలు దగా

- ప్రజాపాలన కాదు, మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన
- ఊరూరా తిరగబడుతున్న జనం..ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకం
- ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా?..
- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజాపాలన కాదు, మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. మీ సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత

మిగతా2లో...




# ఢిల్లీ ఎన్నికల బరిలో 699 మంది అభ్యర్థులు

- న్యూఢిల్లీలోనే అత్యధికంగా 23మంది పోటీ
- కాంగ్రెస్, ఆప్ అన్నిచోట్ల పోటీ.. 68 స్థానాల్లో బరిలో బీజేపీ

**ఢిల్లీ:** దేశ రాజధాని నగరం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. అధికార, విపక్ష పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయాలు వేడెక్కాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గాను 699 మంది అభ్యర్థులు బరిలో

మిగతా2లో...

# 'కాళేశ్వరం' లక్ష్యమేంటి.. ఆదాయ సృష్టి ఎలా?

### డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా?

### రామకృష్ణారావును ప్రశ్నించిన కమిషన్



**విశ్వంభర, హైదరాబాద్:**

ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆయన్ను కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. ఇప్పటికే రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ప్రశ్నించారు.కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలు, ప్రాజెక్టు డిజైన్‌లు, బడ్జెట్ కేటాయింపులపై కమిషన్ ప్రశ్నించింది. కార్పొరేషన్‌కు నిధులు ఎలా సమకూర్చారు? కార్పొరేషన్ ద్వారా ఆదాయాన్ని ఎలా జనరేట్ చేస్తారు? డిజైన్ల

మిగతా2లో...



# సరూర్‌నగర్‌లో కిడ్నీ రాకెట్

### అలకనంద ఆసుపత్రి సీజ్

### జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు వెల్లడి

**విశ్వంభర, ఎల్బీనగర్:** సరూర్‌నగర్ డివిజన్‌లోని అలకనంద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో కిడ్నీ రాకెట్ వ్యవహారం కలకలం రేపింది. అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహణ, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, డీఎంహెచ్‌వో

మిగతా2లో...



# తొలిరోజు గ్రామసభలు విజయవంతం

- అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- ఇది నిరంతర ప్రక్రియ.. ఆందోళన చెందొద్దు
- గతంలో దరఖాస్తు చేయనివారికి గ్రామసభల్లో అవకాశం
- రేషన్ కార్డుల జారీకి సంబంధించి అర్హులైన వారి జాబితాను ప్రకటించలేదు
- దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అర్హులను ప్రకటిస్తాం

### నూతన పథకాల అమలుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుండి ప్రారంభమైన గ్రామ సభల్లో గతంలో ఈ పథకాలకు దరఖాస్తు చేసుకోనివారు కూడా ఇప్పుడు చేసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సహా పలువురు మంత్రులు స్పష్టం చేసారు. నేటి నుండి 24 వ తేదీ వరకు జరుగుతున్న గ్రామ సభల నిర్వహణ, ప్రజల స్పందన, నాలుగు పథకాల కు సంబంధించి జిల్లా కలెక్టర్లతో మంగళవారం సాయంత్రం

మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 127 | ₹ 149 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 216 | ₹ 246 |

### అంతేగా!





2

# భీకర ఎన్‌కౌంటర్

- 27 మంది మావోయిస్టులు మృతి
- మరి కొంత మందికి తీవ్రగాయాలు..
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- రణరంగంలా ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతం
- 16 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు



## మహాకుంభమేళాలో పూసలమ్ముకునే అమ్మాయికి బాలీవుడ్ బంపరాఫర్!

**ప్రయాగ్‌రాజ్:** మహాకుంభమేళాలో ఒక యువతి సంచలనంగా మారింది. ఇప్పుడు ఎక్కడ చూసినా ఆమె గురించే మాట్లాడుకుంటున్నారు.. సోషల్‌మీడియాలోనూ ఆమెపైనే చర్చలు.. అలా అని ఆమె ఏదో సెలబ్రెటీయో.. ధనవంతుల బిడ్డనో కాదు..

మిగతా2లో...



## జమిలీ ఎన్నికలపై ఈ నెల 31న జేపీసీ రెండో సమావేశం

లోక్‌సభ అధికారిక వెబ్‌సైట్‌లో సమావేశం వివరాలు వెల్లడి



2

# భీకర ఎన్‌కౌంటర్..

**గరియాబంద్:** ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. గరియాబంద్, నౌపాద జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటి వరకు చెందినట్టు సమాచారం. భీకర ఎన్‌కౌంటర్ కొనసాగుతుండటంతో రెండు రాష్ట్రాల సరిహద్దులోని అటవీప్రాంతం రణరంగంలా మారింది. ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు 27 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు భద్రతా బలగాలు గుర్తించాయి. మరి కొంత మందికి తీవ్రగాయాలవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు 16 మంది మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టులను చుట్టుముట్టిన కోబ్రా సైనికులు లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. మరో వైపు ఏకే 47లతో మావోయిస్టులు పెద్ద ఎత్తున కాల్పులు జరుపుతున్నారు. ఘటనా స్థలంలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు ఆపరేషన్ ముమ్మరం చేశాయి.

# 'కాళేశ్వరం' లక్ష్యమేంటి.. ఆదాయ సృష్టి ఎలా?

**మొదటిపేజీ తరువాయి**

విషయంలో నిబంధనలు పాటించారా? అని కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని రామకృష్ణారావు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు చెప్పారు. ప్రాజెక్టు తొందరగా కట్టారు కానీ, నిబంధనలు పాటించలేదని ఈ సందర్భంగా కమిషన్ వ్యాఖ్యానించింది. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం, రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారని కమిషన్ ప్రశ్నించగా.. పరిశ్రమలకు నీళ్లు విక్రయించి ఆదాయం పొందేలా చేయడమే ప్రాజెక్టు లక్ష్యమని రామకృష్ణారావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు ఫిజికల్ పాలసీలు పెట్టలేదని ఈ సందర్భంగా కమిషన్ రికార్డులు చూపించింది. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదు, ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులు నిర్వహించలేదని పేర్కొంది. ప్రాజెక్టు కోసం ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ రుణాలు తీసుకుందని, 9 నుంచి 10.5 శాతం వడ్డీతో రుణాలు చెల్లిస్తున్నామని రామకృష్ణారావు వివరణ ఇచ్చారు.

# సరూర్‌నగర్‌లో కిడ్నీ రాకెట్..

**మొదటిపేజీ తరువాయి**

వెంకటేశ్వర్లు.. సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన అమాయకులకు డబ్బులు ఆశ చూపి, ఇతర ప్రాంతల నుంచి డాక్టర్లను తీసుకొచ్చి కిడ్నీ మార్పిడి చికిత్సల ద్వారా డబ్బులు దండుకుంటున్నారు. ఈ విషయం బయటికి వెలుగు చూడటంతో వైద్యారోగ్య శాఖ అధికారులు ఆసుపత్రికి చేరుకుని పోలీసుల సహకారంతో తనిఖీలు చేపట్టారు.తమిళనాడుకు చెందిన ఇద్దరు, కర్ణాటకకు చెందిన ఇద్దరికి కిడ్నీ మార్పిడి చికిత్సలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలు కిడ్నీలు ఇవ్వగా.. వాటిని కర్ణాటకకు చెందిన ఇద్దరు రోగులకు అమర్చినట్టు దర్యాప్తులో తేలింది. కిడ్నీ దాతలతో పాటు, ఇద్దరు రోగులను నాలుగు అంబులెన్స్‌లలో పోలీసులు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆరు నెలల క్రితమే అలకనంద ఆసుపత్రి ప్రారంభమైందని, ఇద్దరు వైద్యులతో చిన్న.. చిన్న శస్త్ర చికిత్సలకు మాత్రమే అనుమతి ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఇటీవలే వారికి కిడ్నీ మార్పిడి చికిత్స జరగడంతో రోగులు అనారోగ్యానికి గురికాకుండా ముందు జాగ్రత్త చర్యగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అలకనంద ఆసుపత్రిని సీజ్ చేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసుపత్రి ఎండీ సుమంత్ చారీ, ఆసుపత్రి సిబ్బందిని అరెస్ట్ చేసినట్టు సరూర్‌నగర్ పోలీసులు తెలిపారు.

# జమిలీ ఎన్నికలపై ఈ నెల 31న జేపీసీ రెండో సమావేశం..

**ఢిల్లీ:** ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రతిపాదనలకు సంబంధించిన బిల్లులను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ రెండో సమావేశం ఈ నెల 31న జరుగనున్నది. ఈ మేరకు లోక్‌సభ అధికారిక వెబ్‌సైట్‌లో సమావేశం వివరాలు పబ్లిష్ అయ్యాయి. రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ) బిల్లులను గత శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ లో ప్రవేశపెట్టారు. బిల్లులను పరిశీలించాలని కమిటీకి సూచించారు. జేపీసీ తొలి సమావేశం ఈ నెల 8న జరిగిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ప్రతిపాదిత చట్టాల నిబంధనలను కమిటీకి న్యాయ మంత్రిత్వశాఖ ప్రతినిధులు, అధికారులు వివరించారు.సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు చట్టాల సవరణను రాజ్యాంగం, సమాఖ్యవాదం ప్రాథమిక స్ఫూర్తిపై దాడిగా అభివర్ణించారు. కమిటీకి బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. 39 మంది సభ్యుల కమిటీలో కాంగ్రెస్‌కు చెందిన ప్రియాంక గాంధీ, జనతాదళ్ (యూ)కు చెందిన సంజయ్ ఝా, శివసేనకు చెందిన శ్రీకాంత్ షిండే, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి సంజయ్ సింగ్, కల్యాణ్ బెనర్జీ, సాకేత్ గోఖలే (టీఎంసీ) ఉన్నారు. జమిలీ ఎన్నికలకు సంబంధించిన రెండు ముసాయిదా బిల్లులను పరిశీలించేందుకు రాజకీయ పార్టీలు సుముఖత వ్యక్తం చేయడంతో కమిటీ సభ్యుల సంఖ్యను కేంద్రం 39కి పెంచింది. కమిటీలో మాజీ కేంద్రమంత్రులు అనురాగ్ ఠాకూర్, పర్షోత్తమ్ రూపాలా, మనీష్ తివారీ, ఎంపీలు అనిల్ బలూని, బన్సూరి స్వరాజ్, సంబిత్ పాత్రా ఉన్నారు. కమిటీలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు.

# జన్మతః పౌరసత్వం రద్దు

**వాషింగ్టన్:** వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా పౌరసత్వాన్ని అందించే చట్టాన్ని నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేశారు. అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం పిల్లలకు ఈ హక్కు సంక్రమించాల్సి ఉంటుంది. తాజాగా దీనిపై ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. ''అక్రమ వలసదారులకు అమెరికాలో పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించదు'' అని ట్రంప్ ఈసందర్భంగా వ్యాఖ్యానించారు. ఆయన ప్రభుత్వం వలస విధానంపై తీసుకొనే చర్యలకు ఇది చిహ్నమని నిపుణులు చెబుతున్నారు. ఈసందర్భంగా అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం అందిస్తోందని ట్రంప్ తప్పుగా వ్యాఖ్యానించారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30 దేశాలు ఈ విధానంలోనే పౌరసత్వాన్ని అందజేస్తున్నాయి. అమెరికాలో అంతర్యుద్ధం తర్వాత 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ శరణార్థుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. ఈ విధానం దాదాపు శతాబ్దకాలంగా అమలులో ఉంది. అక్రమ చొరబాటుదారులకు పుట్టిన పిల్లలకూ, టూరిస్టు లేదా స్టూడెంట్ వీసాపై వచ్చిన వారికి అమెరికాలో కాన్పు కాగా పుట్టిన పిల్లలకూ ఈ నియమం వర్తిస్తుంది. కాగా, ఈ విధానాన్ని రద్దు చేసే ప్రయత్నానికి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది.



# ఢిల్లీ ఎన్నికల బరిలో 699 మంది అభ్యర్థులు

**మొదటిపేజీ తరువాయి**

నిలిచినట్లు ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం వెల్లడించారు. 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే (672మంది అభ్యర్థులు) ఈసారి పోటీ చేసేవారి సంఖ్య కాస్త అధికంగానే ఉన్నట్లు తెలిపారు. దిల్లీ ఎన్నికల ప్రధాన అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈసారి 981 మంది అభ్యర్థులు 1522 నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు పూర్తి కావడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను తాజాగా ప్రకటించారు.

**ఢిల్లీ పీఠం దక్కేదెవరికో..!**

ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీలోనే అత్యధికంగా 23మంది పోటీలో ఉన్నారు. ఆ తర్వాత జనక్‌పురిలో 16మంది, రోహ్తాస్ నగర్, కర్వాల్‌నగర్, లక్ష్మీనగర్‌లలో 15మంది చొప్పున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇకపోతే, పటేల్‌నగర్, కస్తూర్బా నగర్‌లలో అత్యల్పంగా కేవలం ఐదుగురు అభ్యర్థులు మాత్రమే పోటీ చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మొత్తం 70 నియోజకవర్గాలు ఉండగా.. 38చోట్ల 10మంది కన్నా తక్కువ మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. తిలక్‌నగర్, మంగోల్‌పురి, గ్రేటర్ కైలాస్ సీట్లలో ఆరుగురు చొప్పున; చాందినీ చౌక్, రాజేంద్రనగర్, మాలవీయనగర్‌లలో ఏడుగురు చొప్పున అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ మొత్తంగా అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తుండగా.. బీజేపీ 68 చోట్ల తన అభ్యర్థుల్ని బరిలో దించింది. మిగతా రెండు సీట్లను తన మిత్రపక్షాలైన జేడీ(యూ), ఎల్జేపీలకు కేటాయించింది. మరోవైపు, బీఎస్పీ 69 చోట్ల అభ్యర్థుల్ని పోటీలో ఉంచింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 5న నిర్వహించి.. 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్న విషయం తెలిసిందే.




**439 కేసులు నమోదు..**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వ్యవహారంలో 439 కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. జనవరి 7 నుంచి 20 మధ్య ఈ కేసులు నమోదైనట్లు తెలిపారు. అక్రమ కార్యకలాపాలు, ఆయుధాలు, మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు వీలుగా బోర్డర్ చెక్‌పాయింట్ల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. అలాగే, ఎన్నికల నేపథ్యంలో రూ.కోటి విలువ చేసే 38,075 లీటర్ల మద్యం, రూ.17కోట్ల విలువైన 104.90కిలోల డ్రగ్స్, 1200 నిషేధిత ఇంజెక్షన్లతో పాటు రూ.3.55 కోట్ల నగదు, 37.39 కిలోల వెండిని సీజ్ చేసినట్లు వివరించారు.

# తొలిరోజు గ్రామసభలు విజయవంతం

**మొదటిపేజీ తరువాయి**

సచివాలయం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. డిప్యూటీ సి.ఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి లు ఈ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు దాదాపు రూ.40 వేల కోట్ల రూపాయలు వ్యయం అవుతాయని వెల్లడించారు. దాదాపు పదేళ్ల తర్వాత రాష్ట్రంలో రేషన్ కార్డులు,



ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నందున ఈ రెండు పథకాలకు అత్యధికంగా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరి అనేది నిరంతర ప్రక్రియ అని, గతంలో దరఖాస్తు చేయని వారు ఈ గ్రామ సభలలో ఇవ్వొచ్చని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే వచ్చిన దరఖాస్తు దారుల్లో ఇల్లు లేని వారు, ఇళ్ల స్థలం ఉండి ఇల్లు లేని వారి జాబితా గ్రామ సభలలో తెలియచేయాలని, మరెవ్వరైనా దరఖాస్తు చేసుకోక పోతే తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు వివరించారు.

ఇప్పటివరకు రేషన్ కార్డుల జారీకి సంబంధించి అర్హులైన వారి జాబితాను ప్రకటించలేదని, అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప అర్హులైన వారిని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. నేడు జరిగిన గ్రామ సభలు విజయవంతంగా జరిగాయని, ఇందుకు జిల్లా కలెక్టర్లను అభినందించారు. ఈ నాలుగు పథకాలకు సంబంధించి స్వీకరించే దరఖాస్తులలో తప్పనిసరిగా దరఖాస్తుదారుల పేరు, ఆధార్ కార్డు నెంబర్, చిరునామా, ఇంటి అడ్రస్ తదితర వివరాలను తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. కాగా, నేడు రాష్ట్రంలో 4098 గ్రామాలలో గ్రామసభలను విజయ వంతంగా నిర్వహించినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణలో యూనిలీవర్ భారీ పెట్టుబడులు

**మొదటిపేజీ తరువాయి**


సమావేశమయ్యారు.కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు యూనిలివర్ సంస్థ అంగీకరించింది. రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం వల్ల కంపెనీకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయో సీఎం రేవంత్ స్వయంగా యూనిలివర్ సీఈఓ షూ మాకర్, చీఫ్ సప్లయి చైన్ ఆఫీసర్ విలియమ్ ఉయిజన్ లకు వివరించారు. తెలంగాణ ల్యాండ్ లాక్డ్ స్టేట్, పెట్టుబడులకు అనుకూలమైన సరైన వాతావరణ పరిస్థితులు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ఐటీ విజన్- 2050 పాలసీలో భాగంగా యూనిలివర్ కంపెనీకు పూర్తి మద్దతు ఇస్తామని, పెట్టుబడులు, వాణిజ్యాన్ని సులభతరం చేస్తామని వివరించారు.సౌత్ ఇండియాకు తెలంగాణ రాష్ట్రం వారధిగా, గేట్ వే గా ఉంటోందని తెలిపారు. తమ ప్రభుత్వం యూనిలివర్ కంపెనీకు పూర్తిగా సపోర్ట్ చేస్తుందని.. యూనిలివర్ కంపెనీ ఉత్పత్తులకు తెలంగాణలో మంచి గిరాకీ ఉందని తెలిపారు. అన్ని రకాలుగా సహకరిస్తుందని రేవంత్ టీం వారికి వివరించారు. చర్చల అనంతరం రాష్ట్రంలో రెండు యూనిట్ లను నెలకొల్పేందుకు యూనిలివర్ సంస్థ అంగీకరించింది. యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ బృందం జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపింది. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సానుకూలత వ్యక్తం చేసింది. రాష్ట్రంలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుందని ప్రకటించింది.యూనిలివర్ కంపెనీతో చర్చల అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. చర్చలు ఫలించడం శుభపరిణామం అని అన్నారు. ఈ ఒప్పందం వల్ల రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని స్పష్టం చేశారు. యూనిలివర్ కంపెనీ రాష్ట్రంలో అభివృద్ధి చెందేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్ విభాగం సభ్యులతో పాటు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్, ప్రిన్సిపల్ సెక్రటరీ వీ. శేషాద్రి, సీఎంఓ సభ్యులు ఈ. విష్ణు వర్ధన్ రెడ్డి, స్పెషల్ సెక్రటరీ బీ. అజిత్ రెడ్డి పాల్గొన్నారు. మరోవైపు రాష్ట్రంలో 500కోట్లతో రాకెట్ తయారీ, టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు స్కైరూట్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. స్కైరూట్ ఏరోస్పేస్ యాజమాన్యం, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే హైదరాబాద్‌ను ప్రైవేట్ రంగ అంతరిక్ష కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం సంతోషంగా ఉందని స్కై రూట్ కో ఫౌండర్ పవన్ కుమార్ చందన తెలిపారు. తెలంగాణ పెవిలియన్‌లో ప్రముఖ లాజిస్టిక్స్ కంపెనీ ఎజిలిటీ ఛైర్మన్ తారెక్ సుల్తాన్‌తో మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల ఆదాయం పెంచేందుకు ఇస్తున్న ప్రాధాన్యతలపై చర్చించారు. కాలిఫోర్నియాకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ సాంబనోవా సంస్థ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ సూలేతో మంత్రి శ్రీధర్ బాబు చర్చలు జరిపారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు.

# గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా

**మొదటిపేజీ తరువాయి**

ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా మీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని అన్నారు.ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు.

ఎన్నికల ముందు హామీలిస్తం.. అధికారంలోకి వచ్చాక ఎగ్గొడుతం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ



కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారిందని.. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా.. రుణమాఫీ చేయడం దగా.. పంట బోనస్ ఇవ్వడం దగా.. రైతు భరోసా అమలు దగా.. రేషన్ కార్డుల జారీ దగా.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను ప్రజలు తెలుసుకున్నారని తెలిపారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను నిలదీస్తున్నదని.. అడుగడుగునా ప్రశ్నిస్తున్నదని అన్నారు. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతరు.. ఎంత మందిని అరెస్టులు చేస్తరని నిలదీశారు. మీ రాక్షస పాలనలో విసిగి, వేసారిపోయిన తెలంగాణ ప్రజలు ఉప్పెనగా ఉద్యమించక ముందే కళ్లు తెరవండని హితవు పలికారు. ప్రతిపక్షాల మీద బురదజల్లడం మాని పరిపాలన మీద దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మహాకుంభమేళాలో పూసలమ్ముకునే అమ్మాయికి బాలీవుడ్ బంపరాఫర్!

**మొదటిపేజీ తరువాయి**

అందాల అప్సరస అంతకంటే కాదు.. చూడ్డానికి ఛామనఛాయ రంగులో ఉండే అత్యంత సాధారణ అమ్మాయి. పూసల దండలు అమ్ముకుని పొట్టబోసుకోవడమే ఆమె వృత్తి. అయినప్పటికీ ఆమె మహాకుంభమేళాలో స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. ఇందుకు కారణం కాటుక దిద్దిన అందమైన తేనే కళ్ళు.. అమాయకమైన చూపులు.. అవే ఇప్పుడు ఆమెను సోషల్‌మీడియా క్వీన్‌ను చేసింది. అంతేకాదు ఆ క్రేజ్‌నే ఇప్పుడు ఆమెకు బాలీవుడ్ నుంచి సినిమా ఆఫర్‌ను కూడా తీసుకొచ్చింది. మహాకుంభమేళాలో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచిన ఆ అమ్మాయి పేరు మోనాలిసా భోస్లే. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వీరి కుటుంబం తరాలుగా పూసల దండలు అమ్ముకుని జీవనం సాగిస్తోంది. తల్లిదండ్రులకు సాయంగా మోనాలిసా కూడా చిన్నతనం నుంచే పూసల దండలు అమ్ముతున్నది. ఈ క్రమంలోనే మహాకుంభమేళా సందర్భంగా పూసల దండలు అమ్ముకోవడానికి ప్రయాగ్‌రాజ్‌కు వచ్చింది. అక్కడే మోనాలిసా అమాయకపు మొహం, కాటుక దిద్దిన తేనె కాళ్లు చూసి కొంతమందికి ముచ్చటేసింది. దీంతో ఆమె ఫొటోలు, వీడియోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో ఆమె గురించి అందరికీ తెలిసింది. ఆ ఫొటోలు చూసిన వారు కూడా మోనాలిసా అందానికి ఫిదా అయ్యారు. మోనాలిసాతో సెల్ఫీలు దిగేందుకు, ఆమెను ఫొటోలు, వీడియోలు తీసేందుకు ఫొటోగ్రాఫర్లు, వ్లాగర్లు ఎగబడుతున్నారు. ఆమె అందాన్ని పొగిడేస్తూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలా మొత్తమ్మీద మోనాలిసా ఇప్పుడు సెన్సేషన్‌గా మారడంతో బాలీవుడ్ నుంచి కూడా ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. డైరెక్టర్ సనోజ్ మిశ్రా తన సినిమాలో మోనాలిసాకు ఛాన్స్ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం.మోనాలిసా రూపం, ఆమె అమాయకత్వాన్ని చూసి ఫిదా అయ్యానని సనోజ్ మిశ్రా తెలిపారు. డైరీ ఆఫ్ మణిపూర్ చిత్రంలో ఆమెకు ఛాన్స్ ఇవ్వాలని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సినిమా కోసం ఇలాంటి అమ్మాయినే వెతుకుతున్నానని.. తన సినిమాలో రైతు కూతురి పాత్రలో నటించేందుకు మోనాలిసా సరిగ్గా సెట్ అవుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తొందరలోనే ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి మోనాలిసాను కలుస్తానని చెప్పారు. ఆమెకు యాక్టింగ్ నేర్పించి మరి తన సినిమాలోకి తీసుకుంటానని స్పష్టం చేశారు.

# అలకనందా దవాఖానలో కిడ్నీ మార్పిడిపై పూర్తి విచారణకు మంత్రి రాజనర్సింహా ఆదేశం



**విశ్వంభర, ఎల్బీనగర్:** హైదరాబాద్ నగర పరిధిలోని సరూర్‌నగర్ అలకనంద హాస్పిటల్‌లో చట్టవిరుద్ధంగా జరుగుతున్న కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ వ్యవహారంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి వివరాలు తెప్పించుకుని పరిశీలించారు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉండి ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని వైద్యులను మంత్రి హెచ్చరించారు. ఈ కేసులో భాగస్వామ్యులైన డాక్టర్లు, హాస్పిటల్ యాజమాన్యం, ఇతర వ్యక్తులను ఉపేక్షించొద్దని, చట్ట ప్రకారం కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలు కోసం ఆరోగ్యశాఖ అధికారులతో ఇదివరకే టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించిన విషయాన్ని మంత్రి దామోదర్ రాజ నర్సింహా గుర్తు చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీలు మరింత పకడ్బందీగా పనిచేయాలని, ఇలాంటి వ్యవహారాలను నిరోధించేలా కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. హాస్పిటళ్లలో జరిగే ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని పోలీస్ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. అలకనంద హాస్పిటల్ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఫిబ్రవరి 5న మహా కుంభమేళాలో పాల్గొననున్న ప్రధాని మోడీ

**ప్రయాగ్‌రాజ్:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. త్రివేణీ సంగమంలో స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ మహాకుంభమేళాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకూడా పాల్గొననున్నట్లు తెలిసింది. వచ్చే నెల అంటే ఫిబ్రవరి 5వ తేదీన ప్రధాని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సైతం మహాకుంభ్‌ను సందర్శించే అవకాశం ఉందని తెలిసింది. ఫిబ్రవరి 10వ తేదీన రాష్ట్రపతి ముర్ము మహాకుంభమేళాకు వెళ్లనున్నట్లు సమాచారం.

# బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ నవీకరణ తక్షణమే చేపట్టాలి

- బ్యాంకుల విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- అఖిల భారత బ్యాంకు రిటైరెస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్.ఏం. దేశ్ పాండే, ప్రధాన కార్యదర్శి ఎస్.సి. జైన్




**విశ్వంభర, హైదరాబాద్:** దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ ను తక్షణమే నవీకరణ చేపట్టాలని అఖిల భారత బ్యాంకు రిటైరెస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ఎస్.ఏం. దేశ్ పాండే, ప్రధాన కార్యదర్శి ఎస్.సి. జైన్ లు డిమాండ్ చేసారు. హైదరాబాద్, సోమాజిగూడ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం అనంతరం దేశాభివృద్ధి, ఆర్థిక వృద్ధి మరియు విస్తరణలో బ్యాంకింగ్ రంగంలోని ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, దేశాభివృద్ధిలో భాగస్వాములైన బ్యాంకుల విశ్రాంత ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం, ఐబిఏ వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. గత 29 సంవతరాలుగా పదవీ విరమణ చేసిన బ్యాంకు ఉద్యోగులకు బేసిక్ పెన్షన్ లో ఎటువంటి పెరుగుదల లేక జీవితపు చరమాంకంలో అరకొర పెన్షన్ తో ఆర్థికంగా సామాజికంగా అనేక ఇబందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేసారు. పెన్షన్ నవీకరణ తోపాటు బేసిక్ పెన్షన్ గణనకై సెల్ అలెవెన్సు కలపాలని, రిటైరీల ఆరోగ్య భీమా ప్రీమియం బాంకులే భరించాలని, 12వ వేతన సవరణ లో ప్రకటించిన విధంగా ఎక్స్-గ్రేషియా చెల్లింపు సమీక్షించి పెంచాలని, ప్రైవేట్ బ్యాంకు పెన్షనర్లకు కూడా ఎక్స్-గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేసారు. ఐబిఏ తన మొండి వైఖరి విడి బ్యాంకు రిటైరెస్ ఫెడరేషన్ నేతలకు నేరుగా చేర్చలకు ఆహ్వానించి బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేసారు 40 ప్రభుత్వరంగ, ప్రైవేట్, సహకార, గ్రామీణ మరియు విదేశీ బాంకుల రిటైరీల అసోసియేషన్ల ప్రాతినిధంతో ఆల్ ఇండియా బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ ఏకైక అతి పెద్ద బ్యాంకు రిటైరీల సంఘం అని, దేశవ్యాప్తంగా మూడు లక్షలకు పైగా సభ్యత్వంఉందని, మూడు దశాబ్దాలకు పైగా బ్యాంకు రిటైరెస్ పెన్షన్, ఆరోగ్యభీమా ఇతర సంక్షేమ సౌకరాలకై నిరంతరం పోరాటం చేస్తుందని వారు తెలిపారు. బ్యాంకు రిటైరీల డిమాండ్ల పరిషాధానికై జనవరి 22-23 తేదీలలో హైదరాబాద్ లక్డిక పుల్, హొటల్ అశోక లో అఖిల భారత బ్యాంకు రిటైరెస్ ఫెడరేషన్ కేంద్ర కారవర్గ సమావేశాలు తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ ఆతిథ్యంలో జరుగుతాయని, దేశంలోని అన్నిరాస్ట్రాలనుండి 170 ప్రతినిధులు హాజరవుతారని, మూడురోజులపాటు జరిగే ఈ సమావేశాలలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జాతీయ సంయుక్త కార్యదర్శులు మిత్ర వశు, విశ్వనాథ నాయక్. ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మణ్ రావు, ఏంయెన్. రావు, కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణ మూర్తి. వి. వారణాసి, తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.వి. రమణ పాల్గొన్నారు.

## ఎబిసిడి సాధించలేక మాలలపై నెపం పెడుతున్న కృష్ణ మాదిగ: పిడమర్తి రవి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** 30 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాలలో వర్గీకరణ ఉద్యమం చేసుకుంటూ దాన్ని సాధించుకునే శక్తి లేక యుక్తి లేక బిజెపి అంటగాగి సాధించలేక డిప్రెషన్ లో మాలల పైన నెపం నెట్టుకుంటూ మందకృష్ణ పబ్బం గడుపుతున్నారని మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి మండిపడ్డారు. మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల వర్గీకరణ ఉద్యమంలో 2000 సంవత్సరంలో ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ అయింది ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది. చేతకానితనాన్ని మాలల పైన నెపం పెట్టి మాదిగ జాతిని తన వైపు తిప్పుకునే పనిలో మందకృష్ణ మాదిగ ఉన్నాడని పిడమర్తి రవి అన్నారు. ఎల్బీనగర్లో ఓయూ మాదిగ విద్యార్థి యువగర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ బిజెపి,మోడీని వీడి కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి అంటే తప్పకుండా వర్గీకరణ జరుగుతుంది. ఇంకా ఇతరుల పైన నెపం నెట్టడం వలన సరికాదు. రేవంత్ రెడ్డి మాత్రమే మాదిగలకు న్యాయం చేసే వ్యక్తి మన రాష్ట్ర ముఖ్యమంత్రి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన జాగృతి రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి ఉషారాణి, మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నక్క మహేష్, గిరిజన మహ శక్తి రాష్ట్ర అధ్యక్షులు చందర్ నాయక్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, దేవరకొండ నరేష్ ,జోగు గణేష్. గుర్రం కొటేష్, సుధీర్, రమేష్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు న్యాయం చేయాలి

**బీజేపీ మండల అధ్యక్షులు రెమడాలా రమేష్**

**విశ్వంభర, త్రిపురారం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు, రైతు భరోసా లాంటి పథకాల లబ్ధిదారులను వాస్తవికత ఆధారంగా చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేయాలని త్రిపురారం భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో మరియు ఏపీవో అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగింది. మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు యొక్క లబ్ధిదారుల వివరాలను అధికారులు వెల్లడించిన సందర్భంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో త్రిపురారం గ్రామాని కి సంబందించి కేవలం ఐదుగురు నీ ఎంపిక చేసి వెల్లడించడం దురదృష్ట కరమన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు రెమడాలా రమేష్, మెరుగు మహేష్, ఉర్థండు రామక్రిష్ణ, మేకల మధు, పొనుగోటి హరీష్, వల్లపూదాసు హుస్సేన్, మామిడి మహేష్ లు పాల్గొన్నారు.

## పోలీసులపై దురుసు ప్రవర్తన.. రిమాండ్

**విశ్వంభర, దేవరుప్పుల:** జనగాం జిల్లా దేవరుప్పుల మండలం జనవరి 09, 2025 న దేవరుప్పుల మండలం ఎస్ఐ ఊర సృజన్ కుమార్ తన సిబ్బందితో వెహికల్ చెకింగ్ చేస్తుండగా గొంగల్లా కృష్ణ కంచనపల్లి గ్రామం రఘునాథ్ పల్లి మండలానికి చెందిన వ్యక్తి త్రిబుల్ రైడ్ తో వచ్చి మద్యం సేవించి వాహనం నడపడంతో అతని ఆపగా అతను పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడు. అందుకు పోలీస్ లు అతనిపై కేసు నమోదు చేసి కోర్టు లో హాజరు పరిచారు. జనగామ కోర్టు అతనికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**విశ్వంభర, షాబాద్:** షాబాద్ మండలం మద్దూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభకు ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఆయన అన్నారు. లబ్ధిదారుల లిస్టులో పేర్లు లేని వారు ఉంటే గ్రామపంచాయతీ కార్యదర్శి తమ దరఖాస్తులను అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వైస్ ఛైర్మన్ కావలి చంద్రశేఖర్ ముదిరాజ్, షాబాద్ సహకార సంఘం డైరెక్టర్ రామ్ రెడ్డి, టేకులపల్లి రాఘవేందర్, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలో గందరగోళం

**విశ్వంభర, మహబూబ్ నగర్:** మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండల పరిధిలోని పోతులమడుగు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు , రేషన్ కార్డు అభ్యర్థుల పేర్లను ఏదో కొంతమందికి తన అనుకున్న వాళ్ల పేర్లు చదివి, మిగతా ప్రజల సమస్యలను అధికారులు వినకుండా ఇట్టి కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ఏకపక్షంగా పార్టీలకు కొమ్ముకాస్తూ అభ్యర్థులను ఎంపిక చేయడంలో అధికార పార్టీ కాంగ్రెస్ నేతల కనుసైగల్లో వివరిస్తున్న తీరును ప్రజలు విమర్శిస్తూ అక్కడి నుండి వెళ్లిపోయారు. కార్యక్రమంలో అధికారులు తన వంతు ఏదో చదివి ఇంతటితో గ్రామసభ అయిపోయిందని వెళ్లిపోయారు. ప్రజలు నిలదీయగా పంచాయతీ కార్యదర్శి నాకేం తెలియదు మళ్లీ అప్లై చేసుకోండని నిర్లక్ష్య ధోరణితో ప్రజలకు చెప్పడం జరిగింది.

## రూ.6లక్షలతో పార్కు సుందరీకరణ

**విశ్వంభర, హైదరాబాద్:** బాగంబర్ పేట డివిజన్ సీఈ కాలనీలో మంగళవారం ఆరు లక్షల రూపాయలతో సీ కాలనీ పార్క్ సుందరీకరణ పనులను ఇటీవల పూర్తి చేశారు. అంబర్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పోరేటర్ పద్మ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పార్కు చుట్టూ పరిసరాలను పాదయాత్ర ద్వారా సుందరీకరణ జరిగిన పనులను కాలనీవాసులు , అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కాలనీ సమస్య ఏదైనా ఉన్న నా దృష్టికి తీసుకురావాలని సమస్యను పరిష్కరిస్తానని కాలేరు అన్నాడు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ సభలు

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



**విశ్వంభర, మూసాపేట్:** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే గ్రామసభలు ప్రభుత్వం నిర్వహిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మండల పరిధిలోని కందూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు మాజీ ఎంపీపీలు దోనూర్ నాగార్జున రెడ్డి, కృష్ణయ్య , కందూర్ నాగిరెడ్డి, హేమవర్ధన్ రెడ్డి , రాములు, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## దశదినకర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన లవణం జనార్ధన్ దశదిన కర్మలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని జనార్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించివ అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపిటీసీలు సాల్వేర్ అశోక్, గొరిగే నరసింహ, పున్న వెంకటేశం, ఎండీ అమీర్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు మిర్యాల మల్లేశం, లవణం రాము, బొడ్డు అల్లయ్య, ఎండీ ఆజాజ్, ఆవుల శ్రీధర్, జాల అమరేందర్ రెడ్డి, ఎండీ మోసబ్, బాసాని రాజు, మేడి రాజు, కర్రె శీను, ఎండీ అంజాద్, భగవంతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**




**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభ లకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని అన్నారు. లబ్ధిదారుల లిస్టులో పేర్లు లేనివారు ఉంటే పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులకే పథకాలు అందించేటట్లు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంత రైతాంగానికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరును అందించి రైతన్నల కాళ్లు కడుగుతామని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని చెరువులను కృష్ణానది జలాలతో నింపుతామని అన్నారు. వెల్జాల గ్రామ ప్రజల చిరకాల కోరిక అయిన నూతన మండల ఏర్పాటుకు సహకరిస్తానని కనీసం 5 ఎంపీటీసీల స్థానాల నుంచి గ్రామసభ తీర్మానాలు తెచ్చినట్లయితే మండల ఏర్పాటు కొరకు కృషి చేస్తానని, వెల్జాల్ కేంద్రంలో రైతు సహకార సంఘం (పీఏసీఎస్) ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెల్జాల గ్రామంలో ప్రాథమిక హెల్త్ సెంటర్ 10 పడకల ఆసుపత్రిని నిర్మించడానికి కృషి చేస్తానని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన వెల్జాల్ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని, ఈ ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని విధాలుగా గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ



**విశ్వంభర, త్రిపురారం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించబోయే నాలుగు సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవడం జరిగింది. గతంలో జరిగిన కులగణన ఆధారంగా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ అధికారులు సర్వే చేపట్టారు. జనవరి 16 తారీకు నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సర్వే చేపట్టడం జరిగింది. తదుపరి సర్వేలో అర్హుల జాబితా సిద్ధం చేశారు. ఈ నెల 21 నుంచి 24 వరకు జాబితాలను ప్రదర్శింపచేయగా అట్టి పథకాల జాబితాలో పేరు లేని వారు ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ గ్రామసభల్లో మరోసారి దరఖాస్తులు చేసుకునేందుకు అనేకమంది ప్రజలు సిద్ధమయ్యారు. మంగళవారం త్రిపురారం మండలం వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయినటువంటి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మొదలగు పథకాలలో లబ్ధిదారుల గుర్తింపు కొరకు మంగళవారం మండలంలోని త్రిపురారం, అన్నారం, క్యాంపు కాపు వారి గూడెం, బడాయిగడ్డ, వస్త్రం తండా, అల్వాల్ పహాడ్, బృందావన్ పురం, అప్పలమ్మ గూడెం గ్రామాలలో గ్రామసభలు ఆయా అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించి గ్రామపంచాయతీలో అర్హుల జాబితాను ప్రవేశపెట్టగా అందులో జాబితాలో లేని పలు ఆశావహులు అసహనం వ్యక్తం చేయడం జరిగింది. గ్రామసభల్లో అర్హులు, అనర్హులైన వారిని గుర్తించుటకు గ్రామసభలు నిర్వహించడమైనది. ఈ క్రమంలో గ్రామసభలు నిర్వహించిన గ్రామ పంచాయతీలలో నుతనంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 39 అప్లికేషన్లు, ఇందిరమ్మ రైతు భరోసా కు 14 అప్లికేషన్లు, న్యూ రేషన్ కార్డులకు 156 అప్లికేషన్లు, ఇందిరమ్మ ఇండ్లకు 45 మొత్తం 257 అప్లికేషన్లు మంగళవారం అందినట్టు మండల అభివృద్ధి అధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, అగ్రికల్చర్ అధికారి, పంచాయతీ సెక్రటరీలు, ఆ గ్రామపంచాయతీ మాజీ సర్పంచులు, పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ఉచిత శిక్షణ



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం కేంద్రంలో బీసీ కమ్యూనిటీ హాల్లో డ్వాక్రా గ్రూప్ స్వయం సహాక సంఘాల మహిళలకు నాబార్డ్ సంస్థ వారి సహకారంతో సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో 20 రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరిగింది. సర్టిఫికెట్లు, మెటీరియల్ కిట్లు పంపిణీ చేయడానికి నాబార్డ్ రంగారెడ్డి జిల్లా డెవలప్మెంట్ మేనేజర్ డి హర్ష రఘురాం, సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్మెంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు క్రాంతి మేడం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కర్రల చంద్రయ్య ముదిరాజ్, వక్ఫ్ బోర్డ్ రంగారెడ్డి జిల్లా మాజీ ఛైర్మన్ మహమ్మద్ అబ్దుల్ సమీర్ విచ్చేశారు. ఈ ఉచిత శిక్షణ శిబిరాలను డ్రాక్రాగ్రూప్ స్వయం సహాక సంఘాల మహిళలు 20 రోజులపాటు జరిగిన ఈ శిక్షణ శిబిరంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు తమ సొంతంగా కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ మిషిన్లు తెచ్చుకొని వ్యాపారం చేసుకొని తమ కాళ్లపై తాము నిలబడాలని బాగా అభివృద్ధి చెందాలని ఇంకా ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలు ఎన్నో నిర్వహిస్తామని గ్రామీణ ప్రాంతాల ప్రజలను అభివృద్ధి చేయడనికి మా సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. 30 మంది మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ చేశారు కార్యక్రమంలో సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్మెంట్ రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ షేక్ హాజీ బాబా, కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ ట్రైనింగ్ మాస్టర్ సబిత, మహేశ్వరం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమలత, గ్రామస్వయం సహాక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవానికి హాజరవ్వాలని ఆహ్వానం



**విశ్వంభర, నాగోల్:** ఆర్యవైశ్య వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం ఈ నెల 31వ తేదీన నిర్వహించు కార్యక్రమానికి హాజరవ్వాలని కోరుతూ వి3 ఛానల్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తాకు మంగళవారం ఆర్యవైశ్య వాసవి మాత సేవాసమితి కొత్తపేట అధ్యక్షుడు గుండా రామ కోటేశ్వరరావు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గుండా రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా కొత్తపేటలోని మోహన్ నగర్ కమర్షియల్ టాక్స్ కాలనీలో కమర్షియల్ టాక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్ లో 108 కలశములతో అభిషేకము నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం లో పచ్చి పులుసు శ్రీనివాసరావు, పబ్బా కృష్ణమూర్తి, కామిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభలో కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**విశ్వంభర, మేడిపల్లి:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో దమ్మన్నపేట గ్రామం, కోరుట్ల పట్టణంలోని 2 వార్డ్ లో మంగళవారం జరిగిన గ్రామ సభలో కలెక్టర్ బి సత్యప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు.అలాగే అర్హులైన పేదవారికి ఏర్పాటు చేసిన గ్రామసభల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే గ్రామ సభలలో 4 పథకాల ద్వారా ఎంపిక చేయబడిన అర్హుల జాబితా గ్రామ సభలో అర్హుల పేర్లను ప్రవేశపెట్టారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నాలుగు పథకాల ద్వారా అధికారులందరూ క్షేత్రస్థాయిలో సర్వే చేసి అర్హులను జాబితా ఈరోజు గ్రామసభలో ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో, జివాకార్ రెడ్డి ఎమ్మార్వో, సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి ఒక లక్ష విరాళం



**విశ్వంభర, చేవెళ్ల:** చేవెళ్ల మండలం పామేన గ్రామంలో నూతనంగా శ్రీ వీరభద్ర స్వామి గుడి నిర్మిస్తున్నారు. గుడి నిర్మాణానికి తన వంతుగా ముడిమ్యాల సహకార సంఘం ఛైర్మన్ గోనె సరిత ప్రతాప్ రెడ్డి ఒక లక్ష ఒక వెయ్యి గుడి నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు, ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ వీరభద్ర స్వామి అంటే తనకు ఎంతో మక్కువ అని ఆయన తెలిపారు. గుడి నిర్మాణానికి విరాళం ప్రకటించినందున గ్రామ పెద్దలు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పామేన గ్రామ మాజీ సర్పంచ్ దవల్ గారి గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి ఎర్రగోపాల్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, కృష్ణ ,సుందర్, రఘు, కృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## భారత్ స్కౌట్స్, గైడెన్స్ ప్రారంభోత్సవ వేడుకలు

**విశ్వంభర, మెట్‌పల్లి:** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంమెట్ పల్లి బస్ డిపో దగ్గర గల స్థానిక అక్షర హైస్కూల్లో భారత్ స్కౌట్స్ మరియు గైడెన్స్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డికి విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు క్రమశిక్షణతో, నీతి నిజాయితీతో మరియు విలువలతో కూడిన విద్యను అభ్యసించి సమాజంలో మంచి పౌరులుగా ఉండాలని సూచనలు ఇచ్చారు. ఎంఈఓ చంద్రశేఖర రావు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులకు సూచనలు చేశారు. కరస్పాండెంట్ కొత్తూరు శ్రీనివాస్ మాట్లాడుతూ మెట్ పల్లి డివిజన్ స్థాయిలో స్కౌట్స్ మరియు గైడెన్స్ ప్రారంభించిన మొదటి పాఠశాలగా నిలిచింది అని అన్నారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడెన్స్ లో సభ్యత్వం తీసుకొని జీవితంలో ఉన్నత స్థాయిలకు ఎదగాలని విలువైన సూచనలు విద్యార్థులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఎస్సై కిరణ్ కుమార్ జిల్లా స్కౌట్ అధికారులు మధుసూదన్, వినోద్ తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించాలి

**విశ్వంభర, సూర్యాపేట టౌన్:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో తెలంగాణ పల్లె దావఖాన డాక్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి ప్రతి నెల బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించాలని, అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాజియా, డాక్టర్లు శ్రీశైలం, నాగరాజు పల్లెదావఖాన అసోసియేషన్ సభ్యులు, డాక్టర్ లు వీరేంద్రనాథ్, విజయ్, అనూష అమృత, అఖిల్, బిందు, రవీందర్ మౌనిక, మమత తదితరులు పాల్గొన్నారు.


## మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలను గుర్తించండి

**విశ్వంభర, భూపాలపల్లి:** గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయని, వివిధ వస్తువులు, గృహోపకరణాలు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ మొదలగు వాటి పేర్లు చెప్పి ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేసే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయనీ, ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దనీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని సైబర్ నేరగాళ్లు ఆశ చూపుతారని, ఆలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది ఎస్పీ తెలిపారు. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయని, ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోతారని సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటనల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చేయవద్దనీ, మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, గాని జిల్లా సైబర్ సెల్ వాట్సప్ నెంబర్ o918712658154 కు గాని, పోలీసు స్టేషన్లో గాని ఫిర్యాదు చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే కోరారు.

# గురజాడ అద్భుతసృష్టి కన్యాశుల్కం

**ఆధునిక సాహిత్యానికి వేగుచుక్క గురజాడ.కొత్తపాతల మేలుకలయికతో తెలుగువారి మత్తువదల గొట్టిన భావ విప్లవకారుడు గురజాడ.తనకి అవసరమైన సాహిత్యాన్ని ఆ తరమే సృష్టించుకొంటుందన్న సూక్తికి "కన్యాశుల్కం" ప్రత్యక్షనిదర్శనం. సాంఘిక నాటకాలు, స్వతంత్ర నాటకాలు, సామాజిక సమస్యగల నాటకాలు లేని లోటును "కన్యాశుల్కం" పూరించింది. కన్యాశుల్కం నాటకం 1897 లో ప్రచురించబడింది. అంతకు ముందే 1892 లో విజయనగరంలో ప్రదర్శింపబడింది. కొద్ది మార్పులతో రెండవ ముద్రణ పొందింది.అప్పట్లో విజయనగరం ప్రాంతంలో కన్యాశుల్కం ఆచారం బాగా ఉండేది. రాజావారు చేసిన సర్వే వల్ల ఏటా దాదాపు 344 బాల్యవివాహాలు జరిగేవని తెలుసుకొన్న గురజాడ కలత చెందగా "కన్యాశుల్కం" అనే ఒక గొప్ప సాంఘిక నాటకం మనకి లభించింది.**

## ఆధునిక సాహిత్య నుదుటి తిలకం




పద్యరచనలు రాజ్యమేలుతున్న కాలంలో వ్యవహారిక భాషలో రచన చేసి సాహిత్య లోకాన్ని వచనం వైపు, తద్వారా నాటకం వైపు మళ్లించిన పుస్తకం అది.వాడుక భాషలో మాండలిక యాస లో రచన చేయడం అంటే చేతకానితనంగా భావించే ఆ రోజుల్లో ప్రజలందరికీ అర్థమయ్యే జీవభాషలో రచన కొనసాగించి, ఆ రచన ప్రతి తెలుగువాడి గుండె గూటిలోకి వెళ్లి గుడి కట్టుకునేలా చేసిన ఉద్గ్రంథం అది.సంస్కృత మత్తులో అర్థం అయ్యి కాక తెలుగు సాహిత్యం జోగుతున్న సమయంలో ఆ మత్తుమందుకు విరుగుడు మందు ఇచ్చి తెలుగు సాహిత్యాన్ని ఉన్నత శిఖరాలను ఎక్కించి సంఘసంస్కరణ చేసిన నాటకం అది. కుహనా మేధావులు సభ్య సమాజమును అడ్డదారిలో భ్రష్టు పట్టిస్తున్నప్పుడల్లా, నేనున్నానంటూ ముందు వరుసలో నిలబడిన మహోన్నత సాగర ప్రవాహం ఆ నాటకం.

బాల్యమును చిదిమేస్తే సభ్య సమాజం సార్వనాశనం తప్పదని, ఆడపిల్లల ఉసురు పోసుకుంటే ఉన్నచోటే భూమి బద్దలవక తప్పదని నిరూపించిన కీర్తి కిరీటం .ముక్కుపచలారని పసిపిల్లలను వివాహం పేరుతో చీకటి గదులలో తోసేసి ఆనందపడే వికృత చేష్టలపై రగిలిన రణన్నినాదమే ఆ నాటక జననం.

శరీరాన్ని అప్పగించి అయిన కాడికి దోచుకుని ఆరోగ్యాలను పాడు చేసుకోవడం కాదు, ఒకరికి మాట ఇచ్చామంటే మాటమీద నిలబడే నీతివంతంగా బ్రతికే వేశ్యలు ఉంటారని శతాబ్దం క్రితమే నిరూపించిన నికార్సైన నాటక నిదర్శనమది.280 పేజీలను 130 సంవత్సరాలు గా సాహితీ ప్రియుల చేత తిరగేసేలా చేస్తున్న అద్భుత తెలుగు సాహితీ సంపద ఈ నాటక స్వర్ణము. 130 సంవత్సరాలు కాదు భూమి ఉన్నంతవరకు సమాజ మనుగడ కొనసాగుతున్నంతవరకు మనుషులు బ్రతికి ఉన్నంతవరకు, సజీవంగా ఎన్ని వసంతాలనైనా జరుపుకోగల సత్తాను ప్రదర్శిస్తూ కాంతి వార్థులను వెదజల్లుతున్న ఆ నాటక అమృత ధార పేరే కన్యాశుల్కం

కన్యాశుల్కం నాటకం ప్రదర్శింపడి 132 సంవత్సరాలు పూర్తయింది. మొదటి ప్రదర్శన 1892 ఆగస్టు13 న జగన్నాథ విలాసిని సభ వారు విజయ నగరం లో ఈ నాటక ప్రదర్శన చేశారు. మొదటి ముద్రణ మాత్రం 1897 లో జరిగింది.అయినా నిత్య నూతనంగానే విరాజిల్లుతుంది. అందుకు కారణం శతాబ్దం క్రిందట ఉన్న పరిస్థితులు, నేడు ఇంకా కొనసాగుతున్నవి అని చెప్పవచ్చు.

1897లో రెండవ ముద్రణ జరిగింది మహారాజా ఆనంద గజపతికి అంకితం ఇచ్చారు. అతి తక్కువ కాలంలో ఎక్కువ భాషలలోకి అనువదించబడిన నాటకంగా పేరుపొందింది. కన్నడం, తమిళం, రష్యన్, జర్మన్, ఫ్రెంచ్, ఆంగ్లము, ఎన్నో భాషలలో అనువదింపబడిన ఏకైక సాంఘిక నాటకం. కన్యాశుల్కం రెండో ప్రింటు ప్రచురితమైన 15 సంవత్సరముల వరకు ఎటువంటి ప్రదర్శన ఎక్కడ జరగలేదు నిడివి ఎక్కువ అవ్వటమే కారణం అని భావించి ఉండవచ్చు. తర్వాత పలువురు రంగస్థలం సినీ నటులు కూడా ఈ ప్రదర్శన ద్వారా మంచి పేరు తెచ్చుకున్నారు. మధురవాణి పాత్ర వేయడానికి నటులు చాలా ఉత్సాహం కనపరిచేవారు. ఆ తర్వాత జేబీ సోమయాజులు, జీవి రమణమూర్తి , ఏ ఆర్ కృష్ణ దర్శకత్వం లలో ఆంధ్రదేశం అంతటా కన్యాశుల్కం నాటక ప్రదర్శనలు ఇవ్వబడినవి. రోషనార, సత్య హరిచంద్ర, ఛత్రపతి శివాజీ, మొదలగు ఎన్నో నాటకాలలో స్త్రీ పాత్రలు ధరించిన నటస్థానం రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీత, శ్రీ స్థానం నరసింహారావు గారు మధురవాణి పాత్రను పోషించి ద్విగుణికృతం చేశారు. 2006 నుండి ఎన్నో టెలివిజన్ ఛానల్ లల్లో ధారావాహికంగా ప్రసారమైన నాటకం కన్యాశుల్కం. చలనచిత్రంగా కూడా ఇది విజయం సాధించిందని చెప్పవచ్చు. గురజాడ అప్పారావు గారు రచించిన ఈ నాటకం నాటి సమాజంలో ఒక పెద్ద విప్లవాన్ని తెచ్చింది అనడంలో సందేహం లేదు. కన్యాశుల్కం నాటకానికి సాటి రాగల రచన భారతీయ సాహిత్యంలో మృచ్ఛకటికం- (శూద్రకుడు సంస్కృతం లో రాసినది) తప్ప మరొకటి లేదు అని శ్రీరంగం శ్రీనివాసరావు చేత మెప్పించుకున్న నాటకం, కన్యాశుల్కం . గురజాడ ఆనాటి నాటక జాడ మాత్రమే కాదు నేటి సాహిత్య లోకానికి భావిజాడ కూడా.

బాల వితంతువుల మానసిక ఆంతరంగిక వ్యాధులను నీచమైన మానవ సంబంధాలను లంచవతారులైన లాయర్లను కుహన పెద్ద మనుషులను మొత్తంగా ఒక వంద సంవత్సరాలు చారిత్రక యుగాన్ని డాక్యుమెంటరీ చిత్రంగా ఆ కాలంలోకి వెళ్లి చూసి మళ్లీ తిరిగి వచ్చిన మనిషిగా మనల్ని ఊహించుకోక తప్పని పరిస్థితిని కల్పించే నాటక మంత్రం. మన కళ్ళ ముందు కనిపించే సంక్షోభంలోకి నెట్టబడుతున్న సమాజ చిత్రీకరణ కన్యాశుల్కం. అందుకే అంతటి , ఇంతటి ప్రాచుర్యం ఈ నాటకానికి ఎప్పుడూ ఉంటుంది.

తెలుగు సాహితీ లోకం గురజాడ అని పిలుచుకునే గురజాడ వెంకట అప్పారావు గారి వంశం తాతల కాలం నాడే కృష్ణాజిల్లా లోని గురజాడ గ్రామంలో నుండి విశాఖ జిల్లాకు వలస వెళ్లడం జరిగింది అక్కడే 21 సెప్టెంబర్ , 1862 సంవత్సరంలో విశాఖ జిల్లా ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో, కౌసల్యమ్మ, వెంకట రామదాసు దంపతులకు వేంకట అప్పారావు గారు జన్మించారు. తన పది సంవత్సరాల ప్రాంతం వరకు చీపురుపల్లిలో విద్యను అభ్యసించారు. తండ్రి కాలం చేయడంతో బీదరికంతో విజయనగరం మకాం మార్చి వారాలు చేస్తూ చదువు కొనసాగించాడు. ఎమ్మార్ కాలేజీ ప్రిన్సిపల్ చంద్రశేఖర శాస్త్రి సహాయంతో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి తన చిన్ననాటి మిత్రుడైన గిడుగు రామమూర్తి పంతులు గారితో వ్యవహారిక, వాడుక భాష రచనలలో మునిగితేలాడు గురజాడ.

తను జీవించిన కాలంలో విజయనగరంలో ఐదు , 6 సంవత్సరాల ముక్కుపచ్చలారని పసిపాపలకు 60 సంవత్సరాల వృద్ధులతో వివాహం చేయడం తనను ఎంతగానో కలచివేసింది, హృదయం ద్రవించింది. ఏదో చేయాలి ఈ సంఘాన్ని సంస్కరించాలి, సమాజాన్ని కొత్త జీవితం వైపు ఆరోగ్యకర నాగరికత వైపు నడిపించాలనుకున్నాడు గురజాడ. తన సహనం- ఆవేశంగా , ఆవేశం- ఆక్రోషంగా, ఆక్రోషం- అభ్యుదయంగా, అభ్యుదయం- విప్లవంగా మారింది, ఆ మార్పే నేటి 132 సంవత్సరాల కన్యాశుల్కంగా ఆవిర్భవించింది.

కన్యాశుల్కం (కన్య= పెళ్లికాని స్త్రీ ; శుల్కం =డబ్బు) అనగా డబ్బులు ఇచ్చి అమ్మాయిలను కొనుక్కునే సంస్కృతి. ఆపై అన్ని అధికారాలు కొనుక్కున్న అతడికే ఉండే ఆచారం. ఆ ముదుసలి భర్త చనిపోతే తెల్లచీరతో బయట ప్రపంచాన్ని చూడలేని శిరోమండనంతో ఉండే వేదనా భరిత జీవిత గాథలు కోకొల్లలు. అందుకే ఆ కాలంలో ఒక సంవత్సరంలో విజయనగరం రాజా వారి సర్వే లెక్కల ప్రకారం 300 పైచిలుకు బాల్యవివాహాలు జరిగాయి ఈ ధోరణి మార్చాలనుకున్నాడు గురజాడ.

ఆంధ్రదేశంలో జరుగుతున్న మూఢాచారాలు బాల్య వివాహాలు మోసాలు తాగుబోతులు సమాజంలో పెద్దమనుషులుగా చలామణి అవుతూ దరిద్రపుగొట్టు పనులు చేసే బ్రాహ్మణ అయ్యగార్లు , లంచావతార్లు, కుహనా మేధావులు మరియు ముఖ్యంగా బాల్య వితంతువులు, వేశ్యా వృత్తి చేసే వారి జీవన విధానం, అగ్రహారీకుల ఆధిపత్యం , స్త్రీల దుస్థితి, నాడు ప్రచారంలో ఉన్న అన్ని రకాల జీవన స్థితి గతులు ఈ నాటకంలో వస్తువులు గానే మనకు కనిపిస్తాయి.

ఖగపతి యమృతముతేగా భుగ భుగ మనిపొంగి చుక్క భూమిని వ్రాలెన్ పొగ చెట్టయి జన్మించెను పొగతాగనివాడుదున్నపోతై పుట్టున్అ ని గిరీశం చేత చెప్పించి జనం వాడుకలో నేటికీ నాలుకలపై నా నేటట్లుగా చేశాడు . ప్రతిపాత్రను దేనికి అదే సాటి అనే విధంగా తీర్చి దిద్దాడు. మాండలిక భాష , యాసను, వాడుక భాషను పాత్రల ద్వారా విపరీతంగా వాడుకున్నాడు . అందుకే జన సామాన్యంలోకి తొందరగా నాటుకు పోయింది కన్యాశుల్కం నాటకం. అగ్నిహోత్రావధానులు - కృష్ణరాయపురం అగ్రహారీకుడు; వెంకటేశం- కుమారుడు ; కరటక శాస్త్రి- అగ్నిహోత్రావధా నుల బావమరిది ; లభ్ధావ ధానులు- రామచంద్రపురం అగ్రహారీ కుడు; గిరీశం- వెంకటేశంకు చదువు నేర్పించే గురువు; అన్ని ఒక ఎత్తుగా భావిస్తే మధురవాణి- నీతిమంతురాలైన వేశ్యగా నాటకానికి పుష్టి చేకూర్చింది అని చెప్పవచ్చు.

అద్భుత సన్నివేశాలు ఆకర్షణీయ సంభాషణలు కడుపు చెక్కలయ్యే సున్నితమైన హాస్యాలు మాంత్రికులు, వైద్యుల రంగస్థలం ప్రవేశంతో నాటకం మరింతగా రక్తి కడుతుంది. .... కన్యాశుల్కం నాటకం ద్వారా జన భాహుళ్యం లోకి ఎన్నో పలుకుబడులు ఉత్పన్నమై ప్రజల నాలుకల మీద నానుతున్నాయి.

**పలుకుబడులు**

మనవాళ్లు వట్టి వెధవాయలోయ్/, డామిట్ కథ అడ్డం తిరిగింది /, నమ్మించోట చేస్తే మోసం నమ్మనిచోట చేస్తే లౌక్యం / లెక్చర్లు ఎంతసేపు సిటీలోనే గాని పల్లెటూర్లలో ఎంత మాత్రం పనికిరావు/ ఒపీనియన్స్ అప్పుడప్పుడు చేంజ్ చేస్తుంటే గాని పొలిటీషియన్ కానేరడు/ వీడిసిగధరగా/ తస్సదియ్యా/ కోన్ కిస్కా/ శని విరగడయిపోయింది/ మగవాడికైనా ఆడదానికైనా నీతి ఉండాలి/ మొదలవి ఎన్నో జనం నాలుకల మీద ప్రతిరోజు నాట్యం చేసే పదాలు గా, నానుడులు, సామెతలుగా ఈ సంభాషణ లే స్థిరపడినాయి. మధురవాణి వేశ్యగా ఒకరితో ఉన్నప్పుడు వారి మాటలకు ఒప్పందానికి కట్టుబడి ఉంటుంది. మరొకరిని తాకనివ్వని నీతిమంతురాలైన వేశ్యగా ఉంటుంది. ఈ పాత్ర వలన వేశ్యల మీద గౌరవం పెరిగే అవకాశం పెంపొందిందని చెప్పవచ్చు.

ఈ నాటకం మొత్తంగా బాల వితంతువుల, మనోవేదనను ఒక కాన్వాస్ పై గీసిన బొమ్మగా, ఒక తెరపై చూపిన సినిమాగా, మన పక్కింట్లో ఉన్న మనిషిగా మనసుకు హత్తుకుపోయే విధంగా హృదయాంతరాలలో దొంతరలుగా గుర్తుకు చేసే విధంగా బుచ్చమ్మ, మీనాక్షి పాత్రలు చిత్రించబడ్డాయి.

పురుషులకు స్త్రీ వేషం వేసి అమ్మ చూపడం అనేది హాస్యముతో పాటు గుణపాఠం చెప్పేదిగా ఉంటుంది. చివరగా దొంగ సాక్షులు, లీడర్ తీసుకునే ఫీజులు, తాగుబోతుల మనస్తత్వాలు, జూదం (పేకాట) ఆడే వ్యసనపరులు నాటి కాలం లో ఉన్నా, నేటి సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. వితంతువులకు వివాహం చేయాలనే సంకల్పం కలిగి ఉండడం సమాజ సంస్కరణలలో గొప్ప మార్పు.

"తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి/ కొంచెం నిలువుగా కొలవ లేనప్పుడు తిరిగేసైనా కొలిస్తే నాలుగు గింజలు నిలుస్తాయి/" అనే మాటలు నిజజీవితంలో ప్రతిరోజూ పాత్రికేయులు రాస్తూనే ఉన్నారు, చర్చల్లో ఉదాహరణలు గా చెబుతూనే ఉన్నారు, ఇదంతా గురజాడ గారి కలము చలవే అని చెప్పవచ్చు

బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టాయి కన్యాశుల్కం లేకుండా పోయింది. కానీ వరకట్న పిశాచి మళ్లీ స్త్రీల జీవితాలను పెనం నుంచి పోయిలో పడ్డట్టు చేస్తున్నాయి, ఈ రెండిటిలోనూ పురుషాధిక్యమే కనిపిస్తుంది. ఈ రోగిష్టి సమాజం ఉన్నంతవరకు మనుషుల జీవితాన్ని రెండో కోణంలో చూపించగలదు కన్యాశుల్కం . అందుకే సాంఘిక , సామాజిక సమస్యలను ఇంట్లోంచి బయటకు లాగి బాహాటంగా కుండా బద్దలు కొట్టగల ఆవేశం ఉన్న గురజాడను ఆధునిక మహాకవి గానే కాదు విప్లవ, అభ్యుదయ , నాటక రచయితగా హృదయాల్లో నిలుపుకుంటారు. నాలుగు మాటల్లో కన్యాశుల్కం వర్ణించడం అంటే చందమామ ను అద్దం లో చూపడమే. అందుకే ఆధునిక సాహిత్య నుదుటి తిలకం కన్యాశుల్కం అని చెప్పవచ్చు.



- డాక్టర్ మెంత బోయిన సైదులు

# ట్రంప్ నిర్ణయంతో భారతీయులపై ప్రభావమెంత?

## అమెరికా జన్మతః పౌరసత్వం రద్దు చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్

వలసదారులకు అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం అందించే చట్టాన్ని నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేశారు. దాదాపు వందేళ్లుగా అమల్లో ఉన్న విధానానికి ఒక్క ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌తో ఫుల్‌స్టాప్ పెట్టారు. ''అక్రమ వలసదారులకు అమెరికాలో పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించదు'' అని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రవాస భారతీయులపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? చట్ట సవరణ సాధ్యమేనా?

ఏంటీ జన్మతః పౌరసత్వ హక్కు..

అమెరికా చట్టాల ప్రకారం.. ఆ దేశ పౌరులకు పుట్టిన వారికి మాత్రమే కాకుండా.. అమెరికాలో జన్మించిన ప్రతి ఒక్కరికీ అక్కడి పౌరసత్వం లభిస్తుంది. అమెరికా గడ్డపై పుట్టినవారంతా ఈ దేశ పౌరులే అనే ఉద్దేశంతో 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ద్వారా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగింది. అయితే, తాజాగా ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో దీనికి బ్రేక్ పడింది. ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం.. బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒక వేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ.. శాశ్వత నివాసి కాకపోయినా పుట్టిన పిల్లలకు అమెరికా



పౌరసత్వం రాదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ.. తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటున్నా అదే నియమం వర్తిస్తుంది.

**ప్రవాస భారతీయులపై ప్రభావం ఉంటుందా?**

అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుల సంఖ్య చాలా వేగంగా పెరుగుతోంది. 2024 చివరి నాటికి 5.4 మిలియన్ల మంది ఎన్నారైలు అక్కడ నివసిస్తున్నారు. అమెరికా మొత్తం జనాభాలో సుమారు 1.47 శాతం భారతీయులే. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టినవారు. మిగతావారంతా వలసదారులు. ఈ నేపథ్యంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయం భారతీయులపై ప్రభావం చూపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాత్కాలిక వీసాపై అమెరికా వెళ్లి.. గ్రీన్ కార్డుకోసం వేచిచూస్తున్న వారికి పుట్టిన పిల్లలెవరికీ అమెరికా పౌరసత్వం లభించదు.

**ప్రభావం ఎలా?..**

అమెరికాలో భారతీయ తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలకు ఇప్పటిలా అక్కడి జన్మతః పౌరసత్వం లభించదు.ఇప్పటికే గ్రీన్ కార్డు రాక ఇబ్బంది పడుతున్న చాలా మంది భారతీయ వలసదారులు, వారి పిల్లలకు కూడా అక్కడి పౌరసత్వం రాకపోతే.. గ్రీన్ కార్డు జారీ ప్రక్రియ మరింత ఆలస్యమవుతుంది.

అమెరికాలో జన్మించిన వారికి జన్మతః పౌరసత్వం లభించకపోతే.. వారికి 21 ఏళ్లు నిండిన తర్వాత తమ తల్లిదండ్రులను అమెరికాకు తీసుకొస్తామని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేరు. దీనివల్ల తల్లిదండ్రులు భారత్‌లో, పిల్లలు అమెరికాలో ఉండాల్సి వస్తుంది. చట్టపరమైన సమస్యలు ఎదురుకావొచ్చు.

'బర్త్ టూరిజం' మాయమైపోతుంది. పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించాలన్న ఉద్దేశంతో.. ఉన్నత స్థితిలో ఉన్న చాలా మంది భారతీయ మహిళలు.. డెలివరీ సమయానికి అమెరికా వెళ్లిపోతుంటారు. దీనినే 'బర్త్ టూరిజం' గా చెబుతుంటారు. ఇకపై దీనికి బ్రేక్ పడనుంది.నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాపై అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థులకు జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించడం దాదాపు అసాధ్యం. అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థుల్లో ఎక్కువ మంది భారతీయులే. ప్రత్యేకంగా ఇంజినీరింగ్, టెక్నాలజీ విభాగాల్లో ఎక్కువగా ఉంటారు. వీరిలో కొందరు ఇతర దేశాలకు చెందిన వారిని అక్కడే వివాహం చేసుకుంటారు. ఇలాంటి వారు ఇకపై పిల్లల విషయంలో చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.2011లో అమెరికా ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్ విడుదల చేసిన వాస్తవ పత్రం ప్రకారం.. ఒక వేళ జన్మతః పౌరసత్వాన్ని నిలిపివేస్తే దాని ప్రభావం దాదాపు అందరిపైనా పడుతుంది. అమెరికా ప్రజలు కూడా తమ పిల్లలు ఈ దేశానికి చెందిన వారే అని నిరూపించుకోవాల్సి వస్తుంది.

**అంత సులువు కాదు..**

అధ్యక్షుడు ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేసినప్పటికీ, ఈ విధానాన్ని రద్దు చేసేందుకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశముంది. అమెరికా రాజ్యాంగంలోని నిబంధనలను మార్చడం చాలా సుదీర్ఘ ప్రక్రియ అంతేకాకుండా సవాళ్లతో కూడుకున్నది. అమెరికా రాజ్యాంగాన్ని సవరించడానికి హౌస్, సెనేట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ ఓట్లు అవసరం. ఆ తర్వాత రాష్ట్ర శాసనసభల్లో నాలుగింట మూడొంతుల మంది దానిని ఆమోదించాలి. కొత్త సెనేట్‌లో డెమొక్రాట్‌లకు 47 స్థానాలు ఉండగా.. రిపబ్లికన్లకు 53 స్థానాలున్నాయి. మరోవైపు హౌస్‌లో డెమొక్రాట్లకు 215 స్థానాలు, రిపబ్లికన్లకు 220 స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ రాజ్యాంగ సవరణ అంత సులభం కాకపోవచ్చు.

## జ్ఞానజ్యోతిని వెలిగించు..

నీ జ్ఞానం...
నీకు అర్హతను...
నీ అర్హత
నీకు అధికారాన్ని..!
నీ సత్ప్రవర్తన
నీకు సంఘంలో
సమానత్వాన్ని...
గొప్ప గౌరవాన్ని..!
నీ సేవా గుణం...
నీ జాలి గుణం...
నీ త్యాగ గుణం...
నీ ప్రేమతత్వం...!
నీ మంచితనం
నీ మానవత్వం...
నీ వినయ విధేయత...
నీకు అపారమైన
కీర్తి కిరీటాలనందిస్తాయి..!
నీ ప్రతిభతో జరుగు
నీకు పట్టాభిషేకాలే...
సన్మానాలు సత్కారాలే..!
అట్టి విలువలు కలిగిన
నీది ఆదర్శ జీవితమే...
ఆపై నీ జన్మ ధన్యమే...
నీవు పొందే ఆ ఘనకీర్తి
అజరామరమే...ఆచంద్రతార్కమే..!
అందుకే
ఓ మిత్రమా..!
నా ప్రియ నేస్తమా..!
జ్ఞాన జ్యోతిని వెలిగించు..!
విజ్ఞాన సూర్యుడవై విశ్వంలో
ప్రకాశించు.!



పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
(విశ్వంభర, హైదరాబాద్)

# పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చే రోడ్ మ్యాప్ ప్రకటించాలి

- ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి
- హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా




**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మాట ప్రకారం సాగులో ఉన్న ప్రతి ఎకరానికి హక్కు పత్రం ఇవ్వాలని దాని కోసం ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో గిరిజన సలహామండలి (టీఏసీ) సమావేశాలు, జిల్లా స్థాయిలో ఐటీడీఏ పాలక మండలి సమావేశాలు నిర్వహించి ఎజెండాలుగా పెట్టి చర్చించాలని ప్రతి సమావేశంలో వీటి అమలుకు సంబంధించి తీసుకున్న చర్యల నివేదిక (ఎటీఆర్) ఆధారంగా చర్చించాలి. అసెంబ్లీలో కూడా ప్రత్యేక చర్చ చేపట్టాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ (ధర్నా చౌక్) వద్ద ఆదివాసీలు రాష్ట్రంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మహాధర్నా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అధ్యక్షతన జరిగింది. పలు డిమాండ్ల పైన పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మిడియం బాబురావు మాట్లాడుతూ.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దశాబ్దాల నుండి నివాసం ఉంటున్న ఎస్టీ కోయ ఆదివాసి షెడ్యూల్ తెగలకు చెందిన గొత్తి కోయ వలస ఆదివాసీలకు కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. వారు పుట్టుకతో ఆదివాసీలు అయినప్పటికీ ఎటువంటి ప్రభుత్వ పథకాలు వీరికి అందటం లేదు. ఆదివాసీలు సాగులో ఉన్న ప్రతి ఎకరానికి హక్కు పత్రం ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామి ఇచ్చింది. దీని అమలు కోసం ప్రయత్నాలు ప్రారంభించాలని, రోడ్ మ్యాప్ ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తునికాకు లభ్యమయ్యే అన్ని యూనిట్లలో ఆకు సేకరణ జరిగేలా టెండర్లు వెంటనే నిర్వహించాలని, అలాగే తునికాకు కార్మికులకు అటవి శాఖ నుండి రావాల్సిన బోనస్' బకాయిలను వెంటెనే చెల్లించాలని, ఆన్లైన్లో పెద్ద ఎత్తున్న అవతవకలు జరుగుతున్నందున నగదు రూపంలో గ్రామ సభలో డబ్బులు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని, కట్టరేటు రు.5/-లు నిర్ణయించాలని కోరారు. నకిలీ కులధృవీకరణ, ఏజెన్సీ ధృవీకరణ పత్రాలపై ఐటీడీఏల ద్వారా విచారణ చేసి, నకిలీ ధృవపత్రాలను జారీ చేసిన అధికారులపై కేసులు పెట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ డీఎస్ సీని ప్రకటించి, ఏజెన్సి ప్రాతంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జీవో ఎంఎస్ నం.3 పునరుద్ధరణ కోసం కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేయాలి. 50 శాతానికి పైగా ఆదివాసీ జనాభా ఉన్న, అటవి ప్రాంతంలో ఉన్న గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించి 5వ షెడ్యుల్లో కలపాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల అమలు ఆదివాసీ ప్రాంతాల నుండి అమలు చేయడానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రారంభించాలి. ఉట్నూర్, భద్రాచలం గిరిజన బీఎడ్ కళాశాలలతో సహా, అన్ని విద్యా సంస్థలో ఖాళీగా ఉన్న భోదన, భోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. ఈ ధర్నాకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవి కుమార్, లంక రాఘవులు, ఎరామ పున్నం, అత్రం తనుష్, సహాయ కార్యదర్శులు పోలెం రాజేందర్, కారం పుల్లయ్య, కోట శ్రీనివాస్, గొంది రాజేష్, తొడసం శంభు, రాష్ట్ర కమిటీ సభ్యులు కోరేంగ మాలశ్రీ, బైరి సోమేష్, గౌరీ నాగేశ్వరరావు, మడవి రమేష్ పాల్గొన్నారు.

## స్వర్ణకార ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ధర్మకాంట




**విశ్వంభర, చార్మినార్:** తెలంగాణ ముఖ్య ప్రాంతమైన పాతబస్తీలో జరిగిన స్వర్ణకార యూనియన్ ఎన్నికల్లో హెూరాహెూరీ పోటీ జరగడంతో సూర్య ధనుస్సు మరియు సింహంలను ఓడించి ధర్మకాంట విజయకేతన్ ఎగరవేసింది. గత పదేళ్ల నుంచి ఎలాంటి ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఈ సంవత్సరం పోటీ అన్ని సంఘాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోటీ రసవత్తరంగా మారింది. మొత్తం 900 ఓట్లు పోలు కాగా 200 ఓట్ల మెజార్టీతో ధర్మకాంట సంఘం గెలుపుపొందింది. అధ్యక్షులుగా కోమ్ డోజు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరం వేణుగోపాల చారి, కోశాధికారిగా కాసుల శ్రీధర్ ఆచారి నియమితులయ్యారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి పథకాలు అందేలా చూడాలి



**విశ్వంభర, కందుకూరు:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీని నియమించింది. ఈ కమిటీలో మూడు నెలల ముందు ప్రతి పార్టీ నుండి ముగ్గురు సభ్యులు ఎస్టీ ఒకరు బీసీ ఒకరు ఎస్సీ ఒకరు అని గ్రామపంచాయతీ వద్ద పిలిపించి కమిటీలు వేయడం జరిగింది. కానీ కాంగ్రెస్ పార్టీ ఏకపక్షం తో వాళ్ల అనుకూలంగా ఉన్న సభ్యులనే నియమించుకోవడం జరిగింది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు ఈ ప్రభుత్వం చేయకూడదని, అర్హులైన ప్రతి ఒక్క పేదవానికి పథకాల అందేలా చర్యలు తీసుకోవాలని గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్ తెలిపారు.

## లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ సభలు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న ప్రత్యేక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల నిమిత్తం నిర్వహించే ప్రత్యేక గ్రామ సభల్లో మొదటి రోజైన 21వ తేదీ మంగళవారం ఇస్కిళ్ళ, పల్లివాడ, బోగారం, నీర్నెముల, లక్ష్మాపురం, బాచుపల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో జరిగాయి. ఇందులో ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. గ్రామస్తులు అడిగిన సందేహాలకు, సమాదానాలు ఇచ్చారు. గ్రామస్తుల సూచనలను పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. కొత్త దరఖాస్తులను స్వీకరించారు. లక్ష్మాపురం గ్రామంలో కొందరి పేర్లు లేవని అధికారులకు, గ్రామస్తులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారి, ఏ.పి.ఎం, ఆయా గ్రామాల గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభకు హాజరైన ఎమ్మెల్యే




**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామంలో గ్రామ సభ కాంగ్రెస్ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గడిసందు అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ హాజరయ్యారు. సభను ఉద్దేశించి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పాలన ఎంతో బాగుంది, అనుకున్నది వెంటనే ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలన్నీ లబ్ధిదారులకు అందే విధంగా చేరుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ముల్క వెంకన్న, మూలగండ్ల రాజు, చిన్నం నాగయ్య, చల్ల వెంకన్న, గండు ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



**విశ్వంభర, చింతపల్లి:** అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు సముద్రాల నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతపల్లి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకులు నక్క వెంకటేష్ యాదవ్ విచ్చేసి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, మంజూరు చేయాలని, రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలని అలాగే కౌలు రైతులు అందరికీ కూడా ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా సంవత్సరానికి 12,000 రూపాయలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పినటువంటి ఆరు గ్యారెంటీలు సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న స్థానిక ఎలక్షన్లలో గ్రామ గ్రామాన కాంగ్రెస్ లీడర్లని నిలదీస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుక్కడపు రామ కృష్ణ, వెన్నం శేఖర్, ఎండి. జహంగీర్, బొడ్డు మహేష్, మోర వెంకటరమణ, గొడుగు శ్రీనివాస్, కుందేళ్ళ శ్రీశైలం, బిక్కు భాస్కర్, అభినవ్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, భీమేష్, మల్లేష్, రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేయాలి




**విశ్వంభర, డిండి:** బీఆర్ఎస్ డిండి మండల నాయకులు ఎలిమినేటి వెంకట్ ద్రావిడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, చేయూత పింఛన్లు, మహాలక్ష్మి, యువ వికాసం హామీలు ఇచ్చిన పథకాలన్నీ అమలు చేయాలని, తెలంగాణలో ప్రతి గ్రామంలో ఈ పథకాలలో ఏకపక్షంగా కాకుండా అన్ని వర్గాలకు అర్హులైన వారందరికీ పథకాలు అమలు చేయాలని కోరారు. రాబోయే సర్పంచ్ ఎలక్షన్ల ను దృష్టిలో పెట్టుకొని ప్రజలను మోసం చేసే విధంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులలో మోసపూరితమైన మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. ఎలక్షన్లలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి ఆరు గ్యారెంటీల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఎలిమినేటి వెంకట్ ద్రావిడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ




**విశ్వంభర, భూపాలపల్లి:** సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం రేగొండ మండలంలోని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు 16వ తేది నుండి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి విచారణ తదుపరి లబ్ధిదారుల ఎంపికకు 21వ తేదీ నుండి 24వ తేది వరకు గ్రామ పంచాయతి, మున్సిపల్ వార్డుల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభలలో పథకాలకు గుర్తించిన లబ్ధిదారుల జాభితా గ్రామస్థులు సమక్షంలో చదివిన తదుపరి ప్రజల నుండి అభ్యంతరాలను తీసుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని, ఇంకనూ ఎవరైనా ఉంటే దరకాస్తు చేయాలని సూచించారు. పంట సాగవుతున్న ప్రతి ఎకరాకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రెండు విడతలుగా ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. సాగు భూమి లేని వ్యవసాయ కూలి కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నెలకు వేయి రూపాయలు మంజూరు చేయుటకు తయారు చేసిన జాభితా గ్రామసభల్లో పెట్టడం జరిగిందని అర్హులైన వారి పేర్లు లేకపోతే దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. ఈ పథకానికి ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పథకం పనులు చేసిన కుటుంబాలను అర్హులుగా తీసుకోనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలు నిరంతర ప్రక్రియ అని అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనకు గురి కావొద్దని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలను స్వయంగా జాభితాపై అభ్యంతరాలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామసభ ప్రారంభానికి ముందు ప్రభుత్వ సందేశాన్ని ఎంపీడీఓ చదివి వినిపించారు. ఈ గ్రామసభలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వర రావు, వ్యవసాయ అధికారి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మీ షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్**



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్, కేసముద్రం, నెల్లికుదురు, ఇనుగుర్తి, మండలాల సంబంధించిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాధిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ డా.భూక్యా మురళీ నాయక్ ముఖ్య అతిధిగా పాల్గొని 211 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 21,124,476 ల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని, సమాజంలోని ప్రతి వర్గానికీ ఆర్థిక భద్రత కల్పించడం లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలు పేద కుటుంబాల్లో కూతుళ్ల పెళ్లిళ్ల కోసం ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించినవని, వీటిని ప్రతి అర్హుడు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. పేదలు, రైతులు, వృద్ధులు మరియు ఇతర వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు

**కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**



**విశ్వంభర, మహేశ్వరం/తుక్కుగూడ:** గ్రామ సభల ద్వారా గతంలో ఇచ్చిన దరఖాస్తుల పరిశీలన, కొత్త అప్లికేషన్లు తీసుకోవటం జరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు తప్పకుండా అధికార యంత్రాంగానికి సహకరిస్తూ లబ్ధిదారులను గుర్తించాలని కోరారు. గతంలో ఇచ్చిన అప్లికేషన్లలో ఏమైన తప్పులు ఉంటే సరి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా ఇస్తామని కేఎల్ఆర్ భరోసా ఇచ్చారు. అర్హులకు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి సమాచారం సేకరించాలని లక్ష్మారెడ్డి చెప్పారు. అనర్హులను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేసి లిస్ట్ నుంచి పేర్లు తొలగించేలా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కిచ్చెన్నగారు సూచించారు.

## ఆగిరాలలో ప్రారంభమైన క్రికెట్ టోర్నీ




**విశ్వంభర, కొందుర్గు:** కొందుర్గు మండలం ఆగిరాల గ్రామంలో జరుగుతున్న ఛాంపియన్ ట్రోఫీ సీసన్-2 క్రికెట్ టోర్నమెంట్ ను మంగళవారం ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలపై ఇష్టం పెంచుకొని ఆడితే గ్రామస్థాయి నుండి జిల్లా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి రాణించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, కొందుర్గు జడ్పీటీసీ తనయుడు రామక్రిష్ణ, కొందుర్గు బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, కొందుర్గు మాజీ ఎంపీపీ తనయుడు పోతురాజు గోపాల్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాదేవ్పూర్ రవిందర్ రెడ్డి, పార్వత పూర్ మాజీ సర్పంచ్ బాల్వంత్ రెడ్డి, ఆగిరాల మాజీ సర్పంచ్ భీమయ్య, ఎంకిర్ యాల్ మాజీ సర్పంచ్ గోవింద్, తంగేలపల్లి మాజీ సర్పంచ్ బాల్ రాజు, చెరుకుపల్లి మాజీ సర్పంచ్ ప్రేమ్, మాదేవ్ పూర్ మాజీ సర్పంచ్ రాం చెంద్రయ్య, గంగనాగూడ మాజీ సర్పంచ్ శేఖర్, చిన్నఎలికి చెర్ల మాజీ సర్పంచ్ శేఖర్, అయోధ్యపూర్ మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్, జిల్లెడ్ చౌదరి గూడ మండలం సర్పంచ్లు, సంగం ప్రెసిడెంట్ బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆలయ గర్భగుడిలో అపచారం



**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో అపచారం జరిగింది. గర్భగుడిలో ప్రైవేట్ ఆల్బమ్ కోసం షూటింగ్ చేసారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని ప్రముఖ శైవక్షేత్రం కాళేశ్వరం ఆలయంలోని గర్భగుడిలో ప్రైవేటు సంస్థ నిర్మిస్తున్న పాట చిత్రీకరణ చేసినట్లు భక్తులు తెలిపారు. దర్శనానికి వచ్చిన భక్తులను నిలిపివేసి ఆల్బమ్ షూటింగ్ చేయడం పట్ల ఆలయ అధికారుల తీరుపై భక్తులు తీవ్ర విమర్శలు చేశారు. షూటింగ్పై దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోలేదని ఆలయ పవిత్రతను దెబ్బతీశారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేసారు. ఒకవైపు కుంబాభిషేకం, సరస్వతీ పుష్కరాలపై రాష్ట్ర మంత్రి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ప్రపంచవ్యాప్తంగా కాళేశ్వర ఆలయ విశిష్టతను తెలియజేయాలని చూస్తుండగా ఆలయ అధికారులు మాత్రం నిబంధనలను తుంగలో తొక్కి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆలయ కార్యనిర్వాహణ అధికారి మారుతి ని వివరణ కోరగా గర్భగుడిలో షూటింగుకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, కుంభాభిషేకం, పుష్కరాల ఆహ్వానం కోసం తాను ఆలయ సిబ్బందితో కలిసి శృంగేరి పీఠాధిపతులను ఆహ్వానించడానికి వెళ్లానని తెలిపారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి ఆలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని ఆయన వివరణ ఇచ్చారు.

## దామెర్ల రామారావు యాదిలో..



**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు ప్రాంతాలలో ఆధునిక చిత్ర కళకు నేటి తరాలకు మార్గదర్శి దామెర్ల రామారావు అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా దామెర్ల రామారావు యాది లో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ రాజమండ్రిలో జన్మించిన దామెర్ల చిత్ర కళ పై పలు ప్రయోగాలు చేసి ప్రాశ్యత్య చిత్ర కళను ప్రాంతీయత తో మిళితం చేశారని చెప్పారు. అయన సృజించిన చిత్ర కళ దామెర్ల శైలి గా గుర్తింపు పొందినదనీ తెలిపారు. తక్కువ వయస్సులోనే మరణించిన దామెర్ల ప్రాంతీయత ను ప్రతిబింబించే కార్తీక పౌర్ణమి, తూర్పు కనుమల గోదావరి వంటి చిత్రాలు ప్రసిద్ధమైనవి అని తెలిపారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్థన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సంఘ సేవకుడు నైషధం సత్యనారాయణ మూర్తి గాయకుడు కె శివ కుమార్ గాయని మల్లాది ఉష పాల్గొన్నారు.

## మరోసారి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీ బూతులలో బీజేపీ నూతన అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రం రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గం అసెంబ్లీ కో కన్వీనర్ గోరటి నరసింహ, కౌన్సిల్ సభ్యులు లక్ష్మణ్ కలిసి బూత్ అధ్యక్షులకు మంగళవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఆమనగల్లు మున్సిపాలిటీ ఎలక్షన్ లో మరోసారి భారతీయ జనతా పార్టీ జెండా ఎగరాలని అన్నారు. ముఖ్యంగా తమ తమ బూతులలో బీజేపీ భారీ మెజార్టీ గెలవాలని, ఆమనగల్ మున్సిపాలిటీ ఛైర్మన్ పీఠాన్ని మరోసారి కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం కో కన్వీనర్ రవిరాథోడ్, విష్ణు, ప్రవీణ్ రెడ్డి, సాయిబాబ, అశోక్, తల్లోజు శ్రీను, పవన్ కాళ్యాణ్, శ్రీనివాస్, గోరటి నరసింహ, కృష్ణ, గుజ్జరి శ్రీను, పాలాది శ్రీను, సంపంగి శ్రీనివాస్, కేశవులు, పాపయ్య, బాలు, జగన్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామానికి చెందిన పులిజాల కిష్టమ్మ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం వారి ఇంటికి వెళ్లి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన వంతుగా 3 వేల రూపాయల సహాయాన్ని వారి కుమారులు పులిజాల అంజయ్య, పులిజాల కృష్ణయ్య అందచేశారు. అదే విధంగా తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి తరుపున 3 వేల రూపాయలు మరియు శతబ్ది టౌన్ షిప్ ఛైర్మన్ కాసు శ్రీనివాస్ రెడ్డి తరుపున 4 వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో పద్మ పాండు, రాజమోని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# రూ.49 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- అభివృద్ధిలో దూసుకుపోతున్న చిల్కానగర్ డివిజన్
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**విశ్వంభర, చిల్కానగర్:** ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, చిలకానగర్ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి చిల్కానగర్ డివిజన్లోని సుమారు 49 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవం చేశారు. 39 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బ్యాంక్ కాలనీ మొదటి అంతస్తు సంక్షేమ సంగం భవన నిర్మాణ శంకుస్థాపన, నార్త్ కళ్యాణపురి పార్కులో 10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని దశలవారీగా తీర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని బ్యాంక్ కాలనీలోని సంక్షేమ సంగం మొదటి అంతస్తు భవనాన్ని నిర్మిస్తామని గతంలో ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం మొదటి అంతస్తు ప్రారంభోత్సవం చేసుకున్నామని తెలిపారు. అదేవిధంగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ దంపతులు ప్రతినిత్యం ప్రజలలో ఉంటూ ప్రజాసంక్షేమం కోసం అనునిత్యం పాటుపడుతూ ముందుకు సాగుతున్నారని వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి కాలనీలో బస్తీలో సంక్షేమ సంఘాల బలోపేతం ఎంతో అవసరమని ఈ సంక్షేమ సంఘాల ద్వారానే కాలనీలు అభివృద్ధికి దోహదపడతాయని ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో ఉంటుందని కొనియాడారు. అదేవిధంగా తమ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని, మా గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఇలా పనుల ద్వారా రుణం తీర్చుకుంటున్నామని తెలిపారు. చిల్కానగర్ డివిజన్లో సుమారు 80 కోట్ల నిధులతో ఇప్పటి వరకు అభివృద్ధి జరిగిందని చాలా సంతోషంగా ఉందని తెలుపుతూ ముఖ్యంగా ఈ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులకు సహకరిస్తున్న మా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, నెల్లికుదురు:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డా.భూక్య మురళీ నాయక్ జిల్లా కేంద్రం మహబూబాబాద్ తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ ప్రతి వధువు ఇంటి వరాల లక్ష్మి అన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు పెళ్లింటిలో సంతోషాలు నింపడానికి కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు గుగులోతు బాలాజీ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, మాజీ ఏఎంసీ వైస్ ఛైర్మన్ జిలకర యాలాద్రి, యూత్ మండల్ అధ్యక్షులు మద్దిరాజేష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బధిర పాఠశాలకు టీవీ, హెల్త్ కిట్ల పంపిణీ



**విశ్వంభర, ఎల్బీనగర్:** ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలకు సగౌర చారిటబుల్ సొసైటీ చేయూతనందించింది. మలక్పేట్ లోని ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాల కు టీవీ, హెల్త్ కిట్ల ను అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు వీటిని ఉపయోగించుకోవాలని, అభివృద్ధి పథంలోకి వెళ్లాలని సూచించారు. సభ్యులు సూర్య ప్రకాష్, రావి పాపన్న, అనురాధ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పరిమళా రెడ్డి, సంగీత, పరిమళ దేవి, పీ ఆర్ టీ యూ నాయకులు మందడి వెంకట్ రెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


## కాళేశ్వరం ఆలయ ఈవో, సిబ్బందిని సస్పెండ్ చేయాలి



**విశ్వంభర, కాళేశ్వరం:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడుతూ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం గర్భగుడిలో ఒక ప్రైవేట్ సాంగ్ చిత్రీకరించారని దీనిపై ఆలయ ఈఓ సిబ్బందిపై తక్షణమే సస్పెండ్ చేయాలని అన్నారు. గర్భగుడిలో పాట చిత్రీకరించిన వాళ్లపై చర్యలు తీసుకొని ఆ పాటను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆలయ సంప్రదాయాలను పట్టించుకోకుండా వ్యవహరించినందున ఆలయ ఈవో సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేదంటే కలిసి వచ్చే అన్ని ప్రజాసంఘాలు, హిందూ సంఘాల తోటి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని పీక కిరణ్ అన్నారు.

## అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు

– మెదక్ ఆర్డీఓ రమాదేవి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** అర్హులైన వారందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. ఆరేపల్లి లో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెడుతున్న ప్రత్యేక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల నిమిత్తం నిర్వహించే ప్రత్యేక గ్రామ సభల్లో మొదటి రోజైన 21వ తేదీ మంగళవారం ఆరేపల్లి జి వెంకటాపూర్ బూరుగుపల్లి జములా నాయక్ తండ బద్దారం గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారుల ఆద్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ గ్రేసీ బాయ్, ఎంపీడిఓ రఫీక్ఉ నిస్సా, మండల వ్యవసాయ అధికారి, నాగం కృష్ణ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ ఏ.పి.ఎం, ఆయా గ్రామాల గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 58 జీఓలో సర్వే చేసిన పేదల ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి

సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్



**విశ్వంభర, మహబూబాబాద్:** 58 జీవోలో సర్వే చేసిన పేదల ఇండ్లకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, ఇంటి నెంబర్లను కేటాయించాలని, కరెంటు సౌకర్యం కల్పించాలని, రోడ్లు డ్రైనేజీ స్కూలు తదితర మౌలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం పై డిమాండ్లతో కూడిన వినతి పత్రం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సాల్ టోప్పో కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ధర్నాకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ బట్టు చైతన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ హలావత్ లింగన్న మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మాణం చేసుకొని నివాసం ఉంటున్న ప్రతి పేదవాడికి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న ప్రతి పేదవాడికి పట్టాలు ఇస్తామని 58 జీవోను తీసుకురావడం జరిగింది. 58 జీవోలో గుడిసెలు వేసుకున్న ప్రతి పేదవాడు అప్లై చేసుకోగా నాటి ప్రభుత్వం 58 జీవో కింద పేదల ఇండ్ల సర్వేలు నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ ముందుగా కొంత మందికి అనగా 30 శాతం మందికి పట్టాలను అందించింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం అవుతున్న పేదలు నివాసం ఉంటున్న ఇండ్లకు పట్టాలు ఇస్తామని హామీ చెప్పిన ఇప్పటికీ అమలు కావడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ లాగిన్ లో ఉన్న పేదల పట్టాలను వెంటనే పేద ప్రజలకు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఇవ్వని ఎడల ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్, సబ్ డివిజన్ నాయకులు సామ పాపయ్య, కుక్కముడి యాకయ్య, సామ రజిత, గుండెల కృష్ణ, శివారపు శారద, కుక్కమూడి అనిత, కల్పన, మునిత సోమయ్య, మాలోత్ శ్రీను, ముత్తయ్య, కళ్యాణి, వేణు, తదితరులతోపాటు 200 మంది పేదలు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అర్హుల ఎంపికకే గ్రామ సభలు



**విశ్వంభర, భూపాలపల్లి:** సంక్షేమ పథకాలు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హులను ఎంపిక చేసేందుకు ప్రజల సమక్షంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం చిట్యాల మండలం చల్లగరిగ, రేగొండ మండలం సుల్తాన్ పూర్, గణపురం మండలం కర్కపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రజల మధ్యలో ఎంపిక జరగాలని నిష్పక్షపాతంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పథకాలు అమలు అనేది నిరంతర ప్రక్రియ అని ప్రజలు సహకారం అందించాలని సూచించారు. గత పది సంవత్సరాలు కాలంలో ఒక రేషన్ కార్డు ఇవ్వలేదని కానీ తమ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టిన వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న ఉగాది నుండి సన్న బియ్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సన్నవడ్లకు 500 రూపాయలు బోనస్ కూడా ప్రభుత్వం చెల్లిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 55 వేల ఉద్యోగాలు నియమాకం చేశామని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు చిన్నయ్య, డాక్టర్ కుమారస్వామి, తహసీల్దార్లు హేమ, సత్యనారాయణ స్వామి, ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, భాస్కర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు కిష్టన్న, శ్రీదేవి, సింగిల్ విండో ఛైర్మన్ విజ్జనరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రంపు ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

రష్యా సోషలిస్టు నిర్మాత కా. లెనిన్ వారసత్వాన్ని కొనసాగిద్దాం




**విశ్వంభర, హైదరాబాద్:** సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మార్క్సిస్టు మహోపాధ్యాయులు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది. లెనిన్ రచించిన పుస్తకాలు, గ్రంథాలపై 5గురు వక్తలు బోధించారు. ముందుగా మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రమ అధ్యక్షతన ప్రారంభోపన్యాసం, కెచ్చెల రంగయ్య (మాస్ లైన్ సీనియర్ నాయకులు) చేశారు. కెచ్చెల రంగయ్యతోపాటు, సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్, మాస్ లైన్ సెక్రటేరియట్ సభ్యులు కె.జి. రాంచందర్, వి. కృష్ణ, ఓపీడీఆర్ నాయకులు భాస్కరరావు, ఇల్లందు మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్యలను వేదికపైకి ఆహ్వానించారు. కెచ్చెల రంగయ్య (సెక్రటేరియట్ సభ్యులు) ప్రారంభోపన్యాసం చేస్తూ వంద సంవత్సరాలు పూర్తయినా ఈనాటికి లెనిన్ రనచలు అనుసరణీయమైనవని అన్నారు. కారల్ మార్క్స్ సృష్టించిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, ఆచరణలో నిరూపించిన సోషలిస్టు సమాజాన్ని నిర్మించిన మహాయోధుడు లెనిన్ అన్నారు. అనంతరం మాస్ లైన్ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్ ప్రస్తుత పరిస్థితులలో లెనినిజం ప్రాధాన్యత అంశంపై మాట్లాడుతూ అనుసరణీయ, ఆచరణాత్మక, సైద్ధాంతిక కర్త లెనిన్ అన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారి సోషలిజాన్ని నిర్మించారని అన్నారు. నేటికీ ఆయన రచనలు భారతదేశానికి అనువర్తించుకోవడానికి సరిపోతాయని అన్నారు.

## రియల్ ఎస్టేట్ బ్రోకర్ని చెంప చెల్లుమనిపించిన ఎంపీ



**విశ్వంభర, పోచారం:** నిరుపేదలను ఇబ్బందిపెడుతున్న రియల్ ఎస్టేట్ బ్రోకర్పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల భూములను కబ్జా చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఈటల రాజేందర్ ఒక్కసారిగా కోపంతో రగిలిపోయారు. ఇందుకు కారణమైన రియల్ ఎస్టేట్ బ్రోకర్పై ఉగ్రరూపంతో ఊగిపోయారు. అంతే చెంప చెల్లుమనిపించారు. పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తావా అంటూ మండిపడ్డారు. దీంతో ఎంపీ ఈటల రాజేందర్ అనుచరులు సైతం ఆ రియల్ ఎస్టేట్ బ్రోకర్పైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మేడ్చల్ జిల్లా పోచారం కొర్రెములలో, పోచారం మున్సిపాలిటీ ఏకశిలానగర్లో ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతుండగా వారంతా తమ గోడు వెళ్లబోసుకున్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు తమ భూములను కబ్జా చేస్తున్నారని, తమ భూముల్లో కట్టడాలు నిర్మిస్తే డబ్బులు చెల్లించాలని ఇబ్బంది పెడుతున్నారంటూ వాపోయారు. దీంతో కోపంతో రగిలిపోయిన ఎంపీ ఈటల రాజేందర్ సదరు రియల్ ఎస్టేట్ బ్రోకర్పై చేయి చేసుకున్నారు. మళ్లీ రిపీట్ అయితే సహించేది లేదు అని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తమకు న్యాయం చేయాలని బాధిత పేద ప్రజలు వేడుకుంటున్నారని చెప్పుకొచ్చారు. కబ్జాలు, కూల్చివేతలు, దౌర్జన్యాలు, దోపిడీలు పెట్రేగిపోతున్నాయని ఎంపీ ఈటల ఆరోపించారు. ఈ అంశంపై ఇప్పటికే సీపీకి, ఇతర పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడించారు.

## పేరుకే గ్రామ సభలు

అర్హులకు అందని ఆరు గ్యారెంటీలు



**విశ్వంభర, జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆరుగ్యారెంటీలను ప్రవేశపెట్టింది అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సబ్సిడీ పథకం ఇప్పటికే ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్ల పథకం కోసం అర్హులైన జాబితాను తయారు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అందులో భాగంగా గ్రామ సభలో అర్హులైన జాబితాను గ్రామ సభలో ప్రవేశపెట్టారు. అర్హులకు ఇవ్వకుండా అనహర్హులకు. ఇచ్చారని ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ పేర్లు రానివాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ప్రజలను కోరారు.

## నిరుద్యోగులను ఉద్యోగులుగా మారుస్తున్న ఏబీవీ ఫౌండేషన్

– డాక్టర్ ఎన్ గౌతమ్ రావు




**విశ్వంభర, బర్కత్ పుర:** శిక్షణ ఇచ్చి నిరుద్యోగులను ఉద్యోగులుగా మహిళలను ఆర్థికంగా ఎదిగే విధంగా చేస్తూ ఆ దిశగా అడుగులు వేస్తున్న ఏబీవీ ఫౌండేషన్ సేవలు హర్షించదగ్గవన్నారు గౌతమ్ రావు. హైదరాబాద్ బర్కత్ పుర బీజేపీ నగర కార్యాలయంలో అటల్ బిహారీ వాజ్పేయి ఫౌండేషన్ (ఏబీవీ) స్కిల్స్ సెంటర్ సర్టిఫికెట్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు మాట్లాడుతూ ఏబీవీ ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగాల అవకాశాలను కల్పిస్తూ, కొందరు స్వచ్ఛందంగా టైలరింగ్ షాప్స్ బ్యూటీషియన్స్ ఏర్పాటు చేసుకునే విధంగా వారిని తయారు చేస్తు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నందుకు అభినందలు అని అన్నాడు. ప్రస్తుతం 16 సెంటర్లు రన్ అవుతూ, ఆరు సెంటర్లో శిక్షణ పొందుతున్న 350 మందికి సర్టిఫికెట్లు అందజేశాడు. ఏబీవీ ఫౌండేషన్ ఛైర్మన్ కావ్య కిషన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించే దిశగా ఫౌండేషన్ మహిళలకు సహకరిస్తుందని, సికింద్రాబాద్ పార్లమెంట్లో మరిన్ని సెంటర్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు. త్వరలో పలు సెంటర్స్ లలో ఉచితంగా కంప్యూటర్ కోర్స్ కూడా నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీ ఫౌండేషన్ స్కిల్ సెంటర్ కోఆర్డినేటర్ నీరజ, వనజ, రమా, అశ్విని, మౌనిక, సరస్వతి, ఉమా, లక్ష్మి, చిట్టి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యన్నిధి కార్యాలయం వద్ద ధర్నా




**విశ్వంభర, బర్కత్ పుర:** పిఎఫ్ మరియు దాని అనుబంధ స్కీముల అమలులో వస్తున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉదయం హైదరాబాదు బర్కత్ పురా లోని భవిష్య నిధి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో కోటిన్నర మంది కార్మికులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇప్పటికీ అసంఖ్యాకమైన వారికి సామాజిక భద్రతా పథకమైన భవిష్యనిధి (పిఎఫ్) అమలు కావడం లేదు. పిఎఫ్, దాని అనుబంధ పథకాలు అమలవుతున్న కార్మికులు, ఉద్యోగులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, కొన్ని కంపెనీలలో యజమాని వాటా కూడా కార్మికుని జీతం నుండి కోతపెట్టి జీతాలు చెల్లిస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఈ ప్రక్రియను సరళతరం చేయాల్సిన పరిస్థితుల్లో మరింత ఇబ్బందులకు గురి చేయడం, కార్మికులు, ఆర్పీఎఫ్సీ కార్యాలయంలో డబ్బులు చెల్లించి సంవత్సరం దాటినా నేటికీ వారి పెన్షన్ను సవరించి కొత్త పిపిటలను జారీ చేయడం లేదు. నూతనంగా జారీ చేస్తున్న పెన్షన్ పే ఆర్డర్లను కూడా సాధారణ పెన్షన్ లాగా దామాషా పద్ధతిన అమలు చేస్తున్నందున వారికి అర్హత కలిగిన పెన్షన్లో 40 శాతం పైగా తగ్గించి చెల్లిస్తున్నారు. ఇది చట్టవ్యతిరేకమైనదే కాక అత్యంత దుర్మార్గమైనదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నాడు. పీఎఫ్ స్కీం, దాని అనుబంధ ఈపిఎస్ స్కీమ్ అమలులో వస్తున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామని రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కృష్ణమాచారిని కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, విఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

అచ్చంపేట ఎం ఎల్ ఏ డా. చిక్కుడు వంశీకృష్ణ




**విశ్వంభర, ఆమనగల్లు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమంగల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ స్టార్స్ ఆధ్వర్యంలో వంగూర్ మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక శాసనసభ్యుడు వంశీకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి మారుమూల ప్రాంతాలలో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ లను అభినందించాలి అని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమంగల్ కార్యక్రమాలను తాను పరిశీలిస్తున్నానని గ్రామీణ ప్రాంతాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్న వీరిని ప్రశంసించడం, ప్రోత్సహించడం ఎంతో అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ఎల్ సీ ఐ ఎఫ్ ఏరియా లీడర్ లయన్ ఎస్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అత్యుత్తమ కార్పొరేట్ సేవలు అందించడం మామూలు విషయం కాదని అందుకు కారణం అయిన డాక్టర్స్ అందరూ అభినందనీయులు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి, పీడీజీ లయన్ జి చెన్న కిషన్ రెడ్డి, తెలంగాణ అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు కె వి యన్ రెడ్డి లతో పాటు క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, హైదరాబాదు స్టార్స్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, రీజియన్ చైర్ పర్సన్ తెప్ప శ్రీను, జోన్ ఛైర్మన్ జనార్ధన్ రెడ్డి, కండె ఓంకారం, ఎం చంద్రశేఖర్, బావండ్ల వెంకటేష్, మోహన్ రెడ్డి, కొండల్ రెడ్డి, బి. లక్ష్మారెడ్డి, బండెల రామ్ చంద్రా రెడ్డి, జూలూరి లింగయ్య రామ్ రెడ్డి, జూలూరి రమేష్, సంపత్, వెంకటస్వామి, తదితరులతో పాటు స్టార్ క్లబ్ సభ్యులు సంతోక్ సింగ్, అశోక్ రెడ్డి, సంజీవ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నేతాజీ విద్యామందిర్ 1996-97 సంవత్సరం బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు, విద్యార్థినీలు అందరూ విచ్చేసి తమ తమ తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యార్థులు తమకు విద్యనందించిన ఉపాధ్యాయులనందరిని సత్కరించారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన దీపాదాస్ మున్షీ



**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ మంత్రి హనుమంతరావు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ క్రికెట్ పోటీలు గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ అంబర్ పేట లోని వాటర్ వర్క్స్ గ్రౌండ్లో మంగళవారం ఉదయం 18వ రాజీవ్ గాంధీ ఆల్ ఇండియా అండర్ 19 డియర్ నైట్ క్రికెట్ ఛాంపియన్షిప్ పోటీలను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా దీపాదాస్ మున్షీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తెలంగాణ ప్రజా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్ లక్ష్మణ్ యాదవ్ ఆది అవినాష్ సుధాకర్ శ్రీధర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవాలి



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం మొదలు పెట్టిన నూతన రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరణ, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలకు సంబంధించి లబ్దిదారుల అర్హుల జాబితా ఎంపిక గురించి మహేశ్వరం మండలంలో ఆకన్ పల్లి, అమీర్ పేట్, డబిల్ గూడ, దుబ్బచర్ల, దిల్వార్ గూడ, గట్టుపల్లి, గంగారం, కల్వకోల్, గొల్లురు, హాబీబుల్లగూడా, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామా పంచాయతి ప్రత్యేక అధికారులు, పంచాయతి కార్యదర్శులు, వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ సిబ్బంది హాజరు అయ్యారు. మండల పరిషత్ అభివృధి అధికారి శైలజ రెడ్డి, గోల్లురు గ్రామా పంచాయతి మండల పంచాయతి అధికారి ఎన్ .రవీందర్ రెడ్డి, కల్వకోల్ గ్రామా పంచాయతి గ్రామా సభలలో పాల్గొన్నారు.

## నందిపేటలో గ్రామ సభ



**విశ్వంభర, మూసాపేట్:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాలుగు గ్యారంటీ లో సోమవారం నుండి ప్రారంభమైన ప్రజా పాలన గ్రామసభ మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలంలోని నందిపేట గ్రామంలో జరిగింది. గ్రామ ప్రజల నుండి వచ్చిన వినతులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు ఎస్ ప్రభాకర్ రెడ్డి, ఏ నారాయణరెడ్డి, కురువ గాలన్న, ఎస్ వెంకట్ రెడ్డి, మేకల భాస్కర్, దేవరకద్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సూది రెడ్డి లక్ష్మీకాంత్ రెడ్డి, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశానికి దరఖాస్తులకు ఆహ్వానం

**విశ్వంభర, డిండి:** డిండి మండల కేంద్రంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5, 6,7, 8,9 తరగతులలో ప్రవేశానికి 2025-2026 సంవత్సరంనకు గురుకులాలలో ప్రవేశం పొందుటకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల డిండి ప్రిన్సిపల్ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రవేశ పరీక్షకు రూ. 100 లు చెల్లించి ఫిబ్రవరి ఒకటవ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, 6,7, 8, 9 తరగతులలో మిగిలిపోయిన సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం 4వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులలో 5వ తరగతి ప్రవేశానికి అర్హులు కులం సర్టిఫికెట్, ఆదయ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్ ఫోటోతో పాటు బోనఫైడ్ సర్టిఫికెట్ తో దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థి సంతకం, బర్త్ సర్టిఫికెట్ కూడా జతపరచాలని తెలిపారు. ప్రభుత్వం కల్పించే ఉచిత విద్య, భోజన సదుపాయం, మెనూ, పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫామ్, కాస్మోటిక్ సదుపాయాలు సమకూర్చుతామని దరఖాస్తుని ద్వారా ఆన్లైన్లో మాత్రమే సమర్పించాలని అన్నారు. ప్రారంభం తేదీ 21.12.2024, చివరి తేదీ 01.02.2025. సర్టిఫికెట్ స్వత్పర జారీ కోసం జిల్లా కలెక్టరేట్లో సహాయ కేంద్రం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఏర్పాటు చేస్తారని తెలిపారు.

## కాళేశ్వరం ఆలయ అర్చకునికి నోటీసు

**విశ్వంభర, కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర దేవస్థానం కార్యాలయం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి గర్భాలయం లోపల భక్తి పాట చిత్రీకరించడం జరిగినదని ఆలయ కార్య నిర్వహణ అధికారి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. అట్టి విషయాన్ని వార్తా పత్రికల్లో మరియు టీవీ ఛానళ్ళలో వచ్చే వరకు కూడా ఆ సమయంలో దేవాలయంలో లోపల డ్యూటీలో ఉన్న అర్చకుడు తనకు తెలపలేదని అంతేకాకుండా పాట చిత్రీకరించుటకు ముందు దేవస్థానం అధికారుల అనుమతి పొందారా లేదా అనే విషయాన్ని కూడా నిర్ధారించుకోలేదు అని ఆయన తెలిపారు. అందువలన దేవస్థానం కార్యాలయము నుండి ఎలాంటి అనుమతి లేకున్నా పాట చిత్రీకరించుటకు అవకాశం ఇచ్చిన అర్చకుడు ఏ. రామకృష్ణ కి నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

# ప్రజానాట్యమండలి పాటల సీడీ ఆవిష్కరణ

**ఆవిష్కరించిన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు**




**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాల్లో భాగస్వాములను చేయడమే తమ కర్తవ్యమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. పార్టీ మహాసభల్లో సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సమాయత్తమవుతామని చెప్పారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి రూపొందించిన ఎర్రజెండా పాటల సీడీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ మహాసభల సందేశాన్ని ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ప్రముఖులు, రచయితలు పాటలు రాశారని చెప్పారు. సీపీఐ(ఎం)కు ప్రజల పట్ల అంకితభావాన్ని, సోషలిజం పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ ఈ పాటలను రాశారని వివరించారు. దేశంలో, రాష్ట్రంలో ప్రమాదకరమైన రాజకీయ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద భావాలు ప్రజ్వరిల్లుతున్నాయని అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ శక్తులు వాటిని వ్యాపింపజేస్తున్నాయని విమర్శించారు. వాటికి వ్యతిరేకంగా పోరాడటంలో గతంలో బీఆర్‌ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ శాయశక్తులా పనిచేయలేదన్నారు. ప్రజలను సమీకరించలేదని చెప్పారు. అందుకే దేశంలో, రాష్ట్రంలో ఈ పరిస్థితులు దాపురించడానికి మూలకారణమని అన్నారు. వామపక్షాలు ముఖ్యంగా సీపీఐ(ఎం) ఈ కర్తవ్యాన్ని తీసుకున్నదని చెప్పారు. తెలంగాణ ప్రజలు వీరోచిత పోరాటానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించిన గొప్ప సంప్రదాయం ఇక్కడ ఉన్నదని చెప్పారు. కుల, మతాలతో నిమిత్తం లేకుండా ప్రజలను ఐక్యం చేసి నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన ఘనచరిత్ర ఉందన్నారు. అలాంటి సంప్రదాయాన్ని తెలంగాణ ప్రజలు నిలబెట్టడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ అవసరాన్ని నొక్కి చెప్పడం కోసమే ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామనీ, పాటల సీడీని ఆవిష్కరించామని అన్నారు. అందుకు అవసరమైన తీర్మానాలను పార్టీ రాష్ట్ర మహాసభల్లో చేయబోతున్నామని చెప్పారు. ఉద్యమాలకు సమాయత్తం కాబోతున్నామని వివరించారు. సమరశీల పోరాటాల ద్వారా ప్రజలను ఐక్యం చేస్తామన్నారు. విచ్ఛిన్నకర శక్తులను రాష్ట్రంలోకి రానివ్వకుండా, అవి బలపడకుండా కర్తవ్యాన్ని తీసుకోబోతున్నామని అన్నారు. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడం కోసం పాటల సీడీని రూపొందించిన ప్రజానాట్యమండలికి అభినందనలు చెప్పారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, చుక్క రాములు, టి జ్యోతి, డిజి నరసింహారావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, హైదరాబాద్ కార్యదర్శి ఎన్ మారన్న పాల్గన్నారు.

## ఎలాంటి అపోహలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక

**గ్రామ సభలలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా మంగళవారం జిల్లాలో ప్రారంభమైన ప్రజాపాలన గ్రామసభలు మహబూబాబాద్ మండలం సంద్రాల్లగూడెం, బలరాం తండ గ్రామ పంచాయతీలలో జరిగే ప్రజాపాలన గ్రామసభలలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో విడుదల చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలు ప్రజల నుండి సేకరిస్తూ నమోదు చేస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. అర్హులై ఉండి పేరు రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారు మండల కేంద్రాల్లో గాని కలెక్టరేట్లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికి పథకాలు అమలుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమలో ప్రత్యేక అధికారి జెడ్.పి. సీఈఓ పురుషోత్తం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు

- డ్రైవర్లకు కంటి పరీక్షలు, రక్తదాన శిబిరం
- ప్రమాదాల భారీ నుండి కాపాడిన వారికి ప్రభుత్వ ప్రోత్సహకం
- షాద్ నగర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాసు, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్



**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో నెలరోజుల పాటు కొనసాగనున్న జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీఏ కార్యాలయం ఆవరణలో స్థానిక ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ యువసత్త లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది వివిధ రకాల వాహనదారుల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. రక్త దానం ఆవశ్యకత ప్రాముఖ్యతలను వివరించి ప్రమాదాల నివారణకై పాటించాల్సిన నియమ నిబంధనలు వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన యువసత్త లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని పిలుపునిస్తూ అత్యవసర సమయంలో తాను అండగా ఉంటానని డ్రైవర్లకు భరోసా ఇచ్చారు. జిల్లాలోనే ప్రప్రథమంగా జాతీయ భద్రతా మసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం శుభపరిణామం అని పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నేషనల్ హైవేలు విస్తరిస్తున్నాయని, ప్రమాదాల నివారణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, యాక్సిడెంట్లు జరిగినప్పుడు ఎలాంటి అపోహలకు భయానికి లోనుకాకుండా పరిస్థితిని బట్టి మానవత్వంతో స్పందించాలని, అలాంటి వారి పట్ల ప్రభుత్వాలు ప్రోత్సాహకంగా నిలిచేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు. షాద్ నగర్ పరిధిలోని తిమ్మాపూర్ జేపీ దర్గా దూసకల్ కేశంపేట్ కూడలలో అండర్పాస్ నిర్మాణ పనులకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని త్వరలోనే పనులు పూర్తయ్యే అవకాశం ఉందనే ఆశాభావం వ్యక్త చేశారు. అలాగే ఇతర రాష్ట్రాల్లో ప్రమాదాలు జరిగి ఎమర్జెన్సీలో ఆసుపత్రికి చేరిన క్షతగాత్రుల చికిత్స నిమిత్తం అక్కడి ప్రభుత్వాలు సుమారు లక్షన్నర సహాయం అందించే దానిపై మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇక్కడ ఆ పద్ధతిని అమలు చేసే విధంగా సమాలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాహన డ్రైవర్లు, ఆర్టీఏ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

**గ్రామసభలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి**



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రాష్ట్రంలోని అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండల పరిధిలోని మద్వర్ గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా గ్రామసభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ప్రజా పాలనలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్క పథకమందే విధంగా మా ప్రభుత్వం, నేను కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. గత పది సంవత్సరాల నుండి గత ప్రభుత్వం ఏ ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కానీ మా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే కొత్త రేషన్ కార్డులను జారీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు వంటి పథకాలను ప్రజలకు అందివ్వడం జరుగుతుంది అని అన్నారు. ఈ పథకాలను త్వరలోనే అమలు చేయబోతున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, ఎంపీడీవో తదితర ఉన్నతాధికారులు తహెర్ మండల అధ్యక్షులు, పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ రామ గౌడ్, శివరాజ్ నారాయణఖేడ్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, సంగమేశ్వర్ నారాయణ, సాయిలు, మాధవార్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారం కావాలని ముఖ్య ఉద్దేశంతో సూర్యలంక కాంప్లెక్స్ యందు మంగళవారం అవమానాల సభ అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో నారగొని వెంకటయ్య, కె బి శ్రీధర్, చెరుకూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

\- విశ్వంభర, హైదరాబాద్

## నాయి బ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నాయి బ్రాహ్మణ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ను మంగళవారం నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తన నివాస గృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు శంకరయ్య స్వామి, రవికుమార్, సాయిలు, గణపతి, నాయి బ్రాహ్మణ మండల అధ్యక్షులు, నరేందర్ సంజీవ్, సుభాష్ రాములు లక్ష్మణ్, అంజయ్య, రాజు, సాయిలు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలి: యూటీఎఫ్



**విశ్వంభర, ఎల్బీనగర్:** తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై ముకదాడికి నిరసన తెలియజేస్తూ దాడికి పాల్పడిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ సరూర్ నగర్ మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్, జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి, మండల అధ్యక్షులు తావూరియా నాయక్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్ రాజు, కార్యదర్శులు నీరజ, కిరణ్మయి పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ కమిషనర్‌ను కలిసిన దుబ్బాక రమేష్



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రజక సంఘం జిల్లా అధ్యక్షులు బండ కాడి సీతారామ దేవాలయం అధ్యక్షులు దుబ్బాక రమేష్ హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లెల్ల గ్రామంలోని సీతారామ గుడి నిర్మాణం గురించి వివరించారు. గుడికి సంబంధించిన అభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్ కోరారు. దానికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాలయాల అభివృద్ధిలో భాగంగా కృషి చేస్తానని తెలియజేశారు.

## హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**అధ్యక్షుడు ఆర్కాల కామేష్ రెడ్డి**



**విశ్వంభర, మీర్ పేట్:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మీర్పేట్ మున్సిపల్ కార్పోరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆర్కెల కామేష్ రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో మంగళవారం జరగబోయే వార్డు సభలలో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ప్రజాప్రతినిధులు ప్రధాన ప్రతిపక్షంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర హామీల పైన వార్డుల్లో నెలకొన్న సమస్యలపైన అధికారులని నిలదీస్తారని, ముందస్తుగా కామేష్ రెడ్డిని గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే మొఖం చాటేసిన దొంగ ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. వీరిని ఎక్కడ నిలదీస్తారో అనే భయంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ నాయకులను,కార్యకర్తలను ఎక్కడికక్కడ గృహనిర్బంధనలు చేస్తున్నారు అని అన్నారు. దొంగ అరెస్టులకు మేము బయపడం, అరెస్టులతో మమ్మల్ని మా నాయకులను, కార్యకర్తలను తాత్కాలికంగా అపొచ్చు, కానీ సామాన్య ప్రజలలో నాటుక పోయిన ప్రభుత్వ వ్యతిరేకతను, ప్రభుత్వాన్ని నిలదీయడంలో వచ్చిన చైతన్యాన్ని మీరు ఆపలేరని అన్నారు.

విశ్వంభర
V3 NEWS

# అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలి

- అందరూ కలిసి మెలిసి జీవించడం సూర్యాపేట సంస్కృతి
- సూర్యాపేట పోరాటాల పురిటిగడ్డ
- వ్యాపారులు ఉద్యమాలలో పాల్గొని తిరుగుబాటు చేసిన చరిత్ర ఉంది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి




**విశ్వంభర, సూర్యాపేట:** అభివృద్ధి లో అందరూ భాగస్వామ్యులు కావాలని, సూర్యాపేట పట్టణంలో శాంతియుత వాతావరణంలో ఇప్పటి మాదిరిగానే ప్రజలు ముమ్ముందు కూడ అందరూ కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలని, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన సూర్యాపేట మున్సిపాలిటీ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని పదవి కాలం ముగింపు సందర్భంగా కౌన్సిలర్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో సూర్యాపేట మున్సిపాలిటీకి పెద్దఎత్తున నిధులు తీసుకుని వచ్చి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. సూర్యాపేట పోరాటాల గడ్డ అని, ఇక్కడ వ్యాపారులు కూడ పోరాటాలలో పాల్గొన్న చరిత్ర వుందని, ఆ చైతన్యంతోనే దళిత మహిళను మున్సిపల్ ఛైర్మన్ గా నియమించామని అన్నారు. గతంలో సద్దల చెరువు ను మినీ ట్యాంక్ బండ్ గా నిర్మాణం చేసుకున్నామని, పుల్లారెడ్డి చెరువు వద్ద పనులు పూర్తి కాలేదని, అలాగే నల్లచెరువు వద్ద కూడ మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం చేయడానికి సూర్యాపేట ఎమ్మెల్యే గా తనవంతు కృషి చేస్తానని అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ కార్మికులు, సిబ్బంది మెరుగైన పనితీరుతోనే మున్సిపాలిటీ కి జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయని, ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించి, పట్టణ అభివృద్ధి లో శాంతి భద్రతలను కాపాడడంలో సమన్వయంతో కలిసిమెలిసి పనిచేయాలని అన్నారు. వాడివేడిగా జరిగిన మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం పట్టణంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ లు ప్రశ్నించారు. బస్తీలలో నీటి సరఫరా ను మెరుగు పరచాలని, పేదలు నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు కౌన్సిలర్ లు కమీషనర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పుట్ట కిషోర్, 42 వ వార్డు కౌన్సిలర్ అంగిరేకుల రాజశ్రీ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా పెంచాలని, అనేక మార్లు కౌన్సిల్ సమావేశంలో చెప్పినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఫ్లోర్ లీడర్ లు, కౌన్సిలర్ లతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

## స్వామి వివేకానంద బోధనలు ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి



**విశ్వంభర, సూర్యాపేట టౌన్:** స్వామి వివేకానంద 163వ, జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని శ్రీరామకృష్ణ సేవా సమితిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, స్తోత్ర పారాయణాలు, భజనలు, పుస్తక పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులగా ప్రముఖ ఆరోగ్య భారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.సి రంగా చార్యులు పాల్గొని మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆచరించి, బోధించిన "మానవ సేవయే మాధవసేన అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజానికి సేవ చేయాలన్నారు. సమితి ప్రాంగణంలో యువకుల క్రీడల కొరకు లయన్ రేపాల మదన్ మోహన్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట అధ్యక్షులు కొండపల్లి లక్ష్మారెడ్డి క్రీడా సామాగ్రినీ రామకృష్ణ సేవా సమితి బాధ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.వీపూరి సుదర్శన్, పెండెం చంద్రశేఖర్, దొంగరి సోమయ్య, నాగవెళ్ళి ప్రభాకర్, అంతటి శ్రీనివాస్, కోనేటి వెంకన్న, రాగి భాస్కరచారి, పెండెం స్వర్ణలత, అంత టి చంద్రకళ, రుద్రమ్మ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదకరం

ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం




**విశ్వంభర, సూర్యాపేట:** రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. రోడ్డు భద్రత మసోత్సావాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్థానిక శంకర్ విలాస్ సెంటర్లో వాహన చోదకులకు అవగాహన కల్పించారు. నిబంధనల ఉల్లంఘనలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరంగా మారుతోందన్నారు. గత నెల రోజులుగా రాంగ్ డ్రైవింగ్ చేస్తున్న 150 పైగా వాహనదారులపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముందుకెళ్లి యూటర్న్ తీసుకోవాలంటే సమయం వృథా అవుతుందనే ఆలోచన మంచిది కాదని సూచించారు. కొందరు రాంగ్ రూట్ లో వాహనాలకు ఎదురెళ్లి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారని, ఒక్కరికి ఆదర్శంగా ఉండాలే తప్ప రాంగ్ రూట్ ప్రయాణం చేయవద్దని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది, వాహన చోదుకులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

– ఎంవీఐ లావణ్య



**విశ్వంభర, నల్గొండ:** ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధన పాటించాలని ఎంవీఐ లావణ్య అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయంలో ప్రజలకు, వాహనదారులకు ఎంవీఐ లావణ్య అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని అని అన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు(త్రిబుల్ రైడింగ్) ప్రయాణించడం ప్రమాదం అని, మద్యం సేవించి వాహనములు నడపవద్దు అని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం, నూతన లైసెన్స్ లు కోసం, వాహనములు ఫిట్నెస్ కొరకు, వాహనములు రిజిస్ట్రేషన్ కొరకు వచ్చిన వారికి రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం క్షేమదాయకం అని వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది సంజీవ, చంద్రకాంత్, పహీం, శాలిని,,రవి, సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**విశ్వంభర, నాగారం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ కే అశోక్ అన్నారు. నాగారం మండలంలోని మామిడిపల్లి, నర్సింహులగూడెం, పేరబోయినగూడెం, శాంతినగర్ గ్రామంలో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో అర్హుల జాబితా ఆమోదంతో పాటు నూతనంగా ఆయా పథకాల కోసం దరఖాస్తు స్వీకరించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు నూతనంగా 53 దరఖాస్తులు, రైతు భరోసా 4, న్యూ రేషన్ కార్డ్స్ 41, ఇందిరమ్మ ఇల్లు 32, మొత్తం 130 దరఖాస్తులు వచ్చినట్లు తాహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో కే. మారయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఐలయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ కాంత్, డీటీ షాహిని బేగం, ఎంపీఎస్ఓ రమేష్, ఏపీఎం శోభారాణి, రవి, పంచాయతీ కార్యదర్శులు, ఏ ఈ ఓ లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు అత్యుత్తమ పురస్కారం



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన పలువురు విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ లో అత్యుత్తమ పురస్కారాలు దక్కాయి. మంగళవారం హైదరాబాద్ బిర్లా మందిర్ సైన్స్ మ్యూజియం లో కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ రైసింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారాలు ఎం. రిత్విక్, ఎం.విశ్వేశ్వర్ లు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశ నలుమూలల నుంచి, మార్షల్ ఆర్ట్స్ కు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఇంతటి ఉత్తమ పురస్కారాలు తమ విద్యార్థులకు దక్కినందుకుగాను శిక్షకుడు పోచయ్య, తల్లిదండ్రులు క్రీడాకారులను అభినందించారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు



**విశ్వంభర, హైదరాబాద్:** ఉదయం అబిడ్స్ సూర్య లోక్ కాంప్లెక్స్ యందు మంగళవారం అధిలేలా ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆదినారాయణ గుప్త సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం యందు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా వెంకటేష్ గుప్త ను (అధిలీల ఫౌండేషన్) నియమించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా వకులభరణం ఆదినారాయణ గుప్త, గంధం రాములు, పద్మిని, సుధాకర్, కొండలరావు, కె బి శ్రీధర్, శ్రీవాణి, దేవసేన, పుష్పాంజలి, తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభలను పరిశీలించిన మేయర్ అజయ్ యాదవ్



**విశ్వంభర, బోడుప్పల్:** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కమీషనర్ రామలింగం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ముఖ్యమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా, మరియు ఇందిరమ్మ ఇండ్ల మంజూరికై కార్పొరేషన్ లోని డివిజన్లో వార్డు సభలను ఏర్పాటు చేశారు. మంగళవారం రోజున బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10 వార్డులలో సభలను నిర్వహించి, డివిజన్ సభ్యులతో కలిసి ప్రభుత్వ పథకాలను మేయర్ తోటకూర అజయ్ యాదవ్ వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి

**విశ్వంభర, పెద్దశంకరంపేట:** కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీలు గోపి, రాధాకిషన్, వెంకటేశంలు ఎఫ్ఎల్ఎన్ బోధన విధానంపై అనుసరించాల్సిన విషయాలపై శిక్షణతో పాటు విద్యార్థుల ప్రగతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు విఠల్, విజయ్ కుమార్, ఎమ్మార్సీ సిబ్బంది సంపత్ రెడ్డి, సంగమేశ్వర్ తదితరులున్నారు.

## పంచాయితీ సిబ్బందికి దుస్తులు అందజేత



**విశ్వంభర, పెద్దశంకరంపేట:** మండల పరిధిలోని బూర్గుపల్లిలో గ్రామపంచాయితీ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు దుస్తులు, ఇతర సామాగ్రిని ప్రజా ప్రతినిధులు, అధికారులు అందజేశారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి సామాగ్రీని అందించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్దన్, పెరుమాండ్ల గౌడ్, సత్యనారాయణరావు, ఏఈ రమేష్, ఏఎస్ఐ సునీత, గ్రామకార్యదర్శి పాషా తదితరులున్నారు.

# ఆరోగ్య మహిళ ప్రోగ్రామ్ ఆకస్మిక తనిఖీ

**డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి**



**విశ్వంభర, కేశంపేట:** మంగళవారం కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మహిళా ప్రోగ్రామును డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి ఆకస్మిక తనికీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ.పి సేవలను డాక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. అలాగే ఆసుపత్రిలో కాన్పు అయిన పేషంట్లతో మాట్లాడి తల్లి బిడ్డల క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న స్టాఫ్ నర్స్ కి, వైద్యాధికారి డాక్టర్ నికితకు ఆసుపత్రి కాన్పులను పెంచాలని తెలియజేశారు. ఆరోగ్యమైన రిజిస్ట్రేషన్ ను డాక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు. అక్కడికి వచ్చిన ఆశలతో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆశాలు అందరూ బీపీ మరియు షుగర్ పేషెంట్లకు రెగ్యులర్ గా గ్రామాలలో మందులు అందించాలని చెప్పారు. తరువాత అబాకాడును క్రియేషన్ అందరికీ చేయాలని తెలియజేశారు. ఆశాలు అందరూ కూడా హై రిస్క్ గర్భవతులను కాకుండా, నార్మల్ అయ్యే కాన్పులను కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని ఆశలకు డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. గ్రామాలలో గర్భవతులను ముందుగా గుర్తించాలని ఆశలకు తెలియజేశారు. గర్భవతులకు పోషకాహారం గురించి చెప్పాలని ఆశలకు తెలియజేశారు. ఈరోజు కేశంపేటలో మొత్తం 64 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించగా, అందులో 15 మందికి రక్తపు నమునా లు సేకరించి హైదరాబాద్ టీ హబ్ కు పంపడం జరిగింది అని డాక్టర్ విజయలక్ష్మి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నికిత, ఎమ్మెల్యే పి వైద్యాధికారులు సంధ్య, రతన్లాల్, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, ఎంపీహెచ్వోలు ఉపేందర్రెడ్డి, నరసింహారెడ్డి హెల్త్ సూపర్వైజర్ మెర్సిలిన్, డీఈఓ హనుమంతు మరియు రవి కుమార్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి పథకాలు



**విశ్వంభర, నందిగామ:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయని ఎవరు కూడా ఆందోళన చెందకూడదని నిరంతరాయంగా జరిగే ఈ ప్రక్రియ ద్వారా ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం నర్సప్ప గూడ మాజీ సర్పంచ్ కావలి కృష్ణ యాదవ్ తెలిపారు. నర్సప్పగూడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో గ్రామ సెక్రెటరీ జానకిరామ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జగ్గశేఖర్ కలిసి గ్రామసభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26వ తేదీ నుంచి అమలయ్యే రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ భరోసా, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు అర్హత గల లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం చేపట్టిన ఈ గ్రామసభలలో అర్హత గల వారిని గుర్తించాలని, ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అడ్వకేట్ శ్రీనివాస్, రవి, బాలరాజ్, శేఖర్, చందన్, నరేందర్, రాజు, అంగన్వాడీ టీచర్లు, జి.శోభారాణి, సౌభాగ్య, మహిళా సంఘం అధ్యక్షులు, మహిళలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కనీస వేతన సలహా మండలి బోర్డు సమావేశం




**విశ్వంభర, హైదారాబాద్:** ఆర్టీసీ ఎక్స్ రోడ్డు కార్మిక కమిషనర్ భవనం తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ అధ్యక్షతన రెండవ బోర్డు మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో బోర్డు సెక్రటరీ శ్యాంసుందర్ జాజు తో సభ్యులు నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, యూసఫ్, రాజు ముదిరాజ్, మీలా జయదేవ్, బాసాని చంద్రప్రకాష్, ప్రత్యేక ఆహ్వానితులు ప్రొఫెసర్ సి రవి, లేబర్ డిపార్ట్మెంట్ నుండి బసిరెడ్డి పాల్గొని పలు విషయాలపై చర్చించారు. ముఖ్యంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కోటి 25 లక్షల మంది మెరుగైన జీతాలు అందించడం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని కార్మికుల జీతాలు పెంచడం కోసం అనేక రకాల పరిశీ పరిశోధన అధ్యయనము చేయడం జరుగుతుందని త్వరలోనే కార్మికులకు వారి జీవనానికి ఆమోదయోగ్యమైన మెరుగైన వేతన పెంపు జరగబోతుందని తెలియజేశారు. త్వరలోనే పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదంతో మెరుగైన వేతనాలు పెరగబోతున్నాయని తెలిపారు.

## అర్హులైన వారికి సంక్షేమ పథకాలు



**విశ్వంభర, ఆమనగల్లు:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పేద ప్రజలకు రేషన్ కార్డులు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆమనగల్ మున్సిపాలిటీ పలు వార్డులో పారదర్శకంగా ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రేషన్ కార్డ్ సర్వే సందర్భంగా ప్రజాసభను వార్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాలే మల్లయ్య, వస్పుల మానయ్య, మండల యువజన అధ్యక్షులు వసుపుల శ్రీకాంత్, షర్ఫోద్దిన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలను గుర్తించండి

**సూర్యాపేట జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్**



**విశ్వంభర, సూర్యాపేట:** గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టీ లెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి. నిత్య సరుకులు, గృహోపకరణాలు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ మొదలగు వాటి పేర్లు చెప్పి ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేసే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మీ క్రింద ఎక్కువ మంది ఎజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేసిన విషమై పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులను చైతన్య పరిచి ఫిర్యాదులు తీసుకుని జిల్లాలో రెండు కేసులు నమోదు చేశాం అని ఎస్పీ గుర్తుచేశారు. చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు. సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారు అని ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, వాట్సప్ నెంబర్ 8712672222 ద్వారా ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే నగదు తిరిగి పొందే అవకాశం ఉంటుంది. జిల్లా లో సైబర్ సెక్యూరిటీ సెల్ నిర్వహిస్తున్నము. డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా సైబర్ సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు అని అన్నారు.

# ఆర్జీకర్ వైద్యురాలి మృతదేహంపై మహిళ డీఎన్ఏ ఆనవాళ్లు..!



**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కి న్యాయస్థానం జీవిత ఖైదు విధించిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా సెంట్రల్ ఫోరెన్సిక్ లాబొరేటరీ కోర్టుకు సమర్పించిన రిపోర్టులోని విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. మృతురాలి శరీరంపై ఓ మహిళ డీఎన్ఏ లభించినట్లు అందులో పేర్కొంది. జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటనలో దోషిగా తేలిన సంజయ్‌రాయ్ డీఎన్ఏ 100 శాతం మృతురాలి శరీరంపై కనుగొన్నారు. అదేవిధంగా అతికొద్ది స్థాయిలో ఓ మహిళ డీఎన్ఏ సైతం బయటపడింది. అయితే, అది పొరపాటున ఈ డీఎన్ఏతో కలిసిందా లేక సదరు మహిళ కూడా నేరంలో భాగమైందా అనే విషయంలో స్పష్టత రావాల్సిఉంది. విచారణలో భాగంగా జూనియర్ వైద్యురాలి శవపరీక్ష వీడియోను పరిశీలించిన న్యాయమూర్తి..."పోస్టుమార్టం కోసం ఉపయోగించిన వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో స్టెరిలైజ్ చేయలేదని ఈ వీడియోను చూస్తే అర్థమవుతోంది. తగిన సదుపాయాలు లేనికారణంగా వైద్య సిబ్బంది తగిన ప్రొటోకాల్ పాటించలేదని తెలుస్తోంది. కానీ తప్పనిసరి పరిస్థితిలో వారు ఈ విధుల్ని నిర్వర్తించడం మినహా మరో మార్గం లేదు" అని వ్యాఖ్యానించారు. ఈ నేరంలో మరికొందరి ప్రమేయం ఉందని జూనియర్ వైద్యురాలి తండ్రి గతంలో ఆరోపణలు చేశారు. తమ కూతురి గొంతుపై గాయాలున్నా స్వాబ్ సేకరించలేదని.. కేసు ఛేదించడానికి సీబీఐ ఎక్కువగా ప్రయత్నించడం లేదన్నారు. ఈ ఘటనలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లుగా డీఎన్ఏ రిపోర్టులో వెల్లడైందని అధికారులు తనకు తెలిపినట్లు ఆయన వెల్లడించారు. కాగా.. గతేడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించింది. ఈ కేసుకు సంబంధించి ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌రాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చింది. శిక్ష ఖరారు చేయడానికి ముందు.. తాను ఏ నేరం చేయలేదని ఏ కారణం లేకుండానే తనను ఇందులో ఇరికించారని సంజయ్ తన వాదనలు వినిపించాడు. సోమవారం కోర్టు అతడికి జీవిత ఖైదును విధిస్తూ తీర్పు వెలువరించింది.

మరణశిక్ష విధించాలి..

జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో దోషిగా తేలిన సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలని బెంగాల్ ప్రభుత్వం కోరింది. ఈమేరకు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. అయితే, ఇది అత్యంత అరుదైన నేరం కేటగిరీలోకి రాదని తీర్పు వెలువరించిన సమయంలో సియాల్దా అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి అనిర్బన్‌దాస్ పేర్కొన్నారు.

# రావణుడి వారసులు తక్షణమే స్పందించారు.. సిసోడియా ఎద్దేవా



**ఢిల్లీ:** దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. రాజకీయ వాతావరణం వేడెక్కింది. అధికార, విపక్ష పార్టీలైన ఆప్ , బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈక్రమంలో రామాయణంలో మాయ లేడి లాంటి జపా నేతలను చూసి మోసపోవద్దని ఆప్ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. తాజాగా ఆయన వ్యాఖ్యలపై స్పందించిన భాజపా నేతలను ఉద్దేశిస్తూ.. ఆప్ పార్టీ సీనియర్ నేత మనీశ్ సిసోదియా ఓ పోస్ట్ చేశారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలకు రావణాసురుడి వారసులు వెంటనే స్పందించారంటూ ఎద్దేవా చేశారు. 'నిన్న కేజ్రీవాల్ ఓ బహిరంగ సభలో రావణుడికి సంబంధించిన వ్యాఖ్యలు చేశారు. రావణుడి వారసులు (బీజేపీ నేతలను ఉద్దేశిస్తూ) ఈ వ్యాఖ్యలపై తక్షణమే స్పందించారు. వారి అసలు ఉద్దేశం గ్రహించాలని దిల్లీ వాసులకు విజ్ఞప్తి చేస్తున్నా. వారు దిల్లీ ప్రజలకు రావణుడి కంటే పెద్ద ముప్పుగా మారతారు. వారితో జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం. వారి ఎజెండా అధికారాన్ని పొందడం, ప్రజల భూములను ఆక్రమించడం. జాగ్రత్తగా ఉండి.. సరైన నిర్ణయాలు తీసుకోండి' అని సిసోదియా రాసుకొచ్చారు. సోమవారం విశ్వాస్ నగర్‌లోని మురికివాడలో కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన భాజపాను ఉద్దేశిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల అనంతరం ఆ పార్టీ మురికివాడ ప్రజల భూములన్నీ అమ్మేస్తుందని ఆయన ఆరోపించారు. రామాయణంలోని సీతాపహరణ ఘట్టాన్ని కేజ్రీవాల్ ఈసందర్భంగా ప్రస్తావించారు. ఆ సమయంలో వచ్చిన మాయలేడిని బీజేపీ నేతలతో పోల్చారు. వారి ఉచ్చులో చిక్కుకోవద్దంటూ ఓటర్లను హెచ్చరించారు. ఇక, ఈ మాటలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. కేజ్రీవాల్ సనాతన ధర్మాన్ని అవమానించారని, ఆయన రామచరితమానస్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆ పార్టీ దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ పేర్కొన్నారు. కాగా.. ఢిల్లీలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి.

# ఢిల్లీ ఎన్నికలు.. బీజేపీ నుంచి మరో మ్యానిఫెస్టో



**ఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న దిల్లీలోని రాజకీయ పక్షాలన్నీ ఓటర్లపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా బీజేపీ మరో మ్యానిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే నిరుపేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అమలుచేస్తామని వాగ్దానం చేసింది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ.15 వేల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించింది .భీమ్‌రావ్ అంబేడ్కర్ స్టైఫండ్ పథకం కింద ఐటీఐలు, పాలిటెక్నిక్ స్కిల్‌సెంటర్లలో టెక్నికల్ కోర్సులు అభ్యసిస్తున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ప్రతినెలా రూ.1,000 చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తామని తెలిపింది. తాము అధికారంలోకి వస్తే.. ఆప్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి, కుంభకోణాలపై దర్యాప్తు చేసేందుకు సిట్ ఏర్పాటుచేస్తామని ఈసందర్భంగా ఠాకూర్ వెల్లడించారు. ఈమేరకు 'సంకల్ప పత్రా' పార్ట్-2ను బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ విడుదల చేశారు. ఇదివరకే 'సంకల్ప పత్రా' పార్ట్-1 పేరుతో భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ మ్యానిఫెస్టోను ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. గర్భిణులకు రూ.21వేల ఆర్థికసాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై ఎల్పీజీ సిలిండర్లను రూ.500కే ఇస్తామని పేర్కొన్నారు. 'మహిళా సమృద్ధి యోజన' కింద దిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు.

మేం ఇప్పటికే ఉచిత విద్య అందిస్తున్నాం: ఆప్

బీజేపీ మ్యానిఫెస్టో ప్రకారం.. ఢిల్లీ ప్రభుత్వంలో అర్హులైన విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్య లభిస్తుందా..? అని ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రశ్నించారు. "ఆప్ ప్రభుత్వంలో ప్రతిఒక్కరికీ ఉచిత విద్య లభిస్తోంది. తమ పిల్లలను విద్యాసంస్థల్లో చేర్చేందుకు తల్లిదండ్రులు భాజపా కార్యాలయాల చుట్టూ తిరగాలని వారు కోరుకుంటున్నారు. ఢిల్లీ ప్రజలారా జాగ్రత్తగా ఉండండి" అని కేజ్రీవాల్ విమర్శలు చేశారు.

# 'కిమ్ జోంగ్ ఉన్ కుశలమేనా'.. పాత మిత్రుడిని గుర్తుకుతెచ్చుకొన్న ట్రంప్




**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారంచేసి కనీసం 24గంటలు కూడా కాలేదు.. అప్పుడే పాత మిత్రుడు, ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్‌ను గుర్తుకుతెచ్చుకొన్నారు. ఈ ఘటన నెటిజన్లతో నవ్వులు పూయిస్తోంది. తాజాగా ప్రమాణస్వీకారం తర్వాత ట్రంప్ సైనికుల గౌరవార్థం జరిగిన ఓ బాల్ డ్యాన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా దక్షిణకొరియాలో ఉన్న అమెరికా సైనికులకు శాటిలైట్ కాల్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ "కిమ్‌జోంగ్‌ఉన్ ఎలా ఉన్నారు..? అక్కడ ఎలా ఉంది..? నేను ఆయనతో మంచి స్నేహ సంబంధాలు నెరిపాను.. అతడు.. ఓ పట్టాన మాట వినే రకం కాదు" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇంటర్నెట్‌లో వెంటనే వైరల్‌గా మారాయి. గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో ఉత్తరకొరియా విషయంలోపట్టువిడుపులతో వ్యవహరించారు. కొన్ని సందర్భాల్లో కఠినంగా ఉన్నా.. మరికొన్నిసార్లు చూసీచూడనట్లు పోయారు. 2019లో వియత్నాంలో ట్రంప్-కిమ్‌జోంగ్ ఉన్ భేటీ అయ్యారు. కానీ, అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉ.కొరియా వెనక్కి తగ్గకపోవడంతో.. చర్చలు విఫలం అయ్యాయి. ఒక సందర్భంలో కిమ్ హఠాత్తుగా అదృశ్యమైపోయి.. దాదాపు 20 రోజుల తర్వాత బాహ్య ప్రపంచానికి కనిపించారు. నాడు కూడా ట్రంప్ స్పందిస్తూ.. "ఆయన (కిమ్) ఆరోగ్యంగా తిరిగి రావడం సంతోషంగా ఉంది" అంటూ స్పందించారు. బైడెన్ అధికారంలోకి వచ్చాక అమెరికాతో ప్యాంగ్‌యాంగ్ దూరం పెరిగింది. ఇటీవల ఆగస్టులో కూడా ట్రంప్ మాట్లాడుతూ కిమ్ తనను బాగా ఇష్టపడతాడని గతంలో వ్యాఖ్యానించడం విశేషం. కానీ, తాజాగా అమెరికా విషయంలో కిమ్ వైఖరి మరింత కఠినంగా మారింది. ట్రంప్ అధికారంలోకి వచ్చినా సరే.. ఎటువంటి వ్యక్తిగత దౌత్యాలు నడపకూడదని ఉత్తర కొరియా నిర్ణయించుకొంది.

# గంగమ్మ తల్లి ఆశీస్సుల కంటే నాకు ఏదీ గొప్ప కాదు : గౌతమ్ అదానీ



**ప్రయాగ్‌రాజ్:** గంగమ్మ తల్లి ఆశీస్సుల కంటే తనకు ఏదీ గొప్ప కాదని అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ గౌతమ్ అదానీ అన్నారు. కుటుంబంతో కలిసి మంగళవారం మహా కుంభమేళాకు వెళ్లిన ఆయన.. అక్కడ ప్రార్థనలు, ఆరతి కార్యక్రమం నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మహా కుంభమేళాలో ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని, అందుకు తాను ప్రధాని నరేంద్రమోదీకి , యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ కు దేశ ప్రజల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. అంతకుముందు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకోగానే ఆయన ఇస్కాన్ టెంపుల్ వారితో కలిసి మహా కుంభమేళాలోని ఇస్కాన్ క్యాంపులో మహా ప్రసాదం బీతయారీలో పాల్గొన్నారు. ఇస్కాన్ టెంపుల్ వారు కుంభమేళా కొనసాగినన్ని రోజులు భక్తులకు ఉచితంగా భోజనం అందించనున్నారు. మహా కుంభమేళాలో ఇస్కాన్, అదానీ గ్రూప్ సంయుక్తంగా భక్తులకు ఉచిత భోజనం పెట్టాలని ఈ నెల 9ననే నిర్ణయించారు. మహా కుంభమేళా ముగిసేసరికి దాదాపు 50 లక్షల మందికి ఈ జాయింట్ క్యాంపు ద్వారా భోజనం పెట్టనున్నారు.

# డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలిగిన అమెరికా.. చైనా కీలక ప్రకటన




**బీజింగ్:** ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించిన నేపథ్యంలో చైనా కీలక ప్రకటన చేసింది. యూఎస్ఏ వైదొలిగినా డబ్ల్యూహెచ్‌వోకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత అనూహ్య నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అందులో ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా వైదొలగడం కూడా ఉంది. కొవిడ్ వ్యాప్తి సమయంలో ఈ సంస్థ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో చైనా స్పందించింది. డబ్ల్యూహెచ్‌వోకు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించింది. " ప్రపంచ ఆరోగ్య సంస్థను మరింత బలోపేతం చేయాలి తప్ప.. బలహీన పరచకూడదు" అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జియాకున్ పేర్కొన్నారు. డబ్ల్యూహెచ్‌వో కార్యకలాపాలకు చైనా సహకారం ఉంటుందన్నారు. ఆరోగ్యకర ప్రపంచం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు.

# సినీ ఫక్కీలో పోలీసుల ఛేజింగ్.. కారులో వెళ్తున్న దుండగుల కాల్చివేత..



**షామ్లీ:** పోలీసులు వెంబడిస్తుంటే దుండగులు కార్లలో పారిపోతుండటం, వారిని పోలీసులు తమవాహనాల్లో ఛేజ్ చేయడం, ఆఖరికి దుండగులు తప్పించుకోవడమో, లేదంటే పోలీసుల చేతిలోహతమవడమో లాంటి ఘటనలను మనం సినిమాల్లో చూస్తుంటాం. కానీ తాజాగా ఉత్తర ప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాలో అలాంటి ఘటనే చోటుచేసుకుంది. పారిపోతున్న దుండగులను పోలీసులు ఛేజ్ చేసి కాల్చిచంపారు. వివరాల్లోకి వెళ్తే.. గ్యాంగ్‌స్టర్ ముస్తఫా కగ్గా ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళ్తున్నట్లు మంగళవారం ఉదయం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో మాటువేసి ఆ దుండగులను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే పోలీసులను పసిగట్టిన దుండుగులు కారులో తప్పించుకునే ప్రయత్నం చేశారు. కానీ ఎస్టీఎఫ్ పోలీసులు వారిని సినీ ఫక్కీలో వెంబడించారు. షామ్లీ జిల్లాలోని ఝిన్‌ఝునా ఏరియాలో వారి వాహనాన్ని చుట్టుముట్టారు. దుండుగులు పోలీసులపై కాల్పులకు ప్రయత్నించడంతో పోలీసులు వెంటనే అన్ని వైపుల నుంచి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో గ్యాంగ్‌స్టర్ ముస్తఫా ముఠాకు చెందిన అర్షద్, మంజీత్, సతీష్‌తోపాటు మరో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ కాల్పుల్లో ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయనకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎన్‌కౌంటర్ సమయంలోదుండగులు ప్రయాణించినవాహనాన్నికిందివీడియోలో చూడవచ్చు.

# గణతంత్ర వేడుకల ముందు ఢిల్లీలో ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్..



**ఢిల్లీ:** భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముందు దేశ రాజధాని ఢిల్లీలో ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్ నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఈ రిహార్సల్స్ జరుగుతున్నాయి. వాయుసేనకు చెందిన యుద్ధ విమానాలు, హెలికాప్టర్‌లు, విమానాలతో ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది చేస్తున్న విన్యాసాలు అబ్బురపరుస్తున్నాయి. ప్రతి ఏడాది రిపబ్లిక్ డే వేడుకలకు ముందు ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అదేవిధంగా ప్రతి ఏడాది ఒక విదేశీ అధినేతను భారత రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించడం కూడా ఆనవాయితీగా కొనసాగుతున్నది. కరోనా సమయంలో రెండేళ్లు తప్ప ఈ ఆనవాయితీకి ఎప్పుడూ బ్రేక్ పడలేదు. ఈసారి గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో చీఫ్ గెస్టుగా వస్తున్నారు. రిపబ్లిక్ డే వేడుకలకు ముందు కర్తవ్యపథ్‌లో నిర్వహిస్తున్న ఫ్లయింగ్ పాస్ట్ రిహార్సల్స్‌కు సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

# గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరు మార్చిన ట్రంప్..!





**మెక్సికో:** ట్రంప్ అందరూ ఊహించినట్లే తొలిరోజే గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారుస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. ఈసందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యుత్తమ, శక్తిమంతమైన దేశంగా దాని స్థానాన్ని అది పొందిందని వ్యాఖ్యానించారు. ఆయన జనవరిలో మార్ ఎ లాగో ఎస్టేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వేళ తొలిసారి ఈ విషయాన్ని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ ప్రదేశాలను మాదక ద్రవ్యాల ముఠాలు నియంత్రిస్తున్నాయని తాను అమెరికా సరిహద్దులను బలోపేతం చేస్తానని వెల్లడించారు. ఉత్తర అమెరికాలో దాదాపు ఆరు లక్షల చదరపు మైళ్ల సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ మెక్సికోగా వ్యవహరిస్తారు. ప్రపంచంలోనే 9వ అతిపెద్ద జలవనరు ఇది. తొలిసారి ఈ పేరును 16వ శతాబ్దంలో స్పెయిన్‌కు చెందిన అన్వేషకులు వినియోగించారు. ఈనేపథ్యంలో ట్రంప్ ప్రతిపాదనలను మెక్సికో తొలి నుంచి వ్యతిరేకిస్తోంది. ఇటీవల ఆ దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మాట్లాడుతూ.. 1607లో గల్ఫ్‌ఆఫ్ మెక్సికో పేరును వాడిన మ్యాపులనుచూపించారు. గతంలో కూడా అమెరికానుగల్ఫ్ ఆఫ్‌అమెరికాగా వ్యవహరించేవారని పేర్కొన్నారు. 'మౌత్ ఆఫ్ రియో గ్రాండ్' అనే ప్రదేశంలో అమెరికా, మెక్సికోల మధ్య దీని సరిహద్దులు మొదలవుతాయి. అమెరికా ఆర్థికవ్యవస్థకు ఈ ప్రదేశం అత్యంత కీలకమైంది. ఈ ప్రదేశంలో అమెరికాలో వినియోగించే సగానికి పైగా శుద్ధి చేసిన గ్యాస్ తయారీ కేంద్రాలు ఉన్నాయి. అమెరికాలో వినియోగించే 40 శాతం మత్స్య సంపద ఇక్కడే దొరుకుతుంది.

## గ్రీన్‌ల్యాండ్ విషయంలో డెన్మార్క్ కలిసివస్తుంది..

గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేసే విషయంలో తమతో పాటు డెన్మార్క్ కూడా కలిసి వస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఆయన ఓవల్ ఆఫీస్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ "గ్రీన్‌ల్యాండ్ ఓ అద్భుత ప్రదేశం. అంతర్జాతీయ భద్రత కోసం ఇది అమెరికా అధీనంలో ఉండటం చాలా అవసరం. ఈవిషయంలో మాతో డెన్మార్క్ కలిసొస్తుంది అని కచ్చితంగా నమ్ముతున్నాను" అని పేర్కొన్నారు. ఇప్పటికే ట్రంప్ బృందం ఒకసారి గ్రీన్‌ల్యాండ్‌కు వెళ్లి చర్చలు జరిపింది

# తెలంగాణ ట్రస్టుకు బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ నోటీసులు



**గోపేశ్వర్:** ఉత్తరాఖండ్‌కు చెందిన బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ.. తెలంగాణకు చెందిన ఓ ట్రస్టుకు నోటీసులు జారీ చేసింది. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలకు చెందిన నమోనాలను తెలంగాణలో నిర్మించేందుకు ఓ ట్రస్టు ప్లాన్ చేసింది. హిమాలయాల్లోని ఆ గుళ్ల నమోనాలను పునర్ సృష్టించవద్దు అని కమిటీ తన నోటీసులో పేర్కొన్నది. సోమవారమే ఆ నోటీసులు జారీ అయ్యాయి. ఆలయ కమిటీకి చెందిన మీడియా ఆఫీసర్ హరీశ్ గౌర్ ఆ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ఆలయ కమిటీ ప్యానల్‌లోని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్ ప్రసాద్ తప్లియాల్ దానిపై సంతకం చేశారు. హిమాలయ పర్వతాల్లోని బద్రీనాథ్, కేదార్‌నాథ్ క్షేత్రాలను భక్తులు కొన్ని శతాబ్దాల నుంచి విజిట్ చేస్తున్నారని, అయితే ఆ ఆలయాలకు చెందిన నమోనాలను రీక్రియేట్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కమిటీ తన నోటీసులో తెలిపింది. రెండు వారాల్లోగా తమ నోటీసులకు స్పందించాలని బద్రీనాథ్ కేదార్‌నాథ్ ఆలయ కమిటీ కోరింది. ఒకవేళ స్పందన లేని పక్షంలో.. సివిల్, క్రిమినల్‌చర్యలు ఉంటాయని ఆలయ కమిటీతననోటీసులో పేర్కొన్నది.

# నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగు: అమిత్‌షా



**చత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ఇప్పటికీ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. దీనిపై తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ఇది నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగని వ్యాఖ్యానించారు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందన్నారు. "ఇది నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ. మన భద్రతా బలగాలకు ఇది గొప్ప విజయం. నక్సల్స్ లేని భారత్ దిశగా ఇది ఓ కీలక అడుగు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉంది. సీఆర్‌పీఎఫ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు ఈ జాయింట్ ఆపరేషన్‌లో భాగమయ్యాయి" అని అమిత్ షా స్పందించారు. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో జనవరి 19 రాత్రి నుంచి ఈ ప్రత్యేక ఆపరేషన్ జరుగుతోంది. పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారు.

# స్క్రాంజెట్ ఇంజిన్ గ్రౌండ్ టెస్ట్ సక్సెస్

## హైపర్‌సానిక్ క్షిపణుల తయారీలో మైలురాయి

**న్యూఢిల్లీ:** హైపర్‌సానిక్ క్షిపణుల తయారీలో కీలక ముందడుగు పడింది. ఈ తర్వాతి తరం క్షిపణుల్లో వినియోగించే దీర్ఘకాలిక సూపర్‌సానిక్ కంబషన్ రాంజెట్(స్క్రాంజెట్) ఇంజిన్ గ్రౌండ్ టెస్ట్ విజయవంతంగా పూర్తి చేసినట్టు మంగళవారం రక్షణ శాఖ ప్రకటించింది. డీఆర్డీవో విభాగమైన హైదరాబాద్ కేంద్రంగా పని చేసే డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్ ల్యాబొరేటరీ(డీఆర్‌డీఎల్) ఈ స్క్రాంజెట్‌ను తయారుచేసింది. భారత్‌లో మొదటిసారి 120 సెకన్ల పాటు స్క్రాంజెట్ గ్రౌండ్ టెస్ట్ జరిపినట్టు రక్షణ శాఖ వెల్లడించింది. అన్ని ప్రమాణాల్లో ఈ ఇంజిన్ విజయవంతంగా పని చేసినట్టు తెలిపింది. కాగా, హైపర్‌సానిక్ క్షిపణులు అత్యాధునిక ఆయుధాలు. ఇవి మాక్ 5కి మించిన వేగంతో ప్రయాణించగలవు. అంటే, ధ్వని వేగానికి ఐదింతల వేగంతో దూసుకుపోతాయి..

# సంక్రాంతి సీజన్‌లో ఏపీఎస్ ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం




**విశ్వంభర, విజయవాడ:** సంక్రాంతి సీజన్‌లో ఏపీఎస్ ఆర్టీసీకి రికార్డు స్థాయిలో ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు. జనవరి 8 నుంచి 20 వరకు ఆర్టీసీ 9,097 ప్రత్యేక బస్సులు నడిపింది. ఈనెల 20న ప్రయాణికుల ద్వారా ఒకే రోజు రూ.23.71 కోట్ల ఆదాయంతో ఆర్టీసీ రికార్డు నెలకొల్పింది. మూడు రోజులపాటు రోజుకు రూ.20 కోట్లు చొప్పున ఆదాయం ఆర్జించినట్టు సంస్థ తెలిపింది. ఇలా ఆదాయం రావడం తొలిసారి అని సంస్థ పేర్కొంది. సంక్రాంతి సీజన్ మొత్తంలో కేవలం ప్రత్యేక బస్సుల ద్వారానే రూ. 21.11 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ వెల్లడించింది.పండుగ సీజన్‌లో మొత్తం 7,200 బస్సులు నడపాలని ముందుగా నిర్ణయించిన ఆర్టీసీ.. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 9,097 ప్రత్యేక బస్సులను నడిపింది. డ్రైవర్లు, కండక్టర్ల అంకిత భావం, కృషి ఫలితంగానే ఆర్టీసీ ఈ ఘనత సాధించిందని సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. సంక్రాంతి సీజన్‌లో ప్రత్యేక బస్సులన్నీ సాధారణ ఛార్జీలతోనే నడిపామని చెప్పారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలు, సొంత వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేందుకే మొగ్గు చూపారన్నారు.

# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలు ప్రకటించిన ఏపీపీఎస్సీ



**విశ్వంభర, అమరావతి:** గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (APPSC) ప్రకటించింది. మే 3 నుంచి 9 వరకు మెయిన్స్ నిర్వహించాలని నిర్ణయించింది. గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షను డిస్క్రిప్టివ్ టైప్‌లో నిర్వహిస్తామని, ప్రశ్నపత్రాన్ని ట్యాబ్‌ల్లో ఇవ్వాలని నిర్ణయించినట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు.ఏపీలో మొత్తం 81 గ్రూప్ -1 పోస్టుల భర్తీకి గతేడాది మార్చి 17న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం 1,48,881మంది ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకోగా.. 4,496మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు.

# రాష్ట్రానికి ఒక్క మేలు చేయలేకపోయిన వైసీపీ

**మంత్రి కొలుసు పార్థసారథి**




**విశ్వంభర, అమరావతి :** వైసీపీ హయాంలో ఆ పార్టీకి 21 మంది ఎంపీలున్నా రాష్ట్రానికి ఒక్క మేలు చేయలేక పోయారని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి సొంత ప్రయోజనాల కోసం ఢిల్లీకి చక్కర్లు కొట్టారని మంగళవారం మీడియా సమావేశంలో విమర్శించారు.అధికారంలోకి వచ్చిన 7 నెలల్లోనే కూటమి ప్రభుత్వం అద్భుత విజయాలు సాధించిందని వెల్లడించారు. ముఖ్యంగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడేందుకు కేంద్రం రూ. 11 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం కూటమి ప్రభుత్వం సాధించిన విజయాల్లో ఒకటని పేర్కొన్నారు. ఆంధ్రు పోరాటంతో ఏర్పడిన విశాఖ ఉక్కు , దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని అన్నారు.ఉత్తరాంధ్ర ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ, ప్లాంట్ కార్మికుల సుదీర్ఘ పోరాటాలు ఫలించాయని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పూర్తికి కేంద్రంలోని ఎన్టీయే అన్ని విధాలా సిద్ధంగా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ప్రధాన ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెట్టిస్తున్నామని స్పష్టం చేశారు.

# 'డిప్యూటీ సీఎం' అంశంపై ఎవరూ స్పందించవద్దు

**జనసేన కేంద్ర కార్యాలయం**



**విశ్వంభర, అమరావతి:** ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని పలువురు టీడీపీ నేతలు కోరుతున్న నేపథ్యంలో ఈ అంశం రాజకీయా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొన్ని రోజులుగా తెదేపా, జనసేన నేతలు ఎవరికి తోచిన విధంగా వారు స్పందిస్తున్నారు. ఈక్రమంలో జనసేన పార్టీ అధిష్ఠానం మంగళవారం స్పందించింది. ఇకపై ఈ వ్యవహారంలో పార్టీకి చెందిన నేతలెవరూ బాహాటంగా స్పందించవద్దని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టొద్దని జనసేన కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.ఇదే అంశంపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం కూడా సోమవారం ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. లోకేశ్ డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ మాట్లాడవద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఎవరూ మీడియా వద్ద బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించింది. ఏ నిర్ణయమైనా కూటమి నేతలు కూర్చొని మాట్లాడుకుంటారని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీపై రుద్దవద్దని పేర్కొంది.

# గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఏపీ

**దావోస్‌లో సీఎం చంద్రబాబు**



**దావోస్:** భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచ దేశాలకు భారతీయులు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై నిర్వహించిన సదస్సులో సీఎం మాట్లాడారు. ''మీ అందర్నీ చూస్తుంటే నాలో నమ్మకం పెరిగింది. భవిష్యత్‌లో నా కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందింది. భారత్‌లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశాం. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. 25 ఏళ్ల కిందట బిల్‌గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకువచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయా. ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయి.

**ఈవీ వాహనాలు ఉత్పత్తికి ప్రోత్సాహకాలు**

2014లో మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్‌పై ఎక్కువ దృష్టి పెట్టాం. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టాం. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపైనా ఏపీలో ఎక్కువ దృష్టి పెట్టాం. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధన వనరుల్లో వస్తున్నాయి. 500 మెగావాట్ల , 5 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ-ఏపీ జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాయి. ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోంది. ఏపీలో విద్యుత్ ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయి. సుదీర్ఘమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటులో పోర్టులు ఉన్నాయి. ఈవీ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు ఏపీ ప్రోత్సాహకాలు అందిస్తుంది. పీఎం సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నాం. అత్యంత తక్కువ ఖర్చుతోనే ఈ విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి రావాలి. ఓవైపు పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ విద్యుత్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాల్సి ఉంది.

**ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామిక వేత్తలు**

రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయంపైనా దృష్టి పెట్టాం. గ్లోబల్ కమ్యూనిటీ కోసం ఏపీ ఓ మంచి మోడల్ అవుతుంది. విధాన రూపకర్తగా ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతూనే పరిశ్రమలకూ ప్రోత్సాహకాలు అందిస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాం. ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామికవేత్తలే కనిపిస్తున్నారు. భారతీయులు అందిస్తున్న సేవలపట్ల గర్విస్తున్నాను. భవిష్యత్‌లోనూ ఇదే తరహాలో సేవలు అందించాలి. ప్రపంచంలోని అనేక దేశాల్లో రాజకీయ అనిశ్చితి ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉంది''అని చంద్రబాబు అన్నారు.

# కర్బన ఉద్గారాల నియంత్రణకు 'క్లీన్ ఎనర్జీ' ఏకైక పరిష్కారం

**మంత్రి లోకేశ్**



**దావోస్:** ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా దావోస్ వెళ్లిన ఏపీ మంత్రి నారా లోకేశ్ వరుస సమావేశాల్లో పాల్గొంటున్నారు. డబ్ల్యూఈఎఫ్ వేదికగా స్వనీతి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. 'పర్యావరణ పరిరక్షణ - వాతావరణ ఉద్యమ భవిష్యత్' అంశంపై సమావేశంలో చర్చించారు. పోర్చుగల్ ప్రధాని, జోర్డాన్ క్వీన్, యునెస్కో సైంటిస్ట్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. ''సంప్రదాయేతర ఇంధన రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు ప్రయత్నాలు చేస్తున్నాం. కర్బన ఉద్గారాల నియంత్రణకు క్లీన్ ఎనర్జీ ఏకైక పరిష్కారం. సుస్థిర శక్తి వనరుల్లో ప్రపంచ అగ్రగామి కావడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీ గణనీయమైన ప్రగతి సాధించింది. భారత ప్రభుత్వం ఇటీవల ఏపీలో నాలుగు సోలార్ పార్కులు ప్రకటించింది. హరిత, ఇంధన పర్యావరణ వ్యవస్థ స్థాపనే ఏపీ లక్ష్యం. ఇందుకోసం ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ప్రకటించాం. పునరుత్పాదక శక్తి రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ఈ విధానాన్ని తీసుకొచ్చాం. తద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టుల కోసం 29 ప్రాంతాలు గుర్తించాం. ప్రపంచంలోనే అతిపెద్ద ఐఆర్ఈఎస్‌పీ ప్రాజెక్టు ఏపీలో ఉంది. 2030 నాటికి 18 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పునరుత్పాదక రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం'' అని లోకేశ్ తెలిపారు.

**సిస్కో వైస్ ప్రెసిడెంట్‌తో లోకేశ్ భేటీ..**

బహుళజాతి ఐటీ సంస్థ సిస్కో వైస్ ప్రెసిడెంట్ ప్రాన్సిస్‌తో లోకేష్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో సిస్కో గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి పరిసరాల్లో అనువైన స్థలంతో పాటు ప్రతిభ కలిగిన ఐటీ వృత్తి నిపుణులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. అమెరికాలోని భారతీయ ఐటీ వర్క్‌ఫోర్స్‌లో 25 శాతానికి పైగా తెలుగువారే ఉన్నారన్నారు. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో నైపుణ్యాభివృద్ధి ద్వారా డీప్-టెక్ హబ్‌గా ఏపీని మార్చడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. అన్ని విధాలుగా అనుకూలతలు కలిగిన ఏపీలో కంపెనీ తయారీ నెట్‌వర్క్‌ను విస్తరించాలని కోరారు. ఏఐ, నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీలో అత్యంత నైపుణ్యం కలిగిన ఐటీ వర్క్‌ఫోర్స్‌ను రూపొందించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని ఫ్రాన్సిస్‌ను కోరారు. లోకేశ్ విజ్ఞప్తిపై ఫ్రాన్సిస్ సానుకూలంగా స్పందించారు. ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై కంపెనీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**ఫిలిప్ మోరిస్ సౌత్ ఈస్ట్ ఆసియా వైస్‌ఛైర్‌పర్సన్‌తో సమావేశం**

ఫిలిప్ మోరిస్ సౌత్ ఈస్ట్ ఆసియా వైస్‌ఛైర్‌పర్సన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో స్మోక్ ఫ్రీ సిగరెట్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఏపీలోని గుంటూరు అనువుగా ఉంటుందన్నారు. పొగాకు బోర్డు, రైతుల సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఏపీ ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఫిలిప్ మోరిస్ సంస్థ తెలిపింది.

# ముగిసిన కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశం




**హైదరాబాద్:** కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశం ముగిసింది. హైదరాబాద్‌లోని జలసౌధలో బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, తెలంగాణ ఈఎన్సీ అనిల్ కుమార్, ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇంజినీర్లు, ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఏపీ, తెలంగాణ మధ్య నీటి వాటా, బోర్డు నిర్వహణపై భేటీలో చర్చించారు. టెలిమెట్రిక్ స్టేషన్ల ఏర్పాటుపై ఇరు రాష్ట్రాల అభ్యంతరాలపై సమావేశంలో చర్చకు వచ్చింది.

**తెలంగాణకు 71 శాతం వాటా ఇవ్వాలి: రాహుల్ బొజ్జ**

భేటీ అనంతరం తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ మాట్లాడారు. ''కృష్ణా జలాల్లో 66:34 నిష్పత్తిపై నిరసన తెలిపాం. రాష్ట్రంలో కృష్ణా పరివాహక ప్రాంతం 71 శాతం ఉంది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 71 శాతం వాటా ఇవ్వాలి. 71 శాతం ఖరారు చేసే వరకు చెరి సగం వాటా ఇవ్వాలి. ప్రస్తుతం 66:34 నిష్పత్తి ప్రకారం కొనసాగిస్తామని బోర్డు ఛైర్మన్ తెలిపారు. పరిస్థితులను బట్టి వాటా పెంచే ప్రయత్నం చేస్తామని ఛైర్మన్ చెప్పారు. జలాల మళ్లింపు విషయాన్ని సమావేశంలో ప్రస్తావించాం. 11 ప్రాంతాల్లో టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరాం. టెలిమెట్రీల ఏర్పాటుపై వారంలో స్పందిస్తామని ఏపీ ఈఎన్సీ తెలిపారు'' అని రాహుల్ బొజ్జ తెలిపారు.తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సాగర్ నుంచి సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉపసంహరించుకోవాలని కోరినట్లు చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతుల అంశాన్ని ప్రస్తావించామన్నారు. డ్యామ్ స్లూయిజ్‌కు మరమ్మతులు చేయిస్తామని బోర్డు ఛైర్మన్ చెప్పినట్లు తెలిపారు.

**50:50 నిష్పత్తిని అంగీకరించబోమని బోర్డుకు చెప్పాం: ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వరరావు**

ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ''తెలంగాణ అడిగిన 50:50 నిష్పత్తిని అంగీకరించబోమని బోర్డుకు చెప్పాం. 66:34 నిష్పత్తి ప్రకారమే కొనసాగించాలని కోరాం. అదే నిష్పత్తి కొనసాగిస్తూ రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని బోర్డు ఛైర్మన్ చెప్పారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని ఏపీకి తరలించాలని కోరాం. టెలిమెట్రీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదిత వివరాలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తాం. శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంస్థతో మోడల్ స్టడీస్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మోడల్ స్టడీస్ ఫలితాలు వచ్చేవరకు వచ్చే సీజన్‌కు అవసరమయ్యే అత్యవసర మరమ్మతులు చేపడతాం'' అని వెంకటేశ్వరరావు తెలిపారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలో మ్యూజికల్ నైట్



**విశ్వంభర, అమరావతి:** తలసేమియా వ్యాధిపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'యుఫోరియా మ్యూజికల్ నైట్' నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15న కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కూడా ఆహ్వానిస్తామని నారా భువనేశ్వరి తెలిపారు. ''ఎన్టీఆర్ కష్టపడి పైకి వచ్చారు. రాజకీయ రంగంలో ఏమీ ఆశించకుండా ప్రజల కోసం ముందుకు నడిచారు. పేదల కోసం ఎన్నో పథకాలు తెచ్చారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, ఆడపిల్లలకు ఆస్తిలో సమానహక్కు వంటివి ఆయన తెచ్చినవే. ప్రజా నాయకుడు చంద్రబాబు.. ప్రజలకు విద్య, వైద్యం అందించేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించారు. ఏ ప్రభుత్వ సహాయం తీసుకోకుండా ముందుకు సాగుతున్నాం. ఫైలిన్, హుద్ హుద్, కేరళలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంతో మందికి సాయమందించాం. తలసేమియా బారిన పడిన వారికి సహాయం చేసేందుకు బ్లడ్ బ్యాంక్ నిర్వహిస్తున్నాం. కొందరికి రక్తదానం అంటే భయం, మరి కొందరికి ఇష్టం ఉండదు. బ్లడ్ డొనేషన్ సమాజానికి ఎంతో మంచి చేస్తుంది. ప్రతి రక్తపు చుక్క ప్రజల ప్రాణాలను కాపాడుతుంది. మేము అడిగిన వెంటనే మ్యూజికల్ నైట్ నిర్వహించేందుకు తమన్ అంగీకరించారు. కుటుంబ సమేతంగా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నా. బుక్ మై షోలో టికెట్స్ అందుబాటులో ఉన్నాయి. మీరు కొన్న టికెట్స్ డబ్బుని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాం'' అని భువనేశ్వరి తెలిపారు.

# తిరుమల వెంకన్నను దర్శించుకున్న హీరోయిన్ సంయుక్త



**విశ్వంభర, తిరుమల:** తిరుమల వేంకటేశ్వరస్వామివారిని ప్రముఖ టాలీవుడ్ హీరోయిన్ సంయుక్త బుధవారం దర్శించుకున్నారు. దయం నైవేద్య విరామం సమయంలో శ్రీవారిని దర్శించుకొని.. మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నటిని చూసిన పలువురు సంయుక్తతో సెల్ఫీ ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి దర్శనం చాలా బాగా జరిగిందని తెలిపింది. ఈ ఏడాది పలు సినిమాలు చేస్తున్నానని.. తనకు ఈ ఏడాది కీలకమని పేర్కొంది. వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోవడం తనకు సంప్రదాయమని చెప్పింది.అలాగే, యువ హీరో ఆకాశ్ పూరీతో పాటు సింగర్ మంగ్లీ సైతం తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. నటీనటులకు ఆలయ అధికారి దర్శనాలు చేయించి.. రంగనాయక మండపంలో వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆకాశ్ పూరీ మాట్లాడుతూ ప్రస్తుతం తల్వార్ మూవీలో నటిస్తున్నట్లు చెప్పాడు. జనవరి నెలాకరు నుంచి సినిమా మొదలవుతుందని.. ఈ క్రమంలో స్వామివారి అనుగ్రహం కోసం వచ్చినట్లు చెప్పాడు. ఇదిలా ఉండగా.. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు ముగిశాయి. దాంతో భక్తుల సంఖ్య పెరిగింది. ఈ క్రమంలో పలువురు ప్రముఖులు తిరుమలకు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు.



## భారత్‌తో తొలి టీ20.. తుది జట్టును ప్రకటించిన ఇంగ్లాండ్

**ముంబయి:** వరుసగా టెస్టు సిరీస్ వైఫల్యాలు చవిచూసిన టీమ్ఇండియా.. ఛాంపియన్స్ ట్రోఫీలో వన్డే సమరానికి ముందు.. పొట్టి ఫార్మాట్ కిక్కు అందించేందుకు సై అంటోంది. రేపటి నుంచే (జనవరి 22) ఇంగ్లాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ ప్రారంభంకానుంది. ఫిబ్రవరి 6 నుంచి ఇరుజట్ల మధ్య వన్డే సిరీస్ మొదలవనుంది. అలవోకగా సిక్సర్లు బాదే హిట్టర్లు.. బంతిని బౌండరీలు దాటించే బ్యాటర్లు.. ధనాధన్ ఇన్నింగ్స్‌లతో చెలరేగే ఆల్‌రౌండర్లు.. ఇలా ఏ రకంగా చూసుకున్నా రెండు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నాయి. దీంతో ఈ పొట్టి సిరీస్ అభిమానులకు అసలు సిసలు వినోదాన్ని అందించడం ఖాయం. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఒక రోజు ముందే ఇంగ్లాండ్ తుది జట్టును ప్రకటించింది.కెరీర్‌లో మూడు టీ20లు ఆడిన ఫాస్ట్‌బౌలర్ గస్ అట్కిన్సన్ ఏడాది తర్వాత టీ20 మ్యాచ్ ఆడనున్నాడు. అతను చివరగా 2023 డిసెంబరులో వెస్టిండీస్‌తో జరిగిన టీ20లో ఆడాడు. ఆదిల్ రషీద్‌ను ఏకైక స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకున్నారు. పార్ట్ టైమ్ స్పిన్నర్లు లివింగ్‌స్టన్, జాకబ్ బేథల్‌లను కూడా తుది జట్టులోకి ఎంపిక చేశారు. మరో విషయం ఏంటంటే.. యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌ను ఇంగ్లాండ్ పరిమిత ఓవర్ల వైస్ కెప్టెన్‌గా నియమించారు. భారత్, ఇంగ్లాండ్ మధ్య ఇప్పటివరకు 24 టీ20లు జరగ్గా.. ఇంగ్లిష్ జట్టు 11 మ్యాచ్‌ల్లో గెలిచింది. భారత గడ్డపై 11 మ్యాచ్‌లు ఆడి ఐదుసార్లు గెలిచింది.

**భారత్‌తో తొలి టీ20కి ఇంగ్లాండ్ తుది జట్టు:**
బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ (వికెట్ కీపర్), జోస్ బట్లర్ (కెప్టెన్), హ్యారీ బ్రూక్, లియామ్ లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, జేమీ ఓవర్టన్, గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.

## పంత్ కనీసం ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధిస్తాడు

### సంజీవ్ గొయెంకా



**లక్నో:** లక్నో సూపర్ జెయింట్స్‌కు కొత్త కెప్టెన్ వచ్చాడు. కేఎల్ రాహుల్‌ను వదులుకున్న లఖ్‌నవూ.. మెగా వేలంలో రిషభ్ పంత్‌కు భారీ ధర వెచ్చించి దక్కించుకుంది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర రూ.27 కోట్లతో పంత్ సొంతం చేసుకున్న లక్నో.. అతడికే సారథ్య బాధ్యతలు కూడా అప్పగించింది. సోమవారం కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ ఫ్రాంఛైజీ యజమాని సంజీవ్ గొయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు. అనంతరం గొయెంకా మాట్లాడారు. పంత్ వచ్చే 14-15 ఏళ్లు ఎల్ఎస్‌జీ తరఫున ఆడతాడని, ఈ కాలంలో కనీసం ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధిస్తాడని ఆశాభావం వ్యక్తంచేశారు. 'రిషభ్ పంత్ ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఆటగాడిగా మాత్రమే కాక టోర్నీలో అత్యుత్తమ ఆటగాడు అవుతాడని నమ్ముతున్నా. ఆటపై ప్రేమ, గెలవాలనే తపన ఉన్న ఇలాంటి ఆటగాళ్లను నేను చూడలేదు. ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లను విజయవంతమైన జట్లుగా చెబుతారు. మహేంద్రసింగ్ ధోనీ, రోహిత్ శర్మ అద్భుతంగా ఆ టీమ్‌లను ముందుండి నడిపించారు. నా మాటలు గుర్తుంచుకోండి. 10 ఏళ్ల తర్వాత ప్రజలు ధోనీ, రోహిత్‌తోపాటు పంత్ పేరును చెబుతారు. భారీ ధర దక్కించుకోవడంతో పంత్‌పై అదనపు ఒత్తిడి ఉండదు. వేలం పూర్తవడంతోనే దాని గురించి చర్చ ముగిసింది. ప్రతి జట్టు రూ.120 కోట్లు ఖర్చు చేసింది. ఒకే ఆటగాడి కోసం ఎంత ఖర్చు చేశారనేది, మిగిలిన ఆటగాళ్ల కోసం ఎంత వెచ్చించారన్నది ముఖ్యం కాదు' అని సంజీవ్ గొయెంకా పేర్కొన్నారు.

''లఖ్‌నవూకు తొలి టైటిల్ అందించేందుకు 200 శాతం కృషి చేస్తా. నూతన ఉత్తేజంతో ఎల్ఎస్‌జీ తరఫున ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. కొత్త జట్టు.. కొత్త ఫ్రాంఛైజీ.. కానీ కెప్టెన్‌గా నా దృక్పథం మారదు. సారథిగా సహచరులతో ఎలా నడుచుకోవాలో రోహిత్ భాయ్ నుంచే నేర్చుకున్నా. ఆటగాళ్లపై నమ్మకముంచితే ఊహించని ఫలితాలు వస్తాయి'' అని పంత్ తెలిపాడు.

ఐపీఎల్‌లో ఒక జట్టుకు కెప్టెన్‌గా ఉండడం పంత్‌కు ఇది రెండోసారి. 2016 నుంచి దిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన పంత్.. 2021లో కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 2022 ఏడాది చివర్లో ఘోర రోడ్డు ప్రమాదంలో చిక్కుకొని ప్రాణాలతో బయటపడ్డాడు. 2024లో పునరాగమనం చేసి తిరిగి దిల్లీని నడిపించాడు. పంత్ లేని సమయంలో (2023 సీజన్) శ్రేయస్ అయ్యర్ దిల్లీకి కెప్టెన్‌గా ఉన్నాడు.



## షమి రాకతో టీమ్ఇండియా బలం పెరిగింది: గంగూలీ

**ముంబయి:** చాలాకాలంగా జట్టుకు దూరంగా ఉన్న టీమ్ఇండియా సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి మళ్లీ భారత జెర్సీలో కనిపించబోతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత గాయం కారణంగా ఆటకు దూరమైన షమి కీలకమైన ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట పునరాగమనం చేయనున్నాడు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్, వన్డే సిరీస్‌తోపాటు తర్వాత జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ కి షమి ఎంపికయ్యాడు. షమి రీ ఎంట్రీ ఇస్తుండటంతో భారత మాజీ ఆటగాడు సౌరభ్ గంగూలీ సంతోషం వ్యక్తంచేశాడు. అతడి రాకతో టీమ్ఇండియా బలం గణనీయంగా పెరిగిందన్నాడు. 'షమి ఫిట్‌గా ఉన్నందుకు నేను సంతోషిస్తున్నాను. ఎందుకంటే అతను జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత దేశంలోనే అత్యుత్తమ బౌలర్ అని నేను భావిస్తున్నాను. షమి కాస్త భయాందోళనతో ఉంటాడని నాకు తెలుసు. ఎందుకంటే చాలాకాలం తర్వాత మోకాలి గాయం నుంచి కోలుకొని క్రికెట్ ఆడుతున్నాడు. కానీ, దేశవాళీ క్రికెట్‌లో బెంగాల్ తరఫున ఆడటం అతడికి కలిసొచ్చే అంశం. ఆ అనుభవం రాబోయే మ్యాచ్‌ల్లో షమికి ఉపయోగపడుతుంది. షమి రావడంతో బుమ్రాపై వర్క్‌లోడ్ తగ్గుతుంది. ఇది జట్టు ప్రదర్శన మెరుగుపడటానికి ఉపకరిస్తుంది. బుమ్రా ఒక ఎండ్ నుంచి, షమి మరో ఎండ్ నుంచి బౌలింగ్ చేయడం భిన్నంగా ఉంటుంది. పరస్పర సహకారంతో ఇద్దరు టెస్టు క్రికెట్‌లో సక్సెస్ అయ్యారు' అని గంగూలీ పేర్కొన్నాడు. ఇటీవల ముగిసిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భారత జట్టు పేస్ భారాన్ని శక్తికి మించి మోశాడు జస్‌ప్రీత్ బుమ్రా. పని భారం ఎక్కువ కావడంతో అతను గాయం బారినపడ్డాడు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి ఆందోళన చెందుతున్నవేళ షమి అందుబాటులోకి రావడం టీమ్ఇండియాకు ఊరటనిచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో బుమ్రా కూడా ఉన్నాడు. ఫిట్‌గా అంతకంటే ముందు ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో ఆడతాడు. బుమ్రా, షమి ద్వయం రాణించి ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను విజేతగా నిలపాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## ఫ్యామిలీ సపోర్ట్ చాలా ముఖ్యం

- బీసీసీఐ కొత్త నిబంధనలపై స్పందించిన జోస్ బట్లర్



**ముంబయి:** భారత క్రికెట్ వ్యవస్థను గాడినపెట్టేందుకు బీసీసీఐ ఇటీవల నూతన నియమావళిని తీసుకొచ్చింది. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. 10 పాయింట్లతో కూడిన నియమావళిని సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాళ్లకు బీసీసీఐ పంపించింది. ప్రతి ఒక్క ఆటగాడు దేశవాళీ క్రికెట్లో తప్పనిసరిగా ఆడటం ఈ కొత్త రూల్స్‌లో ప్రధానమైనది. విదేశాల్లో పర్యటనల సమయంలో క్రికెటర్ల వెంట కుటుంబ సభ్యుల బసపైనా బీసీసీఐ పరిమితులు విధించింది. సుదీర్ఘ పర్యటనలో భాగస్వామి, పిల్లలు రెండు వారాలు మాత్రమే ఉండొచ్చు. తక్కువ వ్యవధి సిరీస్‌లో కేవలం వారం రోజులు మాత్రమే అనుమతి ఉంటుంది. కుటుంబ సభ్యుల ప్రయాణం గురించి కార్యదర్శితో మాట్లాడాలని, ఆటగాళ్లు తనను అడుగుతున్నారని కెప్టెన్ రోహిత్ శర్మ ఛాంపియన్స్ ట్రోఫీ జట్టు ప్రకటన సందర్భంగా అన్నాడు. టీ20, వన్డే సిరీస్ కోసం భారత పర్యటనకు వచ్చిన ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ బీసీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై స్పందించాడు. అంతర్జాతీయ పర్యటనల సమయంలో ఆటగాళ్లకు ఫ్యామిలీ సపోర్ట్ ఉండటం చాలా కీలకమని పేర్కొన్నాడు. 'ఇది (క్రికెటర్ల వెంట కుటుంబ సభ్యుల బస) చాలా ముఖ్యమైనదని నేను భావిస్తున్నాను. మనం ఇప్పుడు ఆధునిక ప్రపంచంలో జీవిస్తున్నాం. విదేశీ పర్యటనల్లో క్రికెటర్లు కుటుంబాలతో కలిసి ప్రయాణిస్తే బాగుంటుంది. ఫ్యామిలీతో కలిసి ఆ సమయాన్ని ఆస్వాదించాలి. ఎందుకంటే తీరిక లేని షెడ్యూల్‌తో క్రికెటర్లు ఎక్కువ కాలం ఇంటికి దూరంగా ఉంటారు. ఇది (కుటుంబ సభ్యులు వెంట రావడం) క్రికెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుందని నేనైతే అనుకోను. దీని గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం లేదు. నా అభిప్రాయం ప్రకారం క్రికెటర్లకు ఇంటికి దూరంగా ఉన్నామనే ఫీలింగ్ కలగకుండా ఉండాలంటే వారి వెంట ఫ్యామిలీ ఉండటం చాలా ముఖ్యం. ఇది వారిని ఎమోషనల్‌గా, మానసికంగా బలంగా ఉంచుతుంది' అని బట్లర్ వివరించాడు. ఇదిలా ఉండగా.. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లాండ్ మధ్య జనవరి 22న ఈడెన్ గార్డెన్స్ (కోల్‌కతా)లో తొలి మ్యాచ్ జరగనుంది.

## అండర్-19 ప్రపంచకప్‌లో వైష్ణవి హ్యాట్రిక్

### మలేసియాపై భారత్ ఘన విజయం



**కౌలాలంపూర్:** అండర్-19 టీ20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జోరు కొనసాగుతోంది. వెస్టిండీస్‌పై గెలిచి శుభారంభం చేసిన భారత్.. మంగళవారం మలేసియాతో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు విజృంభించడంతో మలేసియా.. 14.3 ఓవర్లలో 31 పరుగులకే ఆలౌటైంది. ఇందులో 11 ఎక్స్‌ట్రాలు ఉండటం గమనార్హం. మలేసియా బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేదంటే మన బౌలర్ల జోరు ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు.నూర్ అలియా హైరున్ (5), హుస్నా (5) పరుగులు చేశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 2.5 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (27*; 12 బంతుల్లో 5 ఫోర్లు) మెరిసింది. కమలిని (4*) పరుగులు చేసింది. భారత బౌలర్ వైష్ణవి శర్మ (5/5) సంచలన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. ఆమె తన చివరి ఓవర్‌లో నూర్ ఐన్ బింటి రోస్లాన్ (3), నూర్ ఇస్మా దానియా (0), సితి నజ్వా (0)ను పెవిలియన్‌కు పంపి హ్యాట్రిక్ సాధించింది. ఆయుషి శుక్లా (3/8) అదరగొట్టింది. వైష్ణవి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో (జనవరి 23) శ్రీలంకతో తలపడనుంది.




## లిస్టింగ్‌కు ముందే ట్రేడింగ్.. గ్రే మార్కెట్‌కు సెబీ చెక్!

**ముంబయి:** గ్రే మార్కెట్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సిద్ధమవుతోంది. ఐపీఓలో షేర్లు అలాటైన మదుపర్లు.. లిస్టింగ్‌కు ముందే వాటిని విక్రయించే మెకానిజాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. తద్వారా గ్రే మార్కెట్ కార్యకలాపాలు నియంత్రించాలనుకుంటున్నట్లు సెబీ ఛైర్‌పర్సన్ మాధభి పురీ బచ్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడారు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో తొలి పబ్లిక్ ఇష్యూల బూమ్ నడుస్తోంది. కొన్ని కంపెనీలు భారీగా సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంటున్నాయి. మదుపర్లకు లిస్టింగ్ రోజు భారీ లాభాలను కూడా అందిస్తున్నాయి. ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ పూర్తయ్యాక షేర్లు.. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్లు లిస్టు అవ్వడానికి మధ్య మూడు రోజుల సమయం ఉంటోంది. ఈ వ్యవధిలో గ్రే మార్కెట్ కార్యకలాపాలు పెద్దఎత్తున జరుగుతుంటాయి. వీటిపై నియంత్రణ ఉండదు. గ్రే మార్కెట్ ప్రీమియం ఆధారంగా లిస్టింగ్ రోజు లాభాలను కూడా అంచనా వేస్తుంటారు. ఈ నేపథ్యంలో సెబీ చీఫ్ ప్రీ ట్రేడింగ్ అంశాన్ని ప్రస్తావించారు. ఇన్వెస్టర్లు షేర్లు విక్రయించాలని అనుకున్నప్పుడు నియంత్రిత మార్కెట్‌కు లోబడి వారికెందుకు ఆ అవకాశం ఇవ్వకూడదు? అని సెబీ చీఫ్ అన్నారు. లిస్టింగ్‌కు ముందు గ్రే మార్కెట్‌లో జరుగుతున్న కార్యకలాపాలు సరికాదన్నారు. ఇదే అంశంపై మీడియాతో మాట్లాడారు. ''ఒకవేళ మీకు షేర్లు అలాటై, వాటిని అమ్మాలి అనుకుంటే.. వ్యవస్థీకృత మార్కెట్‌లోనే వాటిని ఎందుకు అమ్మకూడదు? 'వెన్ లిస్టెడ్'గా వ్యవహరించే ఈ ప్రీట్రేడింగ్ విధానం తీసుకొచ్చేందుకు స్టాక్ ఎక్స్ఛేంజీలతో ప్రస్తుతం సంప్రదింపులు కొనసాగుతున్నాయి'' అని సెబీ చీఫ్ మాధవి పురీ బచ్ తెలిపారు.


## భారీ నష్టాల్లో సూచీలు.. ₹7లక్షల కోట్లు ఆవిరి



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. పొరుగు దేశాలైన మెక్సికో, కెనడా దేశాలపై ట్రేడ్ టారిఫ్‌లు విధిస్తామని ప్రకటించడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికి తోడు రిలయన్స్ ఇండస్ట్రీస్, జొమాటో వంటి ప్రధాన షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఓ దశలో 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ సైతం 23వేల స్థాయిని కోల్పోయింది. ఆఖర్లో సూచీలు కాస్త కోలుకున్నాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.7 లక్షల కోట్ల మేర క్షీణించి రూ.424 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,261.72 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,073.44) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఓ దశలో 700 పాయింట్ల మేర కోల్పోయిన సూచీ.. తర్వాత స్వల్ప లాభాల్లోకి వచ్చింది. మళ్లీ నష్టాల్లోకి వెళ్లిన సూచీ.. చివరి గంటలో భారీగా పతనమైంది. ఇంట్రాడేలో 75,641.87 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి పాయింట్ల 1235 పాయింట్ల నష్టంతో 75,838.36 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 320 పాయింట్ల నష్టంతో 23,024.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.58గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు మినహా అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. జొమాటో, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 79 డాలర్లు వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2732.20 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**నష్టాలకు కారణాలు ఇవే..**

అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పొరుగు దేశాలైన కెనడా, మెక్సికోపై 25 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. భారత్ సహా ఇతర దేశాలపైనా సుంకాలు విధిస్తామని గతంలో వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారోనన్న ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. నిన్నటి త్రైమాసిక ఫలితాలతో నిరాశపరిచిన జొమాటో నేడు ఓ దశలో 11 శాతం మేర నష్టపోయింది. దీనికి తోడు అధిక వెయిటేజీ కలిగి స్టాక్స్ అయిన ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ వంటి షేర్లలో అమ్మకాలతో సూచీలు భారీగా పతనమయ్యాయి. అమెరికాలో డాలరు, బాండ్ ఈల్డ్స్ పెరుగుతుండడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. జనవరి నెలలోనే దాదాపు రూ.50వేల కోట్ల మేర అమ్మకాలు జరిపారు. మార్కెట్ల పతనానికి ఇదీ ఓ కారణంగా నిలిచింది. మొదటి రెండు త్రైమాసిక ఫలితాల్లానే ప్రస్తుతం వెలువడుతున్న మూడో త్రైమాసిక ఫలితాలు కూడా నిరాశాజనకంగా ఉండడం కూడా మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతీసింది. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. దేశంలో వినియోగాన్ని పెంచేందుకు, తయారీని ప్రోత్సహించేందుకు ఈ సారి బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటారన్న అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో బడ్జెట్‌కు ముందు మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.



## ప్రతి లావాదేవీపై రివార్డ్స్.. ఐడీఎఫ్‌సీ నుంచి ఫస్ట్ ఎర్న క్రెడిట్ కార్డ్

**ముంబయి:** ప్రైవేటురంగానికి చెందిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ .. రూపే భాగస్వామ్యంతో కలిసి సరికొత్త క్రెడిట్ కార్డ్‌ని లాంచ్ చేసింది. ఫస్ట్ ఎర్న పేరిట యూపీఐ ఆధారిత సెక్యూర్డ్ క్రెడిట్ కార్డ్‌ను తీసుకొచ్చింది. బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేవారికి ఈ కార్డుల్ని జారీ చేయనుంది. కార్డ్ సాయంతో కస్టమర్లు యూపీఐ జరప వచ్చని, ప్రతి లావాదేవీపై క్యాష్‌బ్యాక్, రివార్డులు పొందొచ్చని బ్యాంక్ తెలిపింది. ఈ వర్చువల్ క్రెడిట్ కార్డ్ సాయంతో సౌకర్యవంతంగా లావాదేవీలు చేయవచ్చని బ్యాంక్ తెలిపింది.

**ప్రయోజనాలు ఇవే..**

కొత్త కార్డ్ హోల్డర్లు మొదటి యూపీఐ లావాదేవీల మొత్తం 100 శాతం (రూ.500 వరకు) క్యాష్‌బ్యాక్ పొందొచ్చు. అయితే కార్డ్ క్రియేట్ చేసిన 15 రోజుల వరకు ఈ సదుపాయం ఉంటుంది. ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ద్వారా జరిపే యూపీఐ లావాదేవీలపై 1 శాతం క్యాష్‌బ్యాక్, ఇతర యాప్‌ల ద్వారా చేసే లావాదేవీలు, బీమా చెల్లింపులు, యుటిలిటీ బిల్లులు, ఇ- కామర్స్ కొనుగోళ్లపై 0.5 శాతం క్యాష్‌బ్యాక్ అందిస్తుంది. సంవత్సరం 1 రోజు కాలపరిమితితో చేసే ఎఫ్‌డీపై 7.25 శాతం వడ్డీ అందిస్తుంది. జొమాటో తీసుకొచ్చిన District సాయంతో మూవీ టికెట్లు కొనుగోలు చేస్తే 25 శాతం (రూ. 100వరకు) తగ్గింపు పొందొచ్చు. రూ.1,399 విలువైన రోడ్ అసిస్టెంట్స్, కార్డ్ పోగొట్టుకుంటే రూ.25వేల వరకు లాస్ట్ కార్డ్ లయబిలిటీ, రూ.2 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా అందిస్తోంది. ఈ యూపీఐ ఆధారిత క్రెడిట్ కార్డ్ సాయంతో 60మిలియన్లకు పైగా క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయొచ్చు.

## కొందరి చేతుల్లోనే స్టీల్, సిమెంట్ పరిశ్రమలు

### గడ్కరీ ఆందోళన

**ముంబయి:** సిమెంట్, స్టీల్ వ్యాపారాలు కొందరి చేతుల్లో ఉండడంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇది దేశానికి పెద్ద సమస్య అని, మౌలిక సదుపాయాల అభివృద్ధికి విఘాతమని పేర్కొన్నారు. ఈ రెండు రంగాల్లో పరిమిత సంఖ్యలో తయారీదారులు ఉండడం వల్ల వారు కుమ్మక్కవుతున్నారని ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యానించారు. స్టీల్, సిమెంట్ రంగాల్లో పరిమిత సంఖ్యలో ప్లేయర్లు ఉండడం వల్ల వారే ధర నిర్ణయిస్తున్నారని, ఇలాంటి పరిస్థితి దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి విఘాతమని అభిప్రాయపడ్డారు. స్టీల్, సిమెంట్ కంపెనీల ఆధిపత్యానికి చెక్ పెట్టాలంటే ఫైబర్-రీఇన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా మారాల్సిన అవసరం ఉందని గడ్కరీ అన్నారు. అందుకు కావాల్సిన సహకారాన్ని తాము అందిస్తామని చెప్పారు. తయారీదారులు సైతం తమ వంతుగా ధరలను 20-25 శాతం మేర తగ్గించాల్సి ఉందన్నారు. అది దేశానికి ఎంతో మంచిదని పేర్కొన్నారు. పరిశోధన, అభివృద్ధిపై ఎఫ్ఆర్‌పీ తయారీదారులు మరింత ఖర్చు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎఫ్ఆర్‌పీని ఇన్‌ఫ్రా, ఏవియేషన్, షిప్పింగ్, రహదారుల నిర్మాణం, మెట్రో రైలు వంటి ప్రాజెక్టుల్లో వినియోగించొచ్చని పేర్కొన్నారు. ఆటోమొబైల్ రంగంలో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్నామని, రాబోయే ఐదేళ్లలో అతిపెద్ద ఆటోమొబైల్ హబ్‌గా నిలపాలన్నదే తమ లక్ష్యమని గడ్కరీ వ్యాఖ్యానించారు.



# చిలుకూరు ఆలయంలో ప్రియాంకా చోప్రా..

## కొత్త ప్రయాణమంటూ పోస్టు

ప్రముఖ నటి ప్రియాంకా చోప్రా హైదరాబాద్ నగర శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించారు. సంబంధిత ఫొటోలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బాలాజీ ఆశీస్సులతో కొత్త ప్రయాణం మొదలు పెడుతున్నట్టు తెలిపారు. భగవంతుడి దయ అనంతం అని పేర్కొన్నారు. అష్టాక్షరి మంత్రం ఓం నమో నారాయణాయ అని క్యాప్షన్‌లో పెట్టారు. రామ్‌చరణ్ సతీమణి, అపోలో సంస్థల ఉపాధ్యక్షురాలు ఉపాసనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లవ్ ఎమోజీలు జోడించారు. ఉపాసన స్పందిస్తూ.. 'మీ కొత్త సినిమా మంచి విజయం అందుకోవాని ఆకాంక్షిస్తున్నా. శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహం మీకు ఉంటుంది' అని రిప్లై ఇచ్చారు.బాలీవుడ్‌లో స్టార్‌గా రాణించి.. ఆ తర్వాత హాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూ ప్రియాంక బిజీ అయ్యారు. అమెరికాకు చెందిన నిక్ జొనాస్‌ను పెళ్లి చేసుకున్నారు. లాస్ ఏంజెలెస్ నుంచి ఆమె కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ వచ్చారు. మహేశ్ బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కించనున్న SSMB29 (వర్కింగ్ టైటిల్)లో ప్రియాంక హీరోయిన్‌గా ఎంపికయ్యారంటూ ఇటీవల వార్తలొచ్చాయి. ఆ ప్రాజెక్టు కోసమే ఆమె హైదరాబాద్ వచ్చారంటూ నెట్టింట చర్చ జరిగింది. ఆ సినిమాని ఉద్దేశించే కొత్త ప్రయాణమని చెప్పినట్టు పలువురు సినీ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. రామ్ చరణ్, ప్రియాంక కలిసి గతంలో 'జంజీర్' (తెలుగులో తుఫాన్) సినిమాలో నటించిన సంగతి తెలిసిందే.

# ఓ హీరో పాట షూటింగ్ సమయంలో నాతో తప్పుగా ప్రవర్తించాడు

ప్రతి ఇండస్ట్రీల్లోనూ మహిళలకు వేధింపులు తప్పడం లేదు. పని చేసే ప్రతిచోట అమ్మాయిలు అభద్రతా భావంతో ఉన్నారని ఇటీవల ఓ సర్వేలో తేలింది.ఇక సినిమా ఇండస్ట్రీలో లైంగిక వేధింపుల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ ఉందని చాలామంది బహిరంగంగానే వెల్లడించారు. తమకు ఎదురైన లైంగిక వేధింపులు, కాస్టింగ్ కౌచ్, కమిట్మెంట్‌ల గురించి హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఇటీవల పలు సందర్భాల్లో వెల్లడిస్తున్నారు. తాజాగా ఓ హీరోయిన్ తన కెరీర్‌లో ఎదురైన ఓ చేదు అనుభవం గురించి వెల్లడించింది.హీరోయిన్ సంజనా గల్రానీ గురించి తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచియం చేయాల్సిన పనిలేదు. 'సోగ్గాడు','బుజ్జిగాడు', గబ్బర్ సింగ్ వంటి సినిమాల్లో సంజనా గల్రానీ నటించింది. తెలుగుతో పాటు, తమిళ, మలయాళ, కన్నడ చిత్రాల్లోనూ ఈ భామ హీరోయిన్‌గా నటించింది. తాజాగా ఈ భామ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..తనకు ఎదురైన లైంగిక వేధింపుల గురించి విషయాన్ని బయటపెట్టింది. ఓ కన్నడ హీరో పాట షూటింగ్ సమయంలో తనతో తప్పుగా ప్రవర్తించాడని చెప్పుకొచ్చింది. సీన్‌కు ఓకే చెప్పగానే ఆ హీరో వచ్చి నా భుజాలను పట్టుకోని గట్టిగా నలిపేశాడు. ఆ నొప్పిని భరించలేకపోయాను. ఏంటి అంత గట్టిగా నొక్కేరని అడిగితే.. మేనేజ్ చేసుకో అంటూ పొగరుగా సమాధానం ఇచ్చాడు. నాకు కోపం వచ్చింది. వెంటనే నేను ఓ అరగంట నీతో షూట్ చేయనన్నాను. నేను నీతో దెబ్బలు తినడానికి హీరోయిన్‌గా రాలేదు. నేనేమీ రౌడీని కాదు.. నీతో యాక్షన్ సీన్స్ చేయడానికి అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయానని సంజనా గల్రానీ చెప్పుకొచ్చింది. అయితే సదరు హీరో పేరు చెప్పడానికి మాత్రం సంజనా గల్రానీ ఇష్టపడలేదు. ప్రస్తుతం సంజనా గల్రానీ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.



# 'మీర్జాపూర్3' టూ 'మిడిల్ క్లాస్ బయోపిక్'

## భారత్‌లో అత్యధికమంది వీక్షించిన సిరీస్‌లివే!


2024లో అత్యధికమంది వీక్షించిన వెబ్‌సిరీస్‌గా 'మీర్జాపూర్3' రికార్డు సృష్టించింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్‌ను 30.8 మిలియన్ల మంది చూశారట. ఓటీటీ కంటెంట్‌ను విశ్లేషించే ఆర్మ్యాక్స్ మీడియా తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. అంతేకాదు, వివిధ ఓటీటీ వేదికల్లో అత్యంత వీక్షకాదరణ సొంతం చేసుకున్న వెబ్‌సిరీస్‌లు, సినిమాలకు సంబంధించిన వివరాలనూ వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఓటీటీ లవర్స్ ఆసక్తిగా ఎదురు చూసిన వెబ్‌సిరీస్‌ల్లో 'స్క్విడ్‌గేమ్2' ఒకటి. క్రిస్మస్ సందర్భంగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ సిరీస్ రికార్డులు తిరగరాసింది. ఇప్పటివరకూ 'మనీ హెయిస్ట్' పేరిట ఉన్న అత్యధిక వీక్షణలను దాటేసింది. అంతేకాదు, భారత్‌లోనూ ఈ సిరీస్‌కు మంచి ఆదరణ దక్కిందని ఆర్మ్యాక్స్ తెలిపింది.

**ఇండియాలో హిందీ వెబ్‌సిరీస్‌లదే హవా!**

భారతీయ ఓటీటీ పరిశ్రమలో ముఖ్యంగా హిందీ బెల్ట్‌లో ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్‌ల హవా కొనసాగుతోంది. టాప్-15 ఒరిజినల్స్ ఈ వేదికలగానే స్ట్రీమింగ్ అవుతుండటం గమనార్హం. 'మీర్జాపూర్3' సిరీస్ తర్వాత అత్యధికంగా 'పంచాయత్3'ని 28.2 మిలియన్ల మంది వీక్షించారు. ఆ తర్వాతి స్థానంలో సంజయ్ లీలా భన్సాలీ 'హీరామండి: ది డైమండ్ బజార్' 21.5 మిలియన్ వ్యూవర్స్‌తో మూడో స్థానంలో ఉంది. ఇక నేరుగా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చిన చిత్రాల్లో టాప్-15లో 11 చిత్రాలు నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చినవే. వీటిలో దోపత్తి (15.1 మిలియన్), సెక్టార్ 36 (13.9మిలియన్) సికిందర్ కా ముకద్దార్ (13.5మిలియన్) ఉన్నాయి. ఇక 2024లో అత్యధిక మంది లైక్ చేసిన సిరీస్‌గా 'పంచాయత్3' నిలిచింది. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'మహారాజ' చిత్రాన్ని ఎక్కువ మంది ప్రేక్షకులు ఇష్టపడ్డారు.

**ప్రాంతీయ భాషల్లో వీటిదే హైలైట్..**

ప్రాంతీయ భాషల్లోనూ ఓటీటీ కంటెంట్‌ను చూసేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు ఆర్మ్యాక్స్ నివేదిక చెప్పింది. తమిళ, తెలుగు భాషల్లో డిస్నీ+హాట్‌స్టార్ టాప్‌లో ఉంది. 'సేవ్ ది టైగర్స్: సీజన్2'ను అత్యధికంగా 5 మిలియన్ల మంది వీక్షించారట. ఆ తర్వాత బుజ్జి అండ్ భైరవ (4.9 మిలియన్) ఉండగా, తమిళంలో ఇన్‌స్పెక్టర్ రిషి టాప్‌లో ఉంది. ప్రాంతీయంగానూ ఇంటర్నేషనల్ కంటెంట్ చూసే వారి సంఖ్య భారీగానే ఉందట. 'స్క్విడ్ గేమ్2', 'హౌస్ ఆఫ్ డ్రాగన్2', 'రోడ్ హౌస్' తదితర కంటెంట్‌కు విశేష ఆదరణ లభించింది. ఇక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న #90's ఎ మిడిల్ క్లాస్ బయోపిక్ అత్యధికమంది ఇష్టపడిన సిరీస్‌గా రేటింగ్ సొంతం చేసుకున్నట్లు ఆర్మ్యాక్స్ మీడియా తెలిపింది.




# రామ్‌గోపాల్ వర్మతో విభేదాల్లేవు



'అంతం', 'గాయం', 'రంగీలా', 'సత్య'.. ఇలా రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కించిన చిత్రాల్లో హీరోయిన్‌గా నటించి మంచి గుర్తింపు పొందిన నటి ఊర్మిళా మాతోండ్కర్. హిట్ కాంబినేషన్‌గా నిలిచిన వీరిద్దరు ఆ తర్వాత మళ్లీ కలిసి పనిచేయకపోవడంపై బాలీవుడ్‌లో పలు ఊహాగానాలు వచ్చాయి. 'సత్య' రీ రిలీజ్ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో 'మీ మధ్య విభేదాలా?' అనే ప్రశ్న ఎదురవగా ఆమె స్పందించారు. డైరెక్టర్‌తో అభిప్రాయభేదాల్లేవని స్పష్టం చేశారు. ''మేం మళ్లీ కలిసి పని చేయకపోవడానికి ప్రత్యేక కారణమంటూ ఏం లేదు. ఆయన తెరకెక్కించిన 'కంపెనీ' (2002), 'రామ్‌గోపాల్ వర్మ కీ ఆగ్' (2007) చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో నటించా. గొప్ప దర్శకుల్లో ఆర్జీవీ ఒకరు. ఆయన సినిమా ఇన్‌స్టిట్యూషన్. ఆయన దర్శకత్వంలో నటించినందుకు గర్వపడుతున్నా. అవకాశం వస్తే రామ్‌గోపాల్ వర్మ, మనోజ్ బాజ్‌పాయ్‌తో కలిసి మళ్లీ సినిమా చేసేందుకు ఆసక్తిగా ఉన్నా'' అని తెలిపారు.రికార్డుల 'సత్య' జేడీ చక్రవర్తి, మనోజ్ బాజ్‌పాయ్, ఊర్మిళ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమే 'సత్య'. 1998లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ సినిమా ఈ నెల 17న పలు థియేటర్లలో రీ రిలీజైంది. ఇండియన్ పనోరమ విభాగంలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఉత్తమ సహాయ నటుడిగా మనోజ్ బాజ్‌పాయ్‌కు జాతీయ అవార్డు అందుకున్నారు. హీరోయిన్‌గా ముందు మహిమా చౌదరిని తీసుకోవాలనుకున్నారుగానీ ఫైనల్‌గా ఊర్మిళను ఎంపిక చేశారు. ఊర్మిళ చివరిగా 2018లో వచ్చిన 'బ్లాక్‌మెయిల్' సినిమాలో స్పెషల్ సాంగ్‌లో నటించారు.

# ఐడెంటిటీ తెలుగు ట్రైలర్ లాంచ్ ఈనెల 24న విడుదల



అఖిల్ పాల్, అనాస్ ఖాన్ రచన దర్శకత్వంలో రాజు మల్లియాత్, రాయ్ సిజె నిర్మాతలుగా టోవినో థామస్, త్రిష ప్రధాన పాత్రలు పోషిస్తూ వినయ్ రాయ్, మందిర బేడి తదితరులు కీలకపాత్ర పోషిస్తూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం ఐడెంటిటీ. మలయాళంలో విడుదలైన ఈ చిత్రం రెండు వారాలలో 50 కోట్లకు పైగా వసూలు చేసి 2025 లో తొలి హిట్ సినిమాగా నిలిచింది. జేక్స్ బెజోయ్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించగా అఖిల్ జార్జ్ సినిమాటోగ్రఫీ చేశారు. ఈ చిత్రానికి చామన్ చక్కో ఎడిటింగ్ చేశారు. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులకు అత్యంత చెరువుగా మూవీ మాక్స్ శ్రీనివాస్ మామిడాల సమర్పణలో శ్రీ వేదాక్షర మూవీస్ చింతపల్లి రామారావు గారు కలిసి ఈ చిత్రం తెలుగు రాష్ట్రాలలో విడుదల కానుంది. ఈ నెల 24వ తేదిన తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే నేడు హైదరాబాదులో చిత్ర యూనిట్ సమక్షంలో ఈ చిత్ర తెలుగు ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా మామిడాల శ్రీనివాస్ మాట్లాడుతూ... ఈ చిత్రం మలయాళంలో జనవరి 2వ తేదీన విడుదలై ఇప్పటికే 40 కోట్లకు పైగా వసూలు చేసింది. సంక్రాంతి సమయానికి ఇక్కడ సినిమాలు ఉండటంవల్ల అదే సమయంలో విడుదల చేయలేకపోయాము. అందుకే ఈనెల 24వ తేదీన విడుదల చేస్తున్నాము. ఈ చిత్రంలో మన తెలుగువారి కొడుకుని యాక్షన్ కంటెంట్ చాలా బాగుంటుంది. ఇప్పటికే ఈ చిత్రం మలయాళంలో బాగా ప్రేక్షకుల మరణ పొందడంతో తెలుగులో కూడా ఈ చిత్రం అలాగే ఉంటుందని ఎన్నో అంచనాలు ఉన్నాయి. అనుకొని కారణాలవల్ల హీరో టోవినో థామస్, హీరోయిన్ త్రిష ఈ వేడుకకు రాలేకపోయారు. దర్శకులు ఎంతో జాగ్రత్తగా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు అర్థమవుతుంది. ఈ చిత్రం కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందని కోరుకుంటున్నాను. దర్శకులు ఈ కార్యక్రమానికి రావడం ఎంతో సంతోషకరంగా ఉంది" అన్నారు.

చింతపల్లి రామారావు మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి విచ్చేసిన మీడియా వారికి, స్నేహితులకి, సన్నిహితులకి అందరికీ పేరుపేరునా నా కృతజ్ఞతలు. ఈ నూతన సంవత్సరంలో సంచలన వసూలతో గొప్ప విజయం సాధించింది ఐడెంటిటీ సినిమా. మామిడాల శ్రీనివాసరావు గారితో కలిసి సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నాము. ఇది మలయాళ చిత్రం అయినప్పటికీ ఈ చిత్రంలో నటించిన వారు అలాగే ఈ సినిమాకు పనిచేసినవారు తెలుగునాట అందరికీ సుపరిచితులు కావడం విశేషం. ఈ చిత్రం ద్వారా దర్శకులకు తెలుగులో మంచి గుర్తింపు వస్తుందని కోరుకుంటున్నాము. జనవరి 24వ తేదీన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులు ముందుకు రానుంది. యాక్షన్ త్రిలరైనటువంటి ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా వినోదపరుస్తుందని కోరుకుంటున్నాను" అన్నారు.

అఖిల్ పాల్ మాట్లాడుతూ...ఈ సినిమా మొదలైనప్పటికి నుండి సుమారు రెండు మూడు సంవత్సరాలుగా నాతో ప్రయాణం చేస్తున్న చిత్ర కథానాయకుడు టోవినో థామస్. చిత్ర నిర్మాతలతో కలిసి ఆయన కూడా ఈ సినిమా కోసం నిలబడ్డారు. మలయాళం సినిమా బడ్జెట్ తో పోలిస్తే ఈ చిత్రం బడ్జెట్ కొంచెం ఎక్కువగానే అయింది. ఈ చిత్రం ఎంతోమంది ప్రముఖ నటీనటులు, సాంకేతిక సిబ్బంది ముందుకు వచ్చి పని చేశారు. ఈ చిత్రం మొదలైన సమయంలోనే ఈ చిత్రాన్ని దేశమంతుడు చూపించాలని మేము అనుకున్నాము. అందుకే ముందు నుండి కూడా ఈ సినిమా కోసం చాలా జాగ్రత్తగా పని చేసాము. స్క్రిప్ట్ నుండి యాక్షన్ సీన్స్ వరకు చాలా జాగ్రత్త పడ్డాము. తెలుగు ప్రేక్షకుల ముందుకు ఈ సినిమాని తీసుకురావడానికి ఎంతో గర్వంగా ఫీల్ అవుతున్నాను. కేరళలో సాధించినట్లు ఎక్కడ కూడా పెద్ద విజయాన్ని సాధిస్తుందని అనుకుంటున్నాను. ట్రైలర్ ఎంత పవర్ఫుల్ గా వచ్చింది. అంతే పవర్ ఫుల్ గా ఈ సినిమా కూడా ఉండబోతుంది" అన్నారు.

నటుడు వినయ్ రాయ్ మాట్లాడుతూ...తెలుగులో ప్రశాంత్ వర్మ నన్ను ప్రేక్షకులందరికీ ఎంతగా గుర్తుండిపోయిన చేశారో మలయాళం లో కూడా అఖిల్ ఆ స్థాయిలో నాకు గుర్తింపు వచ్చేలా చేశారు. నా 18 సంవత్సరాల కెరియర్ లో ఇటువంటి కథను నేను ఎప్పుడు వినలేదు. ఈ చిత్రంలో యాక్షన్, సస్పెన్స్, మంచి స్టోరీ లైన్ ఇలా అన్నీ ఉన్నాయి. ఈ చిత్రం తెలుగువారికి ఎంతో నచ్చుతుందని అనుకుంటున్నాను. తెలుగు నిర్మాతలకు ఈ చిత్రం మంచి బిజినెస్ చేస్తుందని అనుకుంటున్నాను. జనవరి 24వ తేదీన ఈ చట్టం ప్రేక్షకులు ముందుకు రాబోతుంది" అంటూ ముగించారు. ఈ చిత్రం లో టోవినో థామస్, త్రిష, వినయ్ రాయ్, మందిరా బేడి తదితరులు నటించారు.

# 'సంక్రాంతికి వస్తున్నాం'

## ఏడు రోజులు.. రూ.203 కోట్లు..




**హైదరాబాద్:** వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతోంది. విడుదలై వారం రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.203+ కోట్లు వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటించిన ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ ఏడాది పెద్ద పండగకు వచ్చిన సినిమాల్లో చివరన విడుదలైన ఈ చిత్రం వసూళ్లలో మాత్రం అన్నింటి కంటే ముందు ఉంది. ముఖ్యంగా ఫ్యామిలీ ప్రేక్షకులు సినిమా చూసేందుకు థియేటర్‌కు క్యూ కడుతున్నారు. అమెరికాలోనూ 'సంక్రాంతికి వస్తున్నాం' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటివరకూ 2.3 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసింది. వెంకటేశ్, అనిల్ రావిపూడి, వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. సంక్రాంతి సెలవులు పూర్తయినా తెలుగు రాష్ట్రాల్లో ఈ మూవీకి ఆక్యుపెన్సీ ఏమాత్రం తగ్గడం లేదు. రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్'కే కేటాయించిన చాలా స్క్రీన్‌లలో ఈ మూవీని ప్రదర్శిస్తున్నారు. మరోవైపు ఈ వారం కూడా బాక్సాఫీస్ వద్ద క్రేజీ చిత్రాలేవీ లేకపోవడం వెంకటేశ్ మూవీకి కలిసొచ్చే అంశం.

**వెంకటేశ్‌కూ ఇదొక రికార్డు**

ఇప్పటివరకూ వెంకటేశ్ నటించిన చిత్రాల్లో అత్యధిక గ్రాస్ కలెక్షన్స్ మూవీ అంటే 'ఎఫ్2' ఉండేది. ప్రపంచవ్యాప్తంగా ఆ మూవీ రూ.132 కోట్లు కలెక్ట్ చేసింది. అయితే, అందులో వరుణ్ తేజ్ కూడా మరో హీరోగా ఉన్నారు. సోలో హీరోగా వెంకటేశ్ రూ.100 కోట్లు వసూలు చేసిన సినిమాగా ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం' రికార్డు సృష్టించింది. సీనియర్ హీరోల్లో చిరంజీవి తర్వాత ఈ రికార్డును అందుకున్న నటుడిగా వెంకటేశ్ రికార్డు సృష్టించారు. ఇక భీమ్స్ సిసిరోలియో అందించిన పాటలు కూడా అలరిస్తున్నాయి. 'గోదారి గట్టు' సాంగ్ యూట్యూబ్‌లో టాప్-100 మ్యూజిక్ వీడియోల్లో నెంబర్1లో ఉంది. ఇప్పటివరకూ 121 మిలియన్ వ్యూస్‌తో ఈ సాంగ్ దూసుకుపోతోంది.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com